
Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

| మంగళవారం, అక్టోబర్ 01, 2024 | సంపుటి - 20 | సంచిక 10 | వెల - 4రూ | పేజీలు - 12 |
|---|---|---|---|---|

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.



## మిథున్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు

### ప్రధాని మోడీ అభినందనలు

మన దేశంలో సినీ రంగానికి సంబంధించి ప్రతిష్ఠాత్మకంగా భావించే అవార్డుల్లో 'దాదా సాహెబ్ ఫాల్కే' ప్రధానమైనది. ఈ ఏడాది అవార్డుకు ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి ఎంపికైనట్టు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తాజాగా ప్రకటించింది. అక్టోబర్ 8న జరగనున్న జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ కేంద్ర, సమాచార మంత్రి అశ్విని వైష్ణవ్ పోస్ట్ పెట్టారు. మిథున్ చక్రవర్తి అద్భుతమైన సినీ ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. 2లో

## శని, ఆదివారాల్లోనే కూల్చివేతల మతలబు ఏంటి

**కూల్చివేతలకు ముందు ఓనర్లకు సమయం ఇవ్వరా**

**చట్టప్రకారం నడుచుకోక పోతే హైడ్రాపైనే స్టే విధిస్తాం**

**హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు ఆగ్రహం**

**వచ్చేనెల 15 వరకు విచారణ వాయిదా**


మిగతాది 2లో

హైదరాబాద్ : హైడ్రా తీరుపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో కూల్చివేతలపై పలువురు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై సోమవారం విచారణ జరిగింది. విచారణకు హైడ్రా కమిషనర్ రంగానథ్ వర్చువల్‌గా, అమీన్‌పూర్ తహసీల్దార్ కోర్టులో హాజరై వివరణ ఇచ్చారు. శని, ఆది వారాలు, సూర్యాస్తమయం తర్వాత ఎందుకు కూల్చివేతలు చేపడుతున్నారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.




అక్టోబర్ 9వ తేదీన ఎల్బీ స్టేడియంలో డీఎస్సీ నియామక పత్రాలు అందజేస్తామని తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఉదయం సచివాలయంలో డీఎస్సీ పరీక్షల ఫలితాలను సిఎం రేవంత్ విడుదల చేసారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేవలం 55 రోజుల్లోనే డీఎస్సీ ఫలితాలు ఇచ్చామని తెలిపారు. 1:3 నిష్పత్తిలో వెరిఫికేషన్ ఉంటుందని చెప్పారు. అక్టోబర్ 9న ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు ఇస్తామని ప్రకటించారు. పదేళ్లలో గత ప్రభుత్వం ఒకే ఒక్క డీఎస్సీ ఇచ్చిందని విమర్శించారు.

# 55 రోజుల్లోనే డీఎస్సీ ఫలితాలు ఇచ్చాం

### అక్టోబర్ 9న డీఎస్సీ నియామక పత్రాలు

### డిఎస్సీ ఫలితాలు విడుదల చేసిన సిఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ : టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామని, త్వరలోనే గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించి ఫలితాలు ఇస్తామని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. డీఎస్సీ 2024 ఫలితాలను విడుదల చేసిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మరో గుడ్ న్యూస్ చెప్పారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు పరిస్థితులు ఖాళీలు చూసుకొని డీఎస్సీపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఉద్యోగ నియామక ప్రక్రియ అనేది నిరంతరం సాగేదని అన్నారు. ఇప్పుడు డీఎస్సీ ప్రక్రియ నియామక ప్రక్రియ పూర్తి అయిన తర్వాత ఇందులో ఉన్న మిగిలిపోయే ఖాళీలు, కొత్తగా ఏర్పడే ఖాళీలు తెప్పించు కొని డీఎస్సీపై నిర్ణయం తీసు కుంటామన్నారు. కచ్చితంగా ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ప్రకారమే ఉద్యోగాలు నియామకాలు జరుగుతా యన్నారు. ప్రభుత్వం లో ఉన్న ఏ ఉద్యోగం కూడా ఖాళీ లేకుండా భర్తీ చేస్తామని అన్నారు. త్వరలోనే గ్రూప్ 1 రిజల్ట్స్ కూడా ఇస్తామన్నారు. 2లో



## డిజిటల్ కార్డులపై 3నుంచి క్షేత్రస్థాయి పరిశీలన

### అధికారులతో మరోమారు సిఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్ : కుటుంబ డిజిటల్ కార్డుల పంపిణీ సమయంలో కుటుంబ సభ్యులు అంగీకరిస్తేనే కుటుంబం ఫొటో తీయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం గుర్తించిన కుటుంబాన్ని నిర్ధరించాలన్నారు. కుటుంబ డిజిటల్ కార్డులపై సోమవారం సీఎం సమీక్ష నిర్వ హించారు. డిజిటల్ కార్డుల కోసం సేకరించే వివరాలను అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. 2లో

## మూసీ రివర్ ఫ్రంట్ పెద్ద స్కామ్

**లక్షన్నర కోట్లు పెట్టి ఏం సాధిస్తారు**

**ఇళ్లు ఇస్తామని..ఇప్పుడు కూలుస్తారా**

**మూసీలో పట్టాలు ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ**

**నమామి గంగే ప్రాజెక్టుకే 40వేల కోట్లు**

**సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ కెటిఆర్**



హైదరాబాద్ : మూసీ రివర్ ఫ్రంట్ పెద్ద స్కామ్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామా రావు ఆరోపించారు. లక్షన్నర కోట్లు కర్చు పెట్టి ఎవరిని ఉద్దరిస్తారని అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. 'మూసీ ప్రాజెక్టు విషయంలో సీఎంని ప్రశ్నిస్తున్నా. మేం మొత్తం దేశంలో ఉండే అన్ని ప్రాజెక్టుల వివరాలు తెప్పించాం. నామామి గంగే డీపీఆర్, ప్రాజెక్ట్ వివరాలు.. ప్రాజెక్టు పూర్వపరాలు తెప్పించాం. నమామి గంగే ప్రాజెక్టుపై ఆసక్తితో వివరాలు తెప్పించాను. 2400 కిలోమీటర్ల గంగానది ప్రక్షాళన కోసం కేంద్రం ఈ ప్రాజెక్ట్ స్టార్ట్ చేసింది. ఈ ప్రాజెక్టుకు పెట్టిన బడ్జెట్ రూ.40వేలకోట్లు. 2400 కిలోమీటర్ల గంగా నదికి రూ.40వేలు కోట్లు. 50 కిలోమీటర్ల 2లో

## మూసీ సుందరీకరణకు హైడ్రాకు సంబంధం లేదు

### మూసీలో మార్కింగ్ కూడా మేం చేపట్టడం లేదు

### ఇదంతా మూసీ రివర్ ఫ్రంట్ కార్యక్రమన్న రంగనాథ్



హైదరాబాద్ : మూసీ సుందరీకరణపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక ప్రకటన చేశారు. నదికి ఇరువైపులా సర్వేలతో హైడ్రాకు సంబంధం లేదన్నారు. మూసీ నది పరిధిలో నివసిస్తున్న వారిని హైడ్రా తరలించడం లేదని, నదిలో ఎలాంటి కూల్చి వేతలు చేపట్టడం లేదన్నారు. నదీ పరివాహక ప్రాంతం లోని ఇళ్లపై హైడ్రా మార్కింగ్ చేయడం లేదని, మూసీ సుందరీకరణ అనేది ప్రత్యేక ప్రాజెక్టని చెప్పారు. దానిని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపడుతోందని వెల్లడించారు. మూసీ నదీ పరివాహక ప్రాంతంలో ఇటీవల 2లో

## దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచండి

**శ్రీవారి లడ్డూలో కల్తీ జరిగిందని ఎలా గుర్తించారు**

**లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగంపై ఆధారాలు ఉన్నాయా**

**వివరాలు తెలియకుండా ముఖ్యమంత్రి ఎలా ప్రకటిస్తారు**

**ప్రస్తుత పరిస్తితుల్లో సిట్ దర్యాప్తుపై అనుమానాలు**

**సుప్రీం ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం వివాదంపై సుప్రీంకోర్టు ఘాటుగా స్పందించింది. దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచాలని హితవు పలికింది. లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించారనడానికి ఆధారాలు ఏమైనా ఉన్నాయా అని ప్రభుత్వం తరపున న్యాయవాది ముకుల్ రోహత్గీని జస్టిస్ బి ఆర్ గవాయ్, జస్టిస్ కేవీ వి బాలకృష్ణన్ ధర్మాసనం ప్రశ్నించింది. కల్తీ నెయ్యిని లడ్డూలో వాడారో లేదో పూర్తిగా తెలియకుండా ముఖ్యమంత్రి ఎలా ప్రకటన చేస్తారని సుప్రీంకోర్ట్ నిలదీసింది. ఈ అంశంపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) నియమించిన అనంతరం కల్తీ నెయ్యిపై మీడియా ముందు ప్రకటన చేయడంపై ధర్మాసనం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. మిగతా 2లో

## అవినీతితో కంపు కొడుతున్న కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు

**హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**



కరీంనగర్ : బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అవినీతితో కంపు కొడుతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. కరీంనగర్‌లో బండి సంజయ్ మాట్లాడారు. కాళేశ్వరం పేరుతో బిఆర్ఎస్ 2లో

## కెసిఆర్ పదేళ్లపాటు రైతులను మోసం చేశారు

### ఇప్పుడు అదే బాటలో కాంగ్రెస్ ప్రభుత్వం

### బిజెపి రైతు దీక్షలో ఎంపి రఘునందన్ రావు

హైదరాబాద్ : కేసీఆర్ పదేళ్ల పాటు చాలా హామీలు ఇచ్చి రైతులను మోసం చేశారని.. దీంతో ఎందరో అన్నదాతలు ఆత్మహత్య చేసుకున్నారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. చనిపోయిన రైతు కుటుంబాలను కనీసం పరామర్శించని బీఆర్ఎస్ నేతలు ఇవ్వాళ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని మండిపడ్డారు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం ఏనాడు భూసార పరీక్షలు చేయలేదని చెప్పారు. నాడు బీఆర్ఎస్ నేడు కాంగ్రెస్ అదే విధానాన్ని అవలంభిస్తున్నాయని ధ్వజమెత్తారు. సోమవారంఇందిరా పార్క్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో రైతు దీక్ష జరిగింది. ఈ దీక్షలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ... రైతు సమస్యలను పరిష్కరించడంలో రేవంత్ 2లో



# మిథున్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు

భారతీయ చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన సేవలు గుర్తించి ఈ ఏడాది దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం ఆయనకు అందించాలని జ్యూరీ నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ.. మిథున్ చక్రవర్తికి శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ చలన చిత్ర రంగానికి ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి చేసిన అపారమైన సేవలను గుర్తించి ఆయనకు ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించడం ఆనందంగా ఉంది. విభిన్నమైన నటనతో ఆయన ఎన్నో తరాలను అలరించారు. ఎంతోమంది అభిమానాన్ని పొందారు. ఆయనకు నా అభినందనలని ప్రధాని పేర్కొన్నారు. ఈ పురస్కారానికి తనను ఎంపిక కావడంపై మిథున్ ఆనందం వ్యక్తంచేశారు. మాటలు రావడం లేదు. ఇలాంటి గొప్ప విజయాన్ని నేను అస్సలు ఊహించలేదు. చాలా సంతోషంగా ఉన్నా. నా కుటుంబానికి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు దీనిని అంకితం చేస్తున్నానని తెలిపారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన మిథున్ చక్రవర్తి.. బాలీవుడ్‌లో ఎన్నో చిత్రాల్లో యాక్ట్ చేసి పేరు ప్రఖ్యాతులు సొంతం చేసుకున్నారు. హీరోగానే కాకుండా సహాయనటుడు, విలన్‌గా కూడా ఆయన ఎంతోమంది స్టార్ హీరోల చిత్రాల్లో నటించారు. 1976లో 'మృగాయా'తో నటుడిగా ఎంట్రీ ఇచ్చారు. తొలి చిత్రంతోనే ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు అందుకున్నారు. 'ముక్తి', 'బన్సారీ', 'అమర్‌దీప్', 'ప్రేమ్ వివాహ్', 'భయానక్', 'కస్తూరి', 'ఇస్మత్', 'మే ఔర్ మేరా సాథీ', 'సాహస్', 'వాంటెడ్', 'బాక్సర్', 'త్రినేత్ర', 'దుష్మన్', 'దలాల్', 'భీష్మ', 'సుల్తాన్', 'గురు', 'కిక్', 'బాస్', డిస్కోడాన్సర్ వంటి చిత్రాలు ఆయనకు గుర్తింపు తెచ్చిపెట్టాయి. హిందీ, బెంగాలీ చిత్రాలతోపాటు కన్నడ, తెలుగు, ఒరియా, భోజ్‌పురి చిత్రాల్లోనూ ఆయన నటించారు. 'గోపాల గోపాల'తో తెలుగు వారికి సుపరిచితమయ్యారు. ఇందులో ఆయన ప్రతినాయకుడిగా కనిపించారు. అనంతరం 'మలుపు' అనే టాలీవుడ్ మూవీలోనూ ఆయన యాక్ట్ చేశారు. 'ఐ యామ్ ఏ డిస్కో డాన్సర్' అన్న పాటతో దేశవిదేశాల్లో గుర్తింపు తెచ్చుకొన్నారు. ఈ ఏడాది ఆరంభంలో ఆయనకు పద్మభూషణ్ అవార్డును కేంద్రం అందజేసింది.

# మూసీ సుందరీకరణకు హైడ్రాకు సంబంధం లేదు

జరుగుతున్న కొన్ని ఆందోళనలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వివరణ ఇచ్చారు.నదీ పరివాహక ప్రాంతంలో నివాసితుల భద్రత, పునరావాసం, కూల్చివేతలకు సంబంధించిన వార్తల నేపథ్యంలో, కమిషనర్ కొన్ని ముఖ్యమైన వివరాలను వెల్లడించారు. మూసీ నదికి ఇరువైపులా జరుగుతున్న సర్వేలు హైడ్రాకు సంబంధించినవి కాదని స్పష్టంగా అవగాహన చేయాలని కోరారు. ఈ సర్వేలు హైడ్రా చట్టం లేదా ప్రాజెక్టుకు సంబంధించినవి కాదని తెలిపారు. మూసీ నదీ పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలను హైడ్రా తరలించడం లేదని ఆయన స్పష్టం చేశారు. నివాసితులపై జరుగుతున్న ఇబ్బందులు తప్పనిసరిగా నివారించబడాలని హైడ్రా సంస్థ భావిస్తోందన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఎలాంటి ఇళ్లపై హైడ్రా మార్కింగ్ చేయడం లేదని ఆయన తెలిపారు. ఇది నివాసితుల కష్టాలను, అనేకార్యాలను దృష్టిలో ఉంచుకుని చేయబడిన నిర్ణయమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్నదని, ఈ ప్రాజెక్ట్ ముఖ్యంగా నదీ పరివాహక ప్రాంతాన్ని అందంగా మార్చడం, పర్యావరణ సురక్షపై దృష్టి సారించడం ద్వారా స్థానిక ప్రజలకు ప్రయోజనాలు అందించడం లక్ష్యంగా ఉందన్నారు. ఈ ప్రకటనలు, వాస్తవాలను స్పష్టం చేసేందుకు, ప్రజల భద్రతా ఆశలపై హైడ్రా సంస్థ కట్టుబడినట్టు తెలియజేయడానికి ఒక ప్రయత్నమన్నారు. ప్రజలు భద్రత కోసం కృషి చేయాలని, వాటిని మరింత నిశితంగా, సహాయకరంగా చూడాలని కమిషనర్ కోరారు. ప్రజల, హైడ్రా సంస్థ మధ్య అనుబంధాన్ని మెరుగుపరచడం, స్థానిక అభివృద్ధికి దోహదం చేయడం ఎంతో ముఖ్యమన్నారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలని.. ఆయన సూచించారు.

# అవినీతితో కంపు కొడుతున్న కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు



రూ.లక్ష కోట్ల అవినీతికి పాల్పడితే, మూసీ పేరుతో కాంగ్రెస్ రూ.లక్షన్నర కోట్ల దోపిడీకి తెరతీసిందని ఆరోపణలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకే పైసల్లేవు కానీ మూసీ ప్రక్షాళన పేరుతో అప్పు తెచ్చి దోచుకునేందుకు కాంగ్రెస్ నేతలు సిద్ధమయ్యారని విమర్శలు గుప్పించారు. హైడ్రా తీరుతో ప్రజలు అసహ్యించుకుంటున్నారని, ప్రజలకు నిలువ నీడ లేకుండా చేయడమే ఇందిరమ్మ పాలనా? అని ప్రశ్నించారు. అయ్యప్ప సొసైటీ కూల్చివేత పేరుతో బిఆర్ఎస్ వసూళ్లకు పాల్పడిందని, హైడ్రా పేరుతో కాంగ్రెస్ వసూళ్లకు తెరతీస్తోందని, పేదల ఇండ్లను కూల్చివేస్తే హైడ్రాను అడ్డుకుంటామని బండి సంజయ్ హెచ్చరించారు. ప్రజలకు బిజెపి ఆయుధం కాబోతుందని, ప్రజలకు తమ ప్రాణాలను అడ్డుపెడతామని, మా ప్రాణాలు తీశాకే ప్రజల ఇండ్లపైకి దాడులకు వెళ్లాలని, హైడ్రా దాడులపై బిజెపి సింగిల్ గానే ఉద్యమం చేస్తుందని బండి సంజయ్ ప్రకటించారు. కుటుంబ వారసత్వ పార్టీలంటేనే అవినీతికి కేరాఫ్ అడ్రస్ అని, తమిళనాడులో తండ్రి ముఖ్యమంత్రి?కొడుకు డిప్యూటీ సీఎం అయ్యారని, కాంగ్రెస్, బిఆర్ఎస్, డిఎంకెలతో సహా కుటుంబ పార్టీల్లో కార్యకర్తలకు ముఖ్య పదవులు ఇస్తారా? అని ప్రశ్నించారు. కుటుంబ, వారసత్వ పార్టీలను బొంద పెట్టాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు.

# తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత

## కాంగ్రెస్ కార్యకర్తల రాకతో ఘర్షణ

హైదరాబాద్ : హైడ్రా కూల్చివేతల కారణంగా జరుగుతున్న రాజకీయంలో నేతల మధ్య రాజకీయ వాగ్వాదాలు శృతి మించి పోతున్నాయి. ఫలితంగా దాడులకు సైతం దిగుతున్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఉన్న తెలంగాణ భవన్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తల రాకతో ఉద్రిక్తత నెలకొంది. ఒక్క సారిగా వందల మంది రావడంతో పోలీసులు ఉలిక్కి పడ్డారు. విషయం తెలిసి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా రావడంతో.. తెలంగాణ భవన్ ఎదురుగా ఉద్రిక్తత ఏర్పడింది. బీఆర్ఎస్ సోషల్ మీడియాకు చెందిన వారు మంత్రి కొండా సురేఖపై నీచంగా కామెంట్లు పెట్టారని.. పోస్టులు పెట్టారని ఆరోపిస్తూ వరంగల్ నుంచి వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు ఈ ముట్టడికి ప్రయత్నించినట్లుగా తెలుస్తోంది. కాంగ్రెస్ కార్యకర్తలను అదుపు చేయడానికి పోలీసులు సరైన సంఖ్యలో లేకపోవడంతో బీఆర్ఎస్ కార్యకర్తలే వారితో వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్ ఆందోళనల్లో మహిళా నేతలు,కార్యకర్తలు ఉండటంతో పరిస్థితి ఎటు వైపు వెళ్తుందోనని కంగారు పడ్డారు. ఈ వివాదం కారణంగా అత్యంత బిజీగా ఉండే జూబ్లీహిల్స్ కేబీఆర్ పార్క్ రోడ్ లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు కాసేపటికి అందర్నీ పంపించివేశారు. ఓ వైపు హైడ్రా విషయంలో హైకోర్టులో విచారణ జరుగుతున్న సమయంలో ఇలా తెలంగాణ భవన్‌పైకి కాంగ్రెస్ కార్యకర్తల్ని ఉసిగొల్పడం వెనుక రాజకీయ కుట్ర ఉందని బీఆర్ఎస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలతో పాటు ఆ పార్టీ సోషల్ మీడియా విభాగం, టీ న్యూస్ చానల్ కార్యాలయం కూడా ఉంది. చానల్ ఆ భవనం నుంచి ప్రసారమవుతుంది. కాంగ్రెస్ కార్యకర్తలు తెలంగాణ భవన్ లోపలికి వెళ్లి ఉంటే పెద్ద సమస్య అయ్యేదని అంచనా వేస్తున్నారు. కాసేపటికి పరిస్థితి సద్దుమణిగింది. ఇదివరకు దాడుల వరకూ వెళ్లకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తెలంగాణ భవన్ మీదకు వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు చితకబాదామని రేవంత్ రెడ్డికి అదే పరిస్థితి వస్తుందని బీఆర్ఎస్ హెచ్చరించింది.

# 55 రోజుల్లోనే డీఎస్సీ ఫలితాలు ఇచ్చాం

గత ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేసింది కానీ అక్కడ కనీస వసతులు కల్పించడంలో పూర్తి ఫెయిల్ అయిందన్నారు. పిట్టగూళ్లలో, పౌల్ట్రీ ఫామ్‌లో పేదల పిల్లలను వదిలేశారని ఆరోపించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయబోతున్నామని రేవంత్ ప్రకటించారు. ప్రతి నియోజకవర్గానికి ఇరవై నుంచి ఇరవై ఐదు ఎకరాలల్లో ఈ విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ మైనార్టీ విద్యార్థులను ఒకే చోట విద్యను అందించబోతున్నామని తెలిపారు. యూనివర్శిటీ స్థాయిలో ఈ రెసిడెన్సియల్ స్కూల్స్ ఉంటాయని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద ముందుగా కొడంగల్, మధిరలో ఏర్పాటు చేస్తున్నామని ఇప్పటికే పనులు కూడా ప్రారంభమైనట్టు పేర్కొన్నారు. టెట్ తర్వాతనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. త్వరలోనే గ్రూప్ వన్ ఫలితాలు విడుదల చేస్తామని ప్రకటించారు. విద్యాశాఖ అధికారులు అతి తక్కువ సమయంలో ఉద్యోగాల భర్తీకి కృషి చేశారని అన్నారు. వారికి అభినందనలు తెలిపారు. 26ఆప్షన్ కింద డీఎస్సీ నిర్వహించామని వివరించారు. 1:3ప్రాతిపాదికన ఫలితాల ప్రకటించిన తర్వాత సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతుందని తెలిపారు. దసరా లోపే 9అక్టోబర్ నాడు ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒకే ఒక్క నోటిఫికేషన్ వేసిందని మండిపడ్డారు.మాజీ సీఎం కేసీఆర్ కేవలం 7, 857 టీచర్లను మాత్రమే నియమించారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరి వల్ల పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య మీద పెట్టేది ఖర్చు కాదని తెలిపారు. పది నెలల్లోనే 11062 టీచర్ల భర్తీకి తాము కృషి చేశామని అన్నారు. ఇది తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అని తెలిపారు.తమ ప్రభుత్వం వచ్చిన అనతికాలంలోనే 30వేల ఉద్యోగ పత్రాలు అందజేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అండగా నిలబడుతుందని హామీ ఇచ్చారు. గురుకులాల గురించి కేసీఆర్ చెప్పారని..కానీ మౌలిక సదుపాయాలు ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో యంగ్ ఇండియా ఇంటి గ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. వంద నియోజక వర్గాల్లో యంగ్ ఇండియా ఇంటి గ్రెటెడ్ స్కూల్స్ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పదేళ్లలో కేసీఆర్ టీచర్ల పదోన్నతులు, బదిలీలు ఎందుకు చేయలేదని నిలదీశారు. దీని వల్ల టీచర్లలో నిరాశ ఏర్పడిందని చెప్పారు. 36వేల మంది టీచర్ల బదిలీలను ఎలాంటి విమర్శలు లేకుండా తాము పూర్తి చేశామని తెలిపారు. కేసీఆర్ హయాంలో ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోలేదని.. దాని వల్ల కొంత సమస్యలు వచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు.

# శని, ఆదివారాల్లోనే కూల్చివేతల మతలబు ఏంటి

ఆదివారం మీరు ఎందుకు పని చేయాలని ప్రశ్నించింది. సెలవుల్లో ఎందుకు నోటీసులు ఇచ్చి, అత్యవసరంగా కూల్చివేస్తున్నారని అడిగింది. శని, ఆదివారాల్లో కూల్చివేయొద్దని గతంలో కోర్టు తీర్పులున్నాయని గుర్తు చేసింది. కోర్టు తీర్పుల విషయం కూడా తెలియదా అని తహసీల్దార్‌ను ప్రశ్నించింది. గతంలో మీరు కూల్చివేసిన కేసుపై స్టే విధించిన విషయం తెలియదా? అని అడిగింది. చట్టప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని తహసీల్దార్‌ను హెచ్చరించింది. రాజకీయ నేతలు, ఉన్నతాధికారులు చెప్పినంత మాత్రాన అక్రమంగా ముందుకు వెళ్లొద్దు. ఇల్లు కూల్చే ముందు యజమానికి చివరి అవకాశం ఏమైనా ఇచ్చారా? ప్రభుత్వ ఆస్తుల రక్షణ పేరుతో అమాయకులను ఇబ్బందులకు గురి చేస్తారా? అని ఉన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. కోర్టు అడిగిన ప్రశ్నలకే సమాధానం ఇవ్వాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సూచించింది. కూల్చివేతకు యంత్రాలు, సిబ్బందిని కోరడంతో సమకూర్చామని బదులివ్వగా.. చార్మినార్ కూల్చివేతకు తహసీల్దార్ యంత్రాలు, సిబ్బంది అడిగితే ఇస్తారా? అని హైకోర్టు ప్రశ్నించింది. హైడ్రా ఇదే విధంగా ముందుకు వెళ్తే స్టే ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించింది. ఖాళీ చేయనంత మాత్రాన అత్యవసరంగా కూల్చాల్సిన అవసరం ఏముంది?పొలిటికల్ బాస్‌లను సంతృప్తిపరిచేందుకు, పై అధికారులను మెప్పించేందుకు చట్టవిరుద్ధంగా పని చేయొద్దు. చనిపోయే వ్యక్తిని కూడా చివరి కోరిక అడుగుతారు కదా? ఆదివారం కూల్చివేతలు హైకోర్టు తీర్పునకు వ్యతిరేకమని తెలియదా? అధికారులు చట్టవ్యతిరేకంగా పనిచేస్తే ఇంటికెళ్తారు.. జాగ్రత్త అంటూ హెచ్చరించింది. మూసీపై కూడా 20 లంచ్ మోషన్ పిటిషన్లు దాఖలయ్యాయి. ఇది అరుదైన కేసుగా భావించే అధికారులను విచారణకు పిలిచాం. జీవో ప్రకారం హైడ్రాకు ఎన్నో విధులు ఉన్నాయి. మిగతావి పట్టించుకోకుండా కూల్చివేతలపైనే దృష్టి పెట్టారు. ట్రాఫిక్ సమస్యపైనా హైడ్రాకు బాధ్యత ఉంది. కానీ దాని గురించి ఏమాత్రం పట్టించుకోవట్లేదు. మాదాపూర్‌లో ప్రయాణం ఎంత సమయం పడుతుందో తెలుసు కదా? నిబంధనలు పాటించకుంటే హైడ్రా ఏర్పాటు జీవోపై స్టే ఇవ్వాల్సి వస్తుంది. సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేస్తేనే సామాన్యులు ఇళ్లు నిర్మిస్తున్నారు. స్థానిక సంస్థ అనుమతి ఇస్తేనే ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపంతో సామాన్యులు నష్టపోవాల్సి వస్తోంది. ఆదివారం కూల్చివేతలు వద్దని త్రిసభ్య ధర్మాసనం తీర్పు ఉంది. అక్రమ నిర్మాణాలు అనిపిస్తే సీజ్ చేయవచ్చు కదా? హైడ్రా ఏర్పాటు అభినందనీయం.. పనితీరే అభ్యంతరకరం. అమీన్‌పూర్ తహసీల్దార్, హైడ్రా కమిషనర్ తీరు అసంతృప్తికరం. ఒక్కరోజులో హైదరాబాద్‌ను మార్చాలనుకోవడం సరికాదు. ఎఫ్టీఎల్ నిర్ధరించకుండా అక్రమాలు అని ఎలా తేలుస్తారని హైకోర్టు ప్రశ్నించింది. విచారణను అక్టోబర్ 15కు వాయిదా వేసింది. అప్పటివరకు యథాతథ స్థితి కొనసాగించాలని హైడ్రా, అమీన్‌పూర్ తహసీల్దార్‌ను ఆదేశించింది. కౌంటర్లు దాఖలు చేయాలని చెప్పింది. ప్రభుత్వ ఆస్తుల రక్షణ పేరుతో అమాయకులను ఇబ్బందులకు గురిచేస్తారా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం కూల్చివేతలు హైకోర్టు తీర్పునకు వ్యతిరేకమని తెలియదా అంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు న్యాయమూర్తి ప్రశ్నించారు. అమీన్‌పూర్‌పైనే మాట్లాడాలని, కావూరిహిల్స్ గురించి అడగలేదంటూ కోర్టు అడిగిన ప్రశ్నలకే సమాధానం ఇవ్వాలని.. జంప్ చేయొద్దని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో విజ్ఞప్తి మేరకు చర్యలు తీసుకున్నామన్నా రంగనాథ్ వివరణపై అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మార్వో అడిగితే గుడ్డిగా చర్యలు తీసుకుంటారా అని ప్రశ్నించారు. ఎమ్మార్వో అడిగితే చార్మినార్, హైకోర్టును కూడా కూల్చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రాకు ఇదే విధంగా ముందుకు వెళ్తే స్టే ఇవ్వాల్సి వస్తుందన్నారు. కూల్చివేతలు తప్ప వేరే పాలసీ లేదని, ఇది ప్రజల అభిప్రాయమన్నారు. ఈ సందర్భంగా కోర్టులను ఎంతో గౌరవిస్తున్నామని న్యాయమూర్తికి రంగనాథ్ తెలిపారు. మూసీపై కూడా 20 లంచ్‌మోషన్ పిటిషన్లు దాఖలయ్యాయని న్యాయమూర్తి వెల్లడించారు. ప్రభుత్వ వ్యవస్థల మధ్య సమన్వయం లేదని చెప్పారు. ఇది అరుదైన కేసుగా భావించే అధికారులను విచారణకు పిలిచామన్నారు. అక్రమ నిర్మాణాలు అనిపిస్తే సీజ్ చేయవచ్చు కదా అన్నారు. హైడ్రా ఏర్పాటు అభినందనీయమేనని, పనితీరే అభ్యంతరకమన్నారు. అమీన్‌పూర్ ఎమ్మార్వో, హైడ్రా కమిషనర్ తీరు అసంతృప్తికమరని చెప్పారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారించకుండా అక్రమాలు అని ఎలా తేలుస్తారన్నారు. ఒక్కరోజులో హైదరాబాద్‌ను మార్చాలనుకోవడం సరికాదన్నారు.

# మూసీ రివర్ ఫ్రంట్ పెద్ద స్కామ్

మూసీ సుందరీకరణ కోసం ఈ ముఖ్యమంత్రి రూ. 1.50లక్షలకోట్ల ఖర్చు అవుతుందని సీఎం చెబుతున్నారు. దీన్ని స్కామ్ అనక ఏమనాలి. దీనివెనుక ఉన్న మతలబు ఏంటీ? చెప్పాలి కదా. అనుమతులు ఇచ్చిన ఇండ్లను కూల్చడమంటే ప్రభుత్వానికి తన వ్యవస్థ మీద, తన యంత్రాంగం, పరిపాలనపై తనకే పట్టులేనితనానికి నిదర్శనం కాదా? అని అడుగుతున్నానన్నారు. మున్సిపల్ మంత్రిగా నేను ఎనిమిదేళ్లు పని చేశాను. కూల్చాల్సి వస్తే.. మొదట కూల్చాల్సింది హైడ్రా కమిషనర్ ఆఫీస్‌ను. కమిషనర్ ఎక్కడ కుసున్నడో.. బుద్ధ భవన్ నాలామీదున్న ఉన్నది. దాంట్లోనే ఎలక్షన్ కమిషనర్ ఉన్నడు. హైడ్రా కమిషనర్ ఉన్నరు. అందులో ఉమెన్స్ కమిషన్ ఉన్నది. మొదట ఆ భవనం కూల్చాలి. రెండోది ఏ జీహెచ్ఎంసీ పర్మిషన్‌లు ఇస్తదో.. ఆ జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని కూల్చాలి. జీహెచ్ఎంసీ ఆఫీస్ కూడా నాలాపైనే ఉన్నది. మరి ఇతరులకు సుద్దులు చెప్పే ముందు ఇక్కడి నుంచే మొదలిపెట్టాలి. నాకు తెలిసి సీఎంకి అవకాశం ఇస్తే.. కొత్తగా కట్టుకున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం కూలుస్తడు. ఆయనో లక్ష్యం పెట్టుకున్నడు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా పెట్టుకున్నడు. సెక్రటేరియట్ చూడంగనే అందరికీ కేసీఆర్ గుర్తుకు వస్తడు. మొన్న గణపతి బొప్ప మోరియా అనుకుంటా వెళ్లారు. అక్కడికి రాంగనే కేసీఆర్ గుర్తుకు వచ్చిండు.. కేసీఆర్ పాటలు పెట్టంగనే ముఖ్యమంత్రికి ఇరిటేషన్ వస్తున్నది. మూసీ బాధితుల ఆక్రందనలు చేస్తున్నా.. ఇబ్బంది పడుతుంటే.. నిన్న మొన్నటి వరకు డైలాగ్‌లు కొట్టిన మీ అధినాయకులు ఎక్కడా? మీ రాహుల్ గాంధీ యేడీ? మీ ప్రియాంక గాంధీ ఎక్కడ? అని ప్రశ్నించారు. కాళేశ్వరం అనేది ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీస్టేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు. ఒక పంటకు 40లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే ప్రాజెక్టు. పరిశ్రమలకు 10శాతం నీళ్లు వస్తాయి. హైదరాబాద్ మహానగరంతో పాటు వేలాది గ్రామాలకు తాగునీరు ఇచ్చే ప్రాజెక్టు. హైదరాబాద్ నెత్తిమీద శాశ్వతంగా ఒక కుండపెట్టినట్టే కరువు తీర్చే కల్పతురువు కాళేశ్వరం. కాళేశ్వరం కట్టం తర్వాత వరిసాగులో భారతదేశంలో తెలంగాణ టాప్. ఇది కాళేశ్వరం పుణ్యం కాదా? రూ.లక్షకోట్ల పెట్టుబడితో ఏం జరిగిందంటే.. తెలంగాణ వరిసాగులో టాప్‌గా నిలిచింది' అన్నారు. కాళేశ్వరంతో తాగునీటి సమస్య పోయింది. హైదరాబాద్‌కు తాగునీటి సమస్య రానే రాదు. ఇప్పటికే మూసీ కింద ఉన్న ఆయకట్టు కాకుండా కొత్తగా ఏమన్న వస్తుందా? మూసీ ప్రాజెక్టులో రిజర్వాయర్ ఉన్నదా? పంప్ హౌస్ ఉన్నదా? అండర్‌గ్రౌండ్ టన్నెల్ ఉన్నదా? ఏం లేకున్నా రూ. 1.50లక్షలకోట్లంటే స్కామ్ కాదా? అని తెలిపారు. థేమ్స్ నదికి కూడా ఖర్చుపెట్టింది దాదాపు రూ.40వేలకోట్లు. వీటన్నింటికంటే అద్భుతాన్ని ఆవిష్కరిస్తా నంటే.. రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్ ఎంత? రాష్ట్ర ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఎంత? ఎవరి కోసం మూసీ ప్రాజెక్టు చేపడుతున్నవ్ చెప్పాలి. ఇంత వరకు రైతుబంధు దిక్కులేదు. కొత్త హామీలు కాదు.. ఇచ్చిన హామీలు ఏమాయ్యాయంటూ.. పెన్షన్లు ఎగ్గొట్టావంటే చెప్పేటోడు లేదు' కేటీఆర్ మండిపడ్డారు.వంద రోజుల్లో చేస్తామన్న పనులను 300 రోజులు దాటినా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. వంద రోజుల్లోనే హామీలన్నీ నెరవేరుస్తామని పత్రికల్లో ప్రకటనలు సైతం ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు ఒక్క గ్యారంటీ కూడా అమలు చేయలేదన్నారు. మూసీ పరివాహక ప్రజల పట్ల సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తోన్న తీరు సరైంది కాదు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఇళ్లకు పట్టాలు వచ్చాయని పలువురు ప్రజలు చెప్తున్నారు. రిజిస్ట్రేషన్ చేసినప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడెందుకు చెప్తున్నారని పేదలు అడుగుతున్నారు. గతంలో 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ.. చెరువులకు హద్దులు ఎందుకు గుర్తించలేదన్నారు. ఎఫ్‌టీఎల్ నిర్మాణాలకు అనుమతి ఇచ్చిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అని అన్నారు. ఇళ్లు కట్టిస్తామన్నారు కానీ.. కూల్చుతామని ఎన్నికల ముందు చెప్పారా? సాగరహారం లాంటి ఉద్యమాలు మళ్లీ రావాల్సిన అవసరం ఉంది. ప్రజలు తిరగబడితే మంత్రులు ఊళ్లల్లో కూడా తిరగలేరు. పేద ప్రజల ఇళ్లను ఇలా కూల్చేస్తూ ఉంటే మేం చూస్తూ ఊరుకోం. ఇకపై బుల్డోజర్లకు భారాస నేతలు అడ్డుగా ఉంటారని కేటీఆర్ హెచ్చరించారు.

# కెసిఆర్ పదేళ్లపాటు రైతులను మోసం చేశారు

ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. పంట నష్టపోతే ఆదుకునేందుకు ఫసల్ బీమాను కేంద్రం తీసుకువస్తే.. కేసీఆర్ ఎందుకు తెలంగాణలో అమలు చేయనివ్వ లేదని ప్రశ్నించారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఎంత అపఖ్యాతి మూటగట్టుకుందో.. 10 నెలల్లో కాంగ్రెస్ అంత మూట గట్టుకుందని విమర్శించారు. కేసీఆర్.. ఫామ్ హౌస్‌ను జాతికి అంకితం చేస్తావా? ఏం చేస్తావో తెలియదని అన్నారు. రైతులకు న్యాయం చేయాలని అన్నారు. కేసీఆర్ అవినీతి లక్ష కోట్లను సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి కక్కిస్తామని హెచ్చరించారు. నాడు పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్.. సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారని.. కానీ ఇప్పుడు సిట్టింగ్ జడ్జి దొరకలేదా? రిటైర్ అయిన జడ్జితో సిట్ వేశారని ఎద్దేవా చేశారు. రేవంత్ మూసీ సుందరీకరణ పేరిట కొత్త డ్రామా మొదలు పెట్టారని విమర్శించారు. తెలంగాణలో రైతుల సమస్యలు తీర్చడం బీజేపీకే సాధ్యమని అన్నారు. కాంగ్రెస్ ఒక 420 అనే విషయం అందరికీ తెలుసునని మెదక్ ఎంపీ రఘునందన్ రావు విమర్శలు చేశారు.

# డిజిట్ కార్డులపై 3నుంచి క్షేత్రస్థాయి పరిశీలన

అక్టోబరు 3 నుంచి 7 వరకు పైలట్ ప్రాజెక్టులో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాలు, 238 ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలి. కొత్త సభ్యులకు జత చేసి, చనిపోయిన వారిని తొలగించాలి. పైలెట్ ప్రాజెక్టులో ఎదురైన వివరాలతో నివేదిక తయారు చేయాలి. కుటుంబ సభ్యుల వివరాల మార్పులు చేర్పుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేక, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచండి

ఇటువంటి ప్రస్తుత పరిస్థితుల్లో కొత్తగా నియమించిన సిట్ సరిగ్గా



విచారణ జరపగలదా? అన్న సందేహాలు ఉన్నాయని న్యాయస్థానం పేర్కొంది. స్వామి వారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యిని వినియోగించినట్లు ఎలా తెలిసిందంటూ సుప్రీంకోర్ట్ సందేహం వ్యక్తం చేసింది. అలాగే స్వామి వారి ప్రసాదం లడ్డూని పరీక్షల కోసం ల్యాబ్‌కి ఎప్పుడు పంపారని ముకుల్ రోహత్గిని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం విచారణ జరిపితే బావుంటుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అనంతరం ఈ కేసు విచారణను జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ బాలకృష్ణన్ ధర్మాసనం గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు తిరుమల లడ్డూ వివాదంపై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. తిరుమల స్వామివారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించి నట్లు ఆరోపణలు నేపథ్యంలో ఈ అంశంలో నిజం నిగ్గూ తేల్చాలంటూ బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి, వైసీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. వీటిపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిపింది. తత ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించినట్లు ఎన్‌డీడీబీ నివేదిక స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘోర అపచారం జరిగిన నేపథ్యంలో శ్రీవారి ఆలయంలో శాంతి హోమాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించింది. అలాగే సంప్రోక్షణ కార్యక్రమాన్ని సైతం చేపట్టింది. అందులోభాగంగా ఆనంద నిలయంతో పాటు తిరుమల మాఢవీధుల్లో సైతం సంప్రోక్షణ నిర్వహించింది. మరోవైపు తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారాన్ని ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరపాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. గుంటూరు ఐజీ సర్వ శ్రేష్టి త్రిపాఠి నేతృత్వంలో సిట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో శనివారం సిట్ బృందం తిరుమల చేరుకుని.. తన దర్యాప్తును ప్రారంభించింది.

# హైడ్రా బాధితులంతా తెలంగాణ పేదలే

## సిఎం రేవంత్‌పై ముందు కేసులు పెట్టాలి

## బిఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్ విమర్శలు

హైదరాబాద్ : మూసీ–హైడ్రా వ్యవహారంలో నిజమైన బాధితులు తెలంగాణ పేద ప్రజలు అని.. అసలు నిందితుడు సీఎం రేవంత్ రెడ్డి అని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మూసీ పేరుతో లూటీకి ప్లాన్ చేసి.. అడుగడుగునా జుగుప్సాకరమైన భాష వాడిన సీఎం రేవంత్ రెడ్డిపై ముందు కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులను సీఎం ఇంటి మీదకు పంపించండి.. పేదల ఇళ్లకు కాదని తెలంగాణ పోలీసులకు సూచించారు. హైడ్రా వ్యవహారంతో నష్టపోయిన బాధితులు సీఎం రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేసిన వీడియోలను షేర్ చేశారనే ఆరోపణలతో కల్వకుర్తి మండలం కడ్తాలలో బీఆర్ఎస్ కార్యకర్త నరేశ్‌ను అరెస్టు చేయడంపై ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రికి రాత్రి పోలీసులను కడ్తాలకు పంపి నరేశ్‌ను అరెస్టు చేసి కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారని ఆయన తెలిపారు. నరేశ్‌తో పాటు అతని మిత్రులకు చెందిన 4 ఫోన్లను అక్రమంగా గుంజుకున్నారని మండిపడ్డారు. బీఎన్ఎస్ఎస్ 35(3) యాక్ట్ ప్రకారం నరేశ్‌ను బెయిల్‌పై రిలీజ్ చేసే అవకాశం ఉన్నప్పటికీ ఇంకా విడుదల చేయట్లేదని అన్నారు. అందుకే పోలీస్ స్టేషన్‌కు వచ్చామని వివరించారు. నరేశ్ ఒక్కడినే కాకుండా తెలంగాణ వ్యాప్తంగా ఎంతోమంది పేద ప్రజలపై రాత్రికి రాత్రే కేసులు పెట్టారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఇంకా ఎన్ని రోజులు, ఎంతమంది ప్రజలను ఇట్ల సతాయిస్తారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. భావ ప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగించే 66 ఐటీ యాక్ట్ చెల్లదని ముంబై హైకోర్టు చెప్పిన తర్వాత కూడా ఇంకా జ్ఞానోదయం కాలేదా అని మండిపడ్డారు.

# కనీస వేతనాల జీవోలను సవరించాలి

- కార్మికుల వేతనం నెలకు 26 వేలుగా నిర్ణయించాలి
- సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు






**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కాంట్రాక్టు, నాన్ పర్మినెంట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ముందు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమల్లో, సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాల జీవోలను సవరించి నెలకు 26 వేలుగా నిర్ణయించాలని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల సలహా మండలిని వెంటనే ఏర్పాటు చేసి, అందులో అన్ని కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్స్ ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని అన్నారు, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, శాశ్వత విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే వివిధ రంగాల కార్మికులకు వేతనాలు పెంచుతామని,పర్మినెంట్ చేస్తామని ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న అంశాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా ఏర్పడి 8 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ డీసీఎల్ స్థాయి కార్మిక శాఖ అధికారిని నియమించకపోవడం సరైనది కాదని, వెంటనే డిసియల్ స్థాయి అధికారులు నియమించి కార్మిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో 100 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ వెంటనే నిర్మించాలని, రామగుండం కార్పొరేషన్ సి క్యాటగిరి నుండి బి కేటగిరికి మార్చాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లాలో రైస్ మిల్స్ లో సుమారు 8000 మంది కార్మికులు పనిచేస్తున్నారని, ఇందులో పనిచేస్తున్న కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సూరెన్స్ అమలు చేయాలని, 8 గంటల పని దినాన్ని, వారాంతపు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వలస కార్మికులను నిరోధించి స్థానిక కార్మికులకు ఉపాధి కల్పించాలని అన్నారు. ఎన్ టి పి సి కాంట్రాక్ట్ కార్మికుల జేఏసీతో యాజమాన్యం చేసుకున్న ఒప్పందాల్లోని ప్రమోషన్ పాలసీ అమలు చేయాలని, కార్మికులందరికీ అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేశారు. మెడికల్ టెస్టులు పోలీస్ వెరిఫికేషన్ పేరుతో ఎన్ టి పి సి యాజమాన్యం, కాంట్రాక్ట్ కార్మికులను వేధించే చర్యలు మానుకోవాలని,ఒక సంవత్సరానికి గేట్ పాస్ చేయాలని డిమాండ్ చేశారు, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియా మాదిరిగా హైపవర్ కమిటీ వేతనాలు ఇవ్వాలని, 2022లో 18 రోజుల సమ్మె సందర్భంగా సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మిక సంఘాలతో చేసుకున్న ఒప్పందంలోని అంశాలను అమలు చేయాలనిడిమాండ్ చేశారు. మున్సిపల్,గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలని, పెండింగ్ జీతాలు చెల్లించాలని, పని భారం తగ్గించాలని, అందుకు అవసరమైన కొత్త కార్మికులను నియమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డు ట్రాన్స్పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఫైన్సు, చాలాన్సు తగ్గించాలని అన్నారు, ఆర్ ఎఫ్ సి ఎల్ లో కార్మికుల సమస్యల పరిష్కారానికి కార్మిక సంఘాలు పని చేసే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పై సమస్యల పరిష్కారానికి జిల్లా అధికార యంత్రాంగం వెంటనే తగు చర్యలు తీసుకొని, సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చి, కాంట్రాక్టు, నాన్ పర్మినెంట్ కార్మికులకు న్యాయం చేయాలని, లేకుంటే రాబోయే రోజుల్లో ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం అడిషనల్ కలెక్టర్ శ్రీమతి అరుణ శ్రీ గారికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి, ఉపాధ్యక్షులు ఎన్, బిక్షపతి, ఎం, రామాచారి, సహాయ కార్యదర్శులు తాండ్ర అంజయ్య, సిపెల్లి రవీందర్, జిల్లా నాయకులు నాంసాని శంకర్,గీట్ల లక్ష్మారెడ్డి, ఉల్లి మొగిలి, మాతంగి రాజమల్లు, సావణపెల్లి వెంకటస్వామి, ఎండి, ఖాజా, నవుండ్ల బ్రహ్మాచారి, ఉల్లి మొగిలి, శ్రీనివాస్, ఎండి, పొన్నాల ఉపేందర్, మంజూరు బేగం, మల్లేష్, శివకుమార్ సతీష్ కొమరయ్య సత్యం, సాగర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక మిత్రుల చేయూత

## పేద విద్యార్థుల చదువులకు రూ. 1.53 లక్షలు విరాళాలు



**ధర్మపురి సెప్టెంబర్ 30, (ది క్రైమ్ న్యూస్):** సామాజిక మిత్రుల చేయూతతో పేద విద్యార్థుల చదువులకు రూ. 1.53 లక్షలు విరాళాలు సేకరించి వారికి అందించడం జరిగిందని సామాజిక సేవకులు రేణికుంట రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఒక వైపు భర్త మరణం, మరో వైపు పేదరికంతో సంసారాన్ని నెట్టుకస్తూనే తన ముగ్గురు పిల్లలను ఉన్నత చదువులు చదివించడం ఇబ్బంది పడుతున్న నిరుపేద మహిళ కుటుంబానికి ఫేస్ బుక్ మిత్రులు రూ. 1.53 లక్షలు విరాళాలు అందించడం చాలా గొప్ప విషయం అని పేర్కొన్నారు. ధర్మపురి నియోజక వర్గం, వెల్గటూర్ మండలంలోని రాజారాం పల్లె గ్రామానికి చెందిన దర్శనాల జమున, రాజేష్ దంపతులకు ఇద్దరు కుమారులు, ఓ కుమారుడు ఉన్నారు. భర్త గతంలో మరణించడంతో జమున కూలి పని చేస్తూ ఏంతో కష్టంగా ముగ్గురు పిల్లల్ని చదివిస్తుంది. తమ ముగ్గురు పిల్లలు చదువుల్లో రానిస్తున్నప్పటికీ పేదరికం తో ఇబ్బందులు పడుతున్నారని తల్లి ఆవేదన చెందుతున్నట్లు తెలిపారు. కూతురు ఎం బీ బి ఎస్ మూడవ సంవత్సరం చదువుతుండగా, పెద్ద కుమారుడు ఎం బి ఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అలాగే చిన్న కుమారుడు బి టెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వీరికి ఆయా కోర్సుల్లో ఫ్రీ సీట్ లభించినప్పటికీ హాస్టల్ ఫీజు, బుక్స్ కొనడంలో భారంగా మారిందని తల్లి జమున ఆవేదన వ్యక్తంచేశారు. వీరి దీనస్థితిని తెలుసుకున్న ధర్మపురికి చెందిన సామాజిక సేవకులు రేణికుంట రమేష్ స్పందించి సదరు పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం సాయం అందించాలని సెప్టెంబర్ 3 న ఫేస్ బుక్ లో పోస్ట్ చేశాడు. దాంతో తన మిత్రులైన ఎన్నారైలు స్పందించి జమున బ్యాంక్ ఖాతాలు రూ. 1.53 లక్షలు విరాళాలు అందించారని రమేష్ పేర్కొన్నారు. వాటిలో ప్రస్తుత ఖర్చుల కోసం కొంత మొత్తాన్ని స్థానిక సి ఐ రాం నర్సింహారెడ్డి చేతుల మీదుగా జమునకు ఇప్పించినట్లు రమేష్ తెలిపారు. మిగతా డబ్బులు ఆమె ఖాతాలో నిల్వ ఉన్నట్లు రమేష్ తెలిపాడు. ఈ కార్యక్రమంలో సి ఐ రాం నర్సింహారెడ్డి వెంట ఎస్సై మహేష్ , యూనియన్ బ్యాంక్ మేనేజర్ అషిష్ లు ఉన్నారు.

# బతుకమ్మ కుంట పార్కులో పనుల పర్యవేక్షణ చేసిన శేరి సతీష్ రెడ్డి





**కూకట్ పల్లి సెప్టెంబర్ 30 (ది క్రైమ్ న్యూస్):** బతుకమ్మ పండుగను పురస్కరించుకొని బతుకమ్మ ఆడిపాడే మహిళలకు ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా బతుకమ్మ కుంట పార్కులో జరుగుతున్న పనులను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కూకట్ పల్లి నియోజకవర్గం ఇన్చార్జి బండి రమేష్ సహకారంతో కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి శనివారం పార్కులో పనులను పరిశీలించి అక్కడ మహిళలకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ రోజు వరకు జరిగే బతుకమ్మ ఆటలకు అన్ని సౌకర్యాలు కలిగించే విధంగా జిహెచ్ఎంసి యంత్రాంగంతో మాట్లాడటం జరిగిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు ఫణీంద్ర, రేష్మ, లక్ష్మీనారాయణ, శ్రీకాంత్ గుప్తా, శ్రీధర్ చారి, బాబురావు, ఎల్ఐజి అసోసియేషన్ సభ్యులు, సరస్వతి, సత్యనారాయణ మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

# విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి

## - డాక్టర్ బండారి రాజ్ కుమార్



**సుల్తానాబాద్, సెప్టెంబర్ 30( ది క్రైమ్ న్యూస్):** సుల్తానాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం రానున్న కరీంనగర్, ఆదిలాబాద్,నిజామాబాద్ మెదక్, జిల్లాల పరిధిలో ఉన్న పట్టభద్రులను, నిరుద్యోగులను ఉపాధ్యాయులను కలిసి రానున్న పట్టుభద్రుల ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపాలంటూ విస్తృతం గా ప్రచారం నిర్వహిస్తున్నారు. పట్టుభద్రుల ఎన్నికల బరిలో ఉన్న స్వతంత్ర అభ్యర్థి తెలంగాణ మెడికల్ కౌన్సిలర్ మెంబర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ బండారి రాజ్ కుమార్ సుల్తానాబాద్ జూనియర్ కళాశాల వాకర్ అసోసియేషన్ వాకర్స్,క్రీడాకారుల తో కలిసి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు ఎమ్మెల్సీ ఓటు వినియోగించుకోవాలని బుధవారం నమోదు ప్రక్రియ ప్రారంభం అవుతుందని ప్రతి ఒక్కరు ఇందులో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు డాక్టర్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు క్రీడాకారులు టీ.జి.ఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి నదిలో వ్యక్తి మృతదేహం లభ్యం



**యైటింక్లయిన్ కాలని. (క్రైమ్ న్యూస్):** గోదావరి నదిలో గల్లంతైన సుదర్శి బాలరాజు మృతదేహం సోమవారం లభించినట్లు గోదావరిఖని రెండవ పట్టణ పోలీసులు తెలిపారు. గత గురువారం స్నేహితులతో స్నానానికి వెళ్లి నదిలో గల్లంతైన బాలరాజు మృతదేహం ఉదయం కాలేశ్వరం సమీపంలోని అన్నారం గ్రామం వద్ద నదిలో లభించింది. కాగా మృతదేహన్ని పోస్ట్ మార్టం నిర్వహించి, మృతుని బంధువులకు అప్పగించినట్లు పోలీసులు వివరించారు. అప్పగించారు.

# 51 సారి రక్త కణాలను అందించి ఆదుకున్న రక్త చైతన్యకర్త, గాలిపెల్లి కుమార్

## కరీంనగర్‌లో బ్లడ్ అంటే గుర్తుకు వచ్చే మొట్టమొదటి వ్యక్తి కుమార్



**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 30(ది క్రైమ్ న్యూస్):** డెంగ్యూతో బాధపడుతున్న రోగికి సరైన సమయంలో రక్త కణాలను అందించి గాలిపెల్లి కుమార్ మరొకసారి సామాజిక సంపన్న సేవకుడని నిరూపిం చుకున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే సుల్తానాబాద్ పూసల గ్రామానికి చెందిన ప్రశాంత్ డెంగ్యూ జ్వరంతో గత కొద్దిరోజులుగా కరీంనగర్లోని స్థానిక సాయి కృష్ణ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ప్రశాంత్ రక్త కణాలు ఒక్కసారిగా పదివేలకు తగ్గడం జరిగింది. అప్పటికప్పుడు ఏమి చేయాలో తోచని పరిస్థితిలో సుల్తానా బతుకు చెందిన సామాజిక కార్యకర్త తుమ్మరాజుకు విషయాన్ని చేరవేయగా అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో తుమ్మరాజు గాలిపెల్లి కుమార్ ఫోన్ చేసి ఫోన్ లో పరిస్థితిని వివరించగా సానుకూల హృదయంతో సామాజిక దృక్పథంతో గాలిపెల్లి కుమార్ అర్ధరాత్రి సాయి కృష్ణ హాస్పిటల్ కి విచ్చేసి ఎంజీఆర్ బ్లడ్ బ్యాంక్ లో తన రక్త కణాలను అందించి ప్రశాంత్ ప్రాణాలను కాపాడాడు. ఈ విషయమై ప్రశాంత్ కుటుంబ సభ్యులు డాక్టర్లు పురుమళ్ళ శ్రీనివాస్ గాలిపెల్లి కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా గాలిపెల్లి కుమార్ మాట్లాడుతూ ఎదుటి మనిషికి సహకరించాలనే ఆలోచన విధానం ఎంతో గొప్పదని, అందరూ కూడా ఎవరిని కించపరచకుండా ఒకరికొకరు సహాయపడుతూ జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలని తెలిపారు.

# స్వామి వారిని దర్శించుకున్న రాష్ట్ర ట్రాన్స్పోర్ట్ జాయింట్ కమీషనర్ చిదుర రమేష్



**ధర్మపురి సెప్టెంబర్ 30, ( ది క్రైమ్ న్యూస్ ):** ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహా స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర ట్రాన్స్పోర్ట్ జాయింట్ కమీషనర్ చిదుర రమేష్ దంపతులు దర్శించుకున్నారు. సోమవారం ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానమునకు తెలంగాణ రాష్ట్ర ట్రాన్స్పోర్ట్ జాయింట్ కమీషనర్ చిదుర రమేష్ కుటుంబ సమేతంగా వచ్చి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్నట్లు ఇఓ శ్రీనివాస్ తెలిపారు. వీరికి దేవస్థానం పక్షాన శ్రీ స్వామివారి శేషవస్త్రంతో పాటు ప్రసాదం చిత్రపటం ఇచ్చి సన్మానించడం జరిగిందని ఇఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్య నిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, అర్చకులు నంభి నరసింహ మూర్తి, మరియు అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్





**కూకట్ పల్లి సెప్టెంబర్ 30 (ది క్రైమ్ న్యూస్):** మౌలిక సదుపాయాల కల్పనలో రాజీలేని కృషి చేస్తున్నట్లు కూకట్ పల్లి సర్కిల్ ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని సాయినగర్ వెస్ట్ కాలనీలో రోడ్డు నెంబర్ 4 లో పదిహేడు లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, రాజేష్ చంద్ర, వీరస్వామి జ్యోతిబా, సాయి, కోటేశ్వరరావు, రామయ్య చౌదరి, బాలు, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియా ట్రోలింగ్ సరికాదు

## కొండా సురేఖపై ట్రోల్స్‌ను ఖండించిన హరీష్ రావు

**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** మహిళలను గౌరవించడం అందరి బాధ్యతని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంత్రి కొండా సురేఖపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ జరగడంపై ఆయన స్పందించారు. ఆమెకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్లు తెలిపారు. మహిళల పట్ల అగౌరవంగా ప్రవర్తించడాన్ని ఎవరూ సహించబోరని అన్నారు. ‘ భారాస అయినా, వ్యక్తిగతంగా నేనైనా ఇలాంటివి ఉపేక్షించం. సోషల్ మీడియా వేదికగా జరిగే వికృత చేష్టలను ఖండిస్తున్నా. సోషల్ మీడియాలో బాధ్యతగా వ్యవహరించాలని అందర్నీ కోరుతున్నా‘ అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# సంపాదకీయం

## మూసీ ప్రజల ఆగ్రహావేశాలను గుర్తించాలి!

ఏ ప్రభుత్వం వచ్చినా..తమ ప్రాధాన్యాలనే ఎంచుకుంటున్నారు తప్ప ప్రజల ఎజెండాతో ముందుకు పోవడం లేదు. ప్రజలకు ఏం చేస్తే మేలు కలుగుతుంది..దీర్ఘకాల సమస్యలను ఎలా పరిష్కరించాలి అన్న ధ్యాస కాని, పట్టుదల కానీ ఉండడం లేదు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అలాగే ఉంది. ఒక్కరి నాయకత్వంలో ప్రభుత్వం నడవడం లేదని తేలిపోయింది. మంత్రులు ఎవరికివారు ముందుకు సాగుతు న్నారు. ఎవరికి తోచిన ప్రకటనలు వారు చేస్తున్నారు. సమిష్టిగా నిర్ణయాలు జరగడం లేదన్న ప్రచారం వస్తోంది.రుణమాఫీ విషయంలో స్పష్టత లేకుండా పోయింది. రేషన్ కార్డుల్లో స్పష్టత లేదు. అనర్హుల కార్డులు తొలగించే చర్యలు కానరావడం లేదు. బియ్యం ధరలను పెంచడం లేదు. ఆరోగ్యశ్రీపైనా స్పష్టత లేదు. ఆస్పత్రులను బలోపేతం చేస్తే ఆరోగ్యశ్రీ అవసరం లేకుండా చేయవచ్చు. కానీ అలాంటి కార్యక్రమాలు కదలడం లేదు. అక్రమ నిర్మాణాలపైనా స్పష్టత కానరావడం లేదు. హైడ్రా చేపట్టిన కొన్ని కూల్చివేతలపై ప్రజల్లో స్పందన వచ్చిది. కానీ మూసీ కూల్చివేతల సరికి వచ్చే సరికి వ్యతిరేకత పెరుగుతోంది. మూసీ సుందరీకరణ ఎంత ముఖ్యమో..అక్కడి ప్రజల జీవనం కూడా అంతే ముఖ్యం. వారి అస్తుల రోణ కూడా అంతే ముఖ్యం అని తొలుత గుర్తించాలి. అంటే సామాన్యుల విషయంలో ఆచితూచి వ్యవహరించాల్సి ఉంది. గత 20 ఏళ్లుగా ఆక్రమణలను చూసీచూడనట్లుగా వదిలేసి ఇప్పటికిప్పుడు ప్రజలను రోడ్డున పడేస్తామంటే సరికాదు. బ్యాంక్ లోన్లపై ప్రభుత్వం ఏం చేయబోతుందో చెప్పడం లేదు. జాగాలు అమ్మినవారు ఎవరు..రిజిస్ట్రేషన్ చేసిన వారు..కరెంట్ ఇచ్చిన వారు,నల్లా ఇచ్చిన వారంతా ప్రభుత్వాధికారులే అని మరవరాదు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆచితూచి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. ఆచరణ సాధ్యమయ్యే పనులే చేపట్టాలి. చెరువులు, జలాశయాల పరిరక్షణ అవసరమే. అంతమాత్రాన ఈ విషయంలో సామాన్యుల జీవితాలు కూడా ముఖ్యమేనని గమనించాలి. మూసీలో ఆక్రమణల పేరిట వేలాది ఇళ్లు కూల్చడం ప్రజల్లో వ్యతిరేకతకు దారితీస్తుంది. హైడ్రా చర్యల వల్ల ఏ పాపం తెలియనివాళ్లు నిరాశ్రయులు అవుతున్నారు. ఫాం హౌజ్‌లను, అతిథి గృహాలను నిబంధనలను అతిక్రమించి నిర్మిస్తే కూల్చినా ఫర్వాలేదు. అన్ని అనుమతుల తో పేదలు, మధ్యతరగతివారు నిర్మించుకున్న ఇల్లను అదికూడా, దశాబ్దాల క్రితం నిర్మించుకున్న వాటిని తొలగించాలనుకోవడం మంచిది కాదు. ప్రభుత్వ స్థలాలు, చెరువు శిఖంను అక్రమించడం పరిపాటిగా మారింది. రాజకీయ పార్టీలు ఇందుకు బాధ్యత వహించాలి. ఈ చర్యలను ఇకముందు ప్రోత్సహించకుండా చూసుకోవాలి. మూసీ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలనుకోవడంలో తప్పు లేదు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పం కూడా తప్పుకాదు. అయితే... దశాబ్దాలుగా మూసీలో ఆక్రమణలు జరిగాయి. వేలాది మంది ఇళ్లను నిర్మించుకున్నారు. ఫాం హౌస్‌ల కూల్చివేతలు జరిగినప్పుడు ప్రజల్లో సానుకూల స్పందన ఏర్పడింది. అయితే, హైడ్రా దూకుడు పెంచి సామాన్య ప్రజలు నిర్మించుకున్న ఇళ్లను కూడా కూల్చివేయడం ప్రారంభించగానే ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. చెరువులు, జలాశయాల ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్లను ముందుగా నిర్ణయించకుండా, ఇతర శాఖల అనుమతులతో నిర్మించుకున్న ఇళ్లను కూల్చడం సమర్థనీయం కాదు. అందుకే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోంది. దీనిని విపక్షాలు కూడా అవకాశంగా తీసుకుంటున్నాయి. దీంతో హైడ్రా చర్యలకు మొదటికే ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది. ప్రజల్లో వ్యతిరేకతకు దారితీస్తున్న చర్యల విషయంలో ఆచితూచి అడుగు వేయాల్సి ఉంటుంది. మరోవైపు మూసీనది ప్రక్షాళన పేరుతో జనావాసాలను ఖాళీ చేయించడంపై కూడా ప్రజల్లో ఆగ్రహావేశాలు నెలకొన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణం ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించాలి. క్షేత్రస్థాయిలో విషయాలను తెలుసుకోవాలి. కూల్చివేతలకు తాత్కాలికంగా విరామం ప్రకటించాలి. మొత్తం పరిస్థితిని సమీక్షించాలి. రెండు రోజుల క్రితం సంగారెడ్డి వద్ద ఎవరో చెరువులో నాలుగు అంతస్తుల భవనం నిర్మించుకున్నారు. అలాంటి వాటిని కూల్చగానే ప్రజలు హర్షించారు. మూసీ ఆక్రమణలు జరగడానికి గత ప్రభుత్వాలే కారణం. సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. రాజకీయ పార్టీలు ఒత్తిళ్లు తెచ్చి ఆక్రమణల కు పాల్పడి నిర్మించుకున్న కాలనీలకు ఆయా శాఖల అధికారులతో నీరు, విద్యుత్ వంటి సౌకర్యాలను సమకూర్చాయి. ఓట్లకోసం ఖాళీ స్థలాలను ఆక్రమింపజేయడం మన రాజకీయ పార్టీలకు అలవాటుగా మారింది. ఇలా ఆక్రమిత ప్రాంతాల్లో నిర్మితమైన ఇళ్లు చేతులు మారాయి. ఇప్పుడు డబ్బు పెట్టి వాటిని కొనుగోలు చేసినవాళ్లు లబోదిబోమంటున్నారు. కూల్చివేతలపై ప్రజల్లో వ్యతిరేకత బలపడకముందే ప్రభుత్వం మేలుకోవాలి. ప్రజల్లో మరింత వ్యతిరేక వ్యాపించక ముందే ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలి. తెలంగాణలో కూల్చివేతలు మాత్రమే జరుగుతున్నాయని, అభివృద్ధి పక్కకు పోయిందన్న వాదన వస్తోంది. నిజానికి ప్రజలకు ఏం చేస్తే బాగుంటుందో..ఏం చేస్తే రాష్ట్రం బాగుపడుతుందో అలాంటి వాటిపై దృష్టి సారించాలి. ప్రభుత్వం తలపెట్టిన మూసీ ప్రాజెక్టుపై మేధావులు, ఇంజనీర్లతో అధ్యయనం చేయాలి. ఆక్రమణలకు పాల్పడిన వారిని ముందుగా గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలి. ఆక్రమణలకు పాల్పడి ఇళ్లు నిర్మించి విక్రయించిన వారి నుంచి జరిమానా వసూలు చేసి బాధితులకు నష్టపరిహారం చెల్లించడం వంటి చర్యలపై దృష్టి పెట్టాలి. ఏళ్ల తరబడి ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వల్ల ఆక్రమణ అనేది హక్కుగా మారింది. హైడ్రా చర్యలను తొలుత స్వాగతించిన ప్రజలు, ప్రతి పక్షాలు ఇప్పుడు వ్యతిరేకిస్తున్నారు. అంటే ప్రజలకు ఇబ్బంద ఇకలిగితే ఎవరైనా గళం ఎత్తుతారు. ఈ క్రమంలో హైడ్రాకు విధివిధానలు ఖరారు చేయాలి. ప్రజలకు గుదిబండగా మారిన పథకాలను సమీక్షించాలి. అప్పుడే ప్రజలు స్వాగతిస్తారు. ఇందిరమ్మ ఇల్ల నిర్మాణం వేగం పెంచాలి. గ్రామాల ప్రజలు నగరాలపై పడకుండా గ్రామాల్లో పనులు జరిగేలా చూడాలి. అక్కడ ఉపాధి రంగాలను ప్రోత్సహించాలి. అప్పుడే నగరాలపై భారం కూడా తప్పుతుంది.

# రుణమాఫీపై రైతులను మోసం చేసిన ప్రభుత్వం



### మండిపడ్డ మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నిజామాబాద్ :రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. ఇస్తామన్న హామీని కూడా నెరవేర్చక పోవడం కాంగ్రెస్ వైఫల్యమని అన్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 3,79 లక్షల రైతులకు రుణమాఫీ కావాల్సి ఉండగా, 1.75 లక్షల మందికి మాత్రమే రైతులకు మాఫీ అయ్యిందన్నారు. ఇంకా 2.04 లక్షల రైతులకు రుణమాఫీ జరగలేదన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో 48 వేల మందికి గాను 32 వేల మంది రైతులకు రుణమాఫీ కాలేదని వివరించారు. సంపూర్ణ మాఫీ చేసే వరకూ వదిలేది లేదని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఇంటింటి హెల్త్ ప్రొఫైల్ తయారుచేసి, సీజనల్, ఇతర వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుందని వేముల గుర్తు చేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్‌కు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని, దీంతో సీజనల్ వ్యాధులు విజృంభించాయన్నారు. ఆశ వర్కర్లు, ఏఎన్ఎంల సేవలను కూడా సరిగా వాడుకోలేక పోతోందన్నారు. వెంటనే హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాన్ని కా పాడాలని కోరారు. ప్రభుత్వ దవాఖానల్లో సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు, చికెన్ గున్యా లాంటి వాటికి మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఉమ్మడి జిల్లాలో సగం మంది రైతుల రుణాలను కూడా మాఫీ చేయలేదని, రైతు భరోసా కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ఎన్నికలప్పుడు అన్ని రకాల వడ్లకు బోనస్ ఇచ్చి కొంటామన్న కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడేమో సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం రైతులను మోసం చేయడమేనని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. మక్క, సోయా, వరి పంటలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా రూ.500 బోనస్ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వమే ఆయా పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం నిర్ణయించిన ధరకు అదనంగా రూ.500 బోనస్ ఇస్తామని వరంగల్ రైతు డిక్లరేషన్‌లో, ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పారని, చెప్పినట్లే బోనస్ చెల్లించి రైతుల పంటలను కొనుగోలు చేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా మక్కజొన్న సాగు చేశారని, పంట కోతలు కూడా ప్రారంభమయ్యాయన్నారు. కానీ ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. దీంతో దళారులు తక్కువ ధరకే కొంటుండడంతో రైతులు ఎకరాకు రూ.60 వేల దాకా నష్టపోతున్నారన్నారు. మక్కకు కేంద్రం నిర్ణయించిన మద్దతు ధర రూ.2,225లకు తోడు కాంగ్రెస్ ఇస్తామన్న రూ.500 బోనస్ చెల్లించి రాష్ట్ర ప్రభుత్వమే పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, సోయా పంట మద్దతు ధర రూ.4,892 కాగా, దళారులు రూ.4,300 మాత్రమే చెల్లిస్తున్నారని చెప్పారు. ప్రైవేట్ వ్యాపారులు సోయా కొనడం ద్వారా రైతులు రూ.500 బోనస్‌తో కలిపి క్వింటాల్‌కు రూ.1100 నష్టపోతున్నారన్నారు. వడ్లకు బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ ఇప్పుడు సన్నవడ్లకే ఇస్తామని మాట మార్చిందని దుయ్యబట్టారు. రుణమాఫీ విషయంలోనూ అలాగే చేసిందన్నారు.

# వన్ నేషన్ పేరుతో ప్రజాస్వామ్యం ఖూనీ



### రాజ్యాంగాన్ని విధ్వంసం చేసే కుట్రలో మోడీ

### సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపణ

హైదరాబాద్ : వన్ నేషన్ పేరిట హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ విమర్శలు చేశారు. వన్‌నేషన్ పేరుతో హక్కులను కాలరాస్తు ఆర్డినెన్సు లు తీసుకొచ్చే ఆలోచనలను కేంద్రం చేస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.. అదే జరిగితే ప్రజాస్వామ్యం ఉండదని హెచ్చరించారు. రాజ్యాంగాన్ని పూర్తిగా నాశనం చేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నాలు తీవ్రంగా చేస్తోందని ఆరోపించారు. ఈ విషయంపై దేశవ్యాప్తంగా పోరాటానికి సిద్ధమవు తామని వార్నింగ్ ఇచ్చారు. నేపాల్‌లో అధిక వర్షాల ప్రభావం బీహార్ మీద పడిందని చెప్పారు. దాన్ని పరిశీలించడానికి కేంద్ర పార్టీ బృందం వెళ్తోందని తెలిపారు. అక్కడ ఎలాంటి సహాయచర్యలు చేపట్టాలనే దానిపై సమావేశంలో చర్చించిన తర్వాత ప్రకటిస్తామని అన్నారు.. హైడ్రాపై నారాయణ షాకింగ్ కామెంట్స్ చేశారు. హైడ్రా చాలా హడావుడి చేస్తోందన్నారు. వికారాబాద్‌లో ఫిరంగి నాలానీ ప్రక్షాళన చేయాలని గతంలో వికారాబాద్ నుంచి ఇబ్రహీంపట్నం వరకు ర్యాలీ చేపట్టామని గుర్తుచేశారు. చెరువులు, కుంటలు ఉంటే భూ గర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. కమర్షియల్ కాంప్లెక్స్‌లు, అక్రమ నిర్మాణాలు కూల్చితే పెద్దగా సమస్యే లేదని అన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలోని నిర్వాసితులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించి మూసీ ప్రక్షాళన చేయాల్సిందేనని స్పష్టం చేశారు.. కొంతమంది అడ్డు పడుతారు.. సమస్య ఉంది కాబట్టి వ్యతిరేకిస్తారని అన్నారు. నిర్వాసితులను కొత్త ఇళ్లలోకి తరలించిన తర్వాత కూల్చాలని సూచించారు. పేదలకు ప్రత్యామ్నాయాలు చూపకుండా కూల్చోద్దని కోరారు. ఫిరంగి నాలాను ప్రక్షాళన చేయాలని అన్నారు. కమర్షియల్ కాంప్లెక్స్‌లు అక్రమంగా ఉంటే కూల్చాల్సిందేనని అన్నారు. పేదలకు అన్యాయం చేయొద్దని తెలిపారు. భారత దేశంలో మౌలిక సదుపాయాల కొసం విపరీతంగా ఖర్చు చేస్తున్నారని చెప్పారు. హైవేలకు , ఎక్స్‌ప్రెస్ హైవే లు నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. అయితే... ఎక్స్‌ప్రెస్ హైవేలో సైడ్స్‌లో చాలా హైట్‌లో గోడలు కడుతున్నారని వివరించారు. రైతుల భూములు చుట్టూ ఉంటాయని... వారు ఎక్కడ నుంచి నడవాలని ప్రశ్నించారు. తాత్కాలిక ఉపశమనం కోసం అక్కడక్కడ గ్యాప్ ఇస్తున్నారని చెప్పారు. కానీ తమ డిమాండ్ మొత్తం దేశవ్యాప్తంగా ఎక్స్ ప్రెస్ వేలలో రైతులకు ఇబ్బందులు లేకుండా చేయాలనేదే ప్రధాన డిమాండ్ అని తెలిపారు. సర్వీస్ రోడ్‌లో ఉండాల్సిందేనని చెప్పారు. అభివృద్ధి జరగాలి.. అంటే... అదాని అభివృద్ధి కాదని.. అందుకే కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీకి లేఖ రాశామని తెలిపారు. రైతులకు అన్యాయం చేస్తే... తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామని సీపీఐ నారాయణహెచ్చరించారు.


# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తలు

### ఇజ్రాయిల్ దాడులతో పెరుగుతున్న ఆందోళనలు

న్యూఢిల్లీ : ఇజ్రాయెల్ హిజ్బుల్లా అగ్రనాయకత్వాన్ని అంతమొందిస్తూ వస్తోంది. సెప్టెంబర్ 27న హిజ్బుల్లా గ్రూప్ చీఫ్ హసన్ నస్రల్లాను చంపేసింది. గత వారంలో వైమానిక దాడుల్లో 7 మంది కీలక కమాండర్‌లను హతమార్చింది. టెర్రర్ గ్రూప్ సెంట్రల్ కౌన్సిల్‌లోని సీనియర్ సభ్యుడు నబిల్ కౌక్‌ను కూడా చంపేశారు. భీకర దాడులు కొనసాగుతున్నప్పటికీ హిజ్బుల్లా దళాలు ప్రతిఘటిస్తూనే ఉన్నాయి.హిజ్బుల్లా నేత నస్రల్లా మరణం తరువాత మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరిగాయి. నస్రల్లా మృతితో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అత్యవసర సమావేశానికి పిలుపునిచ్చారు. దక్షిణ బీరుట్‌లోని హిజ్బుల్లా ప్రధాన కార్యాలయంపై ఇజ్రాయెల్ దాడులు చేసిన తర్వాత ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఇరాన్ అధికారులు తెలిపారు. నస్రల్లాను అంతమొందించడంతో ఖమేనీని సురక్షిత ప్రదేశానికి తరలించారు. లెబనాన్ రాజధాని బీరుట్ నగరంలోని ఓ నివాస భవనంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులతో విరుచుకుపడింది. ఈ నగరంలోని నివాస సముదాయాలపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్(ఎఆఈ) దాడులు చేయడం ఇదే తొలిసారి. కోలా ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్ భవనం పైఅంతస్తుపై ఐడీఎఫ్ బాంబులు ప్రయోగించింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు హెజ్‌బొల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేసిన ఇజ్రాయెల్.. ఇప్పుడు నివాస సముదాయాలపైనా విరుచుకుపడటంతో ప్రాణనష్టం మరింత పెరిగే అవకాశం ఉంది.లెబనాన్‌లోని హిజ్బుల్లా లక్ష్యాలపై ఇజ్రాయెల్ భీకర వైమానిక దాడులు జరిపింది. తాజా దాడిలో 100 మందికి పైగా మరణించారు.350 మందికి పైగా గాయపడినట్లు లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం తెలిపింది. శనివారం జరిగిన వైమానిక దాడుల్లో 33 మంది మృతి చెందగా, 195 మంది గాయపడ్డారు. గత రెండు వారాలుగా లెబనాన్‌లో ఐడీఎఫ్ జరుపుతున్న దాడుల్లో మృతుల సంఖ్య మొత్తంగా వెయ్యి దాటినట్లు తెలుస్తోంది. శుక్రవారం రాత్రి 9:30కు ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో నస్రల్లా మరణించినట్లు హిజ్బుల్లా శనివారం ప్రకటించింది. బీరుట్‌లోని హిజ్బుల్లా ప్రధాన కార్యాలయంపై ఇజ్రాయెల్ సైన్యం 80 టన్నుల బాంబుతో దాడి చేసింది. నస్రల్లా తన కుమార్తెతో అక్కడ ఉన్నాడని తెలిసింది. బాంబు దాడి అనంతరం.. ఇజ్రాయెల్ సైన్యం తన సోషల్ మీడియా ఖాతాలలో 'హసన్ నస్రల్లా ఇకపై ప్రపంచాన్ని భయపెట్టలేడు' అని పోస్ట్ చేసింది.

# ధ్యానయోగం.. దైవమార్గం

ఆలోచనా ప్రవాహాన్ని ఒక ప్రత్యేకమైన వస్తువు మీద గానీ, ఒక భావం మీద గానీ,అవిచ్ఛిన్నమైన తైలధారగా స్థిరంగా ఉంచగలిగితే దానిని 'ధ్యానం' అంటారు.ధ్యానమంటే మనసు లోతును కొలిచే సాధనంగా నిర్వచిస్తారు తాత్త్వికులు. ఆలోచనల వెనుక అంతర్నిహితంగా దాగిఉన్న శక్తిని పరిశీలించటమే ధ్యాన లక్ష్యం. మరి ఈ ఆలోచనల వెనుక ఉన్నది ఏమిటి? అసలు ఎటువంటి ఆలోచనలు లేని మనసును ఊహించగలమా? ఎప్పుడూ మంచి చెడులు, తప్పు ఒప్పులనే పరస్పర విరుద్ధాలైన ద్వంద్వాల చుట్టూ పరిభ్ర మించే ఈ మనసు వెనుక ఉన్నది ఏమిటి? మనసును శోధించటం ద్వారా ఆలోచనలను పరిష్కరించటం, సమాధానపరచటం.. ఇదే ధ్యానం. క్రమక్రమంగా ధ్యానంలో పురోగమిస్తూ ఉన్నత స్థాయిని అందుకున్నప్పుడు ఈ మనసు మనం అనుకున్నంత చెడ్డదేమీ కాదని అవగతమవుతుంది. ధ్యానం సిద్ధించినప్పుడు మనసు నుంచి విషయవాసనలన్నీ తొలగిపోతాయి. అప్పుడు మనసు శుద్ధమై ఆధ్యాత్మిక పరిధిలోకి వస్తుంది. 'ధ్యానం చేసేవారికి దేహాభిమానం తొలగుతుంది. భగవంతుని సాక్షాత్కారం కలుగుతుంది. ఈ జన్మలోనే ముక్తిని పొందుతారు' అంటోంది వేదాంత పంచదశి. హృదయంలో బొటనవేలు పరిమాణంలో ఆత్మ ఉందని కఠోపనిషత్తు చెబుతుంది. నిరాకార నిర్గుణ పరమాత్మ ధ్యానం ఈ హృదయంలో చేయాలి. ఈ హృదయాకాశంలో జ్యోతిని పరమాత్మగానూ, ఆ జ్యోతి మధ్యలో ఉన్న చిన్న జ్యోతిని తన ఆత్మగానూ ధ్యానించాలని స్వామి వివేకానంద ఉద్ఘాటించారు. అలాంటి మహాత్ములు ఆత్మ, పరమాత్మలు ఒకటని చెప్పారు. అందుకే ఏకత్వాన్ని ధ్యానించాలి. హృదయాకాశంలో ద్వాదశ దళాల కమలంపై ఇష్టదేవత చిన్మయమూర్తి ఆసీనుడై ఉన్నట్లుగా భావించి ధ్యానించాలి. సగుణ ధ్యానం చేసేవారు అయిదు విషయాలు గుర్తుంచుకోవాలని ధ్యానసాధకులు చెబుతారు.



ఆధ్యాత్మికం

# రైతుల సహకారంతోనే సంఘాల అభివృద్ధి

**- రైతులు పండించిన ప్రతి గింజను కొనే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే - రైతు కూలీలకు సైతం నెలకు వెయ్యి రూపాయలు అందించే బాధ్యత మాదే - గత పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని బి.ఆర్.ఎస్ భ్రష్టు పట్టించింది**

**- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు**





**సుల్తానాబాద్, సెప్టెంబర్ 30( ది క్రైమ్ న్యూస్ ):** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ ప్రాధమిక వ్యవసాయ సహకార సంఘం 129 వ సర్వసభ్య సమావేశం సింగిల్ విండో చైర్మన్ లు శ్రీగిరి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి సోమవారం రోజున ముఖ్య అతిథిగా హాజరై రైతులకు సోసైటీ సభ్యులకు అధికారులకు పలు సూచనలు చేసిన పెద్దపల్లి శాసనసభ్యులు .చింతకుంట విజయరమణా రావు ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణా రావు మాట్లాడుతూ గత10 సంవత్సరాల పాలనలో బి.ఆర్.ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందని అన్నారు. రైతుల బాధలు పట్టించుకోలేదని గతంలో అధికారంలో ఉన్నప్పుడు లక్ష రూపాయల రుణమాఫీ చేయని ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు అని కనీసం రైతుల వడ్డీ మాఫీ చేసిన దాఖలాలు లేవన్నారు. ప్రస్తుతం బావ బావమరుదులు రాష్ట్ర రైతులను తప్పు దోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ డిక్లరేషన్ సభలో స్పష్టంగా హామీ ఇచ్చిన ప్రకారం రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసి చూపించామని కొన్ని టెక్నికల్ ఇష్యుల వల్ల అక్కడక్కడ రుణమాఫీ కానీ రైతులకు త్వరలోనే రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న 119 నియోజకవర్గాలలో ఎక్కడికైనా వచ్చి నిరూపించే దమ్ముందని పేర్కొన్నారు. కేవలం కల్లబొల్లి మాటలతో కాలం గడిపే వారి మాటలు నమ్మవద్దని పేర్కొన్నారు. రానున్న వర్షాకాలం పంటకు ?500 రూపాయల బోనస్ ఇచ్చి తీరుతామని పేర్కొన్నారు. గతంలో రైతుల వద్ద వడ్లు కొనుగోలు చేసి అనేక ఇబ్బందులు పెట్టి కటింగ్ లు పెట్టిన చరిత్ర మీదని కమిషన్లకు కక్కుర్తి పడిన ప్రభుత్వం మీది అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఒక్క కిలో కూడా కటింగ్ చేయకుండా రైతుల వడ్లు కొనుగోలు చేస్తున్నామని రైతులు కొనుగోలు కేంద్రాలలో విక్రయించిన ఐదు రోజుల్లోనే తమ బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అవుతున్నాయని పేర్కొన్నారు. రైతులను మోసం చేసే పార్టీ తమది కాదని రైతన్నలను రాజును చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో రైతులు ఏ పంట పండించిన కొనుగోలు చేస్తామని సన్నరకం దొడ్డురకం అంటూ వంకలు పెట్టే ప్రభుత్వం కాదని పేర్కొన్నారు. రైతు కూలీలకు సైతం రైతులకు అందించే విధంగానే నెలకు 1000 రూపాయల చొప్పున సంవత్సరానికి 12 వేల రూపాయలు అందిస్తామని పేర్కొన్నారు. నిండు అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు ప్రతి సవాలు చేసిన వ్యక్తిని అని తాను అసెంబ్లీలో మాట్లాడినప్పుడు ఏ ఒక్క ప్రతిపక్ష ఎమ్మెల్యే సమాధానం చెప్పలేదని తాను ఉన్నదే రైతుల ప్రజల సేవ చేసేందుకుకనీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు, వైస్ చైర్ పర్సన్ బిరుదు సమత కృష్ణ, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, సిఐ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రావణ్ కుమార్, బ్యాంకు అధికారులు, సింగల్ విండో డైరెక్టర్లు, రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు, పలువురు పాల్గొన్నారు.

# స్వామివారి పవిత్ర లడ్డూ కల్తీ హిందూత్వంపై దాడి

**- ఘటనపై సిట్టింగ్ జడ్జీచే విచారణ జరిపించాలి**

**- నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**- వి హెచ్ పి రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కరరావు..**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తిరుమల తిరుపతి దేవస్థానం అందించే స్వామివారి పవిత్ర లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వును వినియోగించడం యావత్ హిందువుల మనోభావాలను దెబ్బతీయడమేనని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీనెయ్యి సరఫరా చేసిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం జిల్లా కేంద్రంలో శాంతియుత ర్యాలీ చేపట్టి జిల్లా అదనపు కలెక్టరుకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా జెండా చౌరస్తా వద్ద భాస్కరరావు మాట్లాడుతూ, లక్షలాదిమంది భక్తుల ధార్మిక చింతనను గాయపరచడమేనని, ఘోర అపచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నమన్నారు. ఆలయ వ్యవహారాలలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం, అన్యమతస్తులను ఆలయ నిర్వహణలో అధికార స్థానాల్లో నియమించడం వల్ల ఈ ఘటన జరిగిందని అభిప్రాయపడ్డారు. హిందూ వ్యతిరేకులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, తగిన బుద్ధి చెపుతామని హెచ్చరించారు.స్వామివారి లడ్డూలో జంతుకొవ్వు వినియోగిస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర, నిష్పక్షపాత న్యాయ విచారణ సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో జరిపించాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే హిందూ దేవాలయాలపై తమ నియంత్రణను నిలిపివేయాలని, హిందూ సమాజమే సొంతగా ధార్మిక సంస్థలను నిర్వహించడానికి అనుమతించాలని ఆయన డిమాండ్ చేశారు.హిందుత్వాన్ని గౌరవించే వారికి హిందూ సంప్రదాయాలను అర్థం చేసుకుని గౌరవించే, అంకితభావం గల వ్యక్తులచే ధార్మిక సంస్థలు నిర్వహించబడాలని ఆయన ప్రభుత్వాలకు సూచించారు. దేవాలయాలు హిందూ సమాజంలోని అన్ని వర్గాల అవసరాలను తీర్చేలా చూసేందుకు ధార్మిక పరిషత్ ఏర్పాటును ప్రతిపాదిస్తున్నట్లు భాస్కరరావు తెలిపారు. శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవాలయం నుండి ప్రారంభమైన ర్యాలీ అమర్ నగర్, శివాజీ చౌరస్తా, మెయిన్ రోడ్డు మీదుగా జెండా, కమాన్ వరకు కొనసాగింది. ర్యాలీలో విశ్వహిందూ పరిషత్ తెలంగాణ విభాగ్ కార్యదర్శి అయోధ్య రవిందర్, జిల్లా అధ్యక్షులు డాక్టర్ స్వరూప్ కిరణ్ గౌడ్, జిల్లా కార్యదర్శి నాగులమల్యాల సత్యం, బజరంగ్ దళ్ జిల్లా కన్వీనర్ సంపత్ యాదవ్, మంచాల వరప్రసాద్, జుంజుపెల్లి దిలీప్, మాతృశక్తి సంయోజిక తార ఠాగూర్, మద్దెల శ్రీను, శివంగారి సతీష్, రాజం మహంత, మణికంఠ, చారి, తదితరలు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**- సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్లు**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు జే.అరుణ శ్రీ, జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్లు జే.అరుణ శ్రీ, జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల అర్జీలను స్వీకరించారు. అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికుల సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే



**సుల్తానాబాద్, సెప్టెంబర్ 30( ది క్రైమ్ న్యూస్ ):** గీత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. ఓదెలలో సోమవారం శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలోని తాటి వనంలో గౌడన్నలకు తాటిచెట్టు ఎక్కే కాటమయ్య రక్షణ కవచాలతో శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. ట్రైనర్ గౌడ సోదరులకు రక్షణ కవచంతో చెట్టు ఎక్కి వివరించారు. ఈకార్యక్రమంలోకాంగ్రెస్ మండల అధ్యక్షులు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, అన్నయ్య గౌడ్ పాల్గొన్నారు.

## భక్తుల సౌకర్యార్థం దేవాలయం రోడ్డు మరమ్మత్తులు

**- ఎమ్మెల్యే కృషితో మట్టి రోడ్డు**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి మండలం లోని దేవునిపల్లి లో నిర్వహించే శ్రీ లక్ష్మి నృసింహ స్వామి జాతరకు వచ్చే భక్తులకు రవాణా లో ఇబ్బందులు లేకుండా, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు కృషితో మరమ్మతులు చేపడుతున్నట్లు పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గౌస్ మియా అన్నారు. సోమవారం అందుగులాపల్లి పెద్దమ్మ ఆలయం నుండి ఆలయం వరకు రోడ్డు పై గుంతలు ఏర్పడగా మట్టి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌస్ మియా మాట్లాడుతూ భక్తులకు ఇబ్బంది ఏర్పడుతుందనే దృష్ట్యా ఎమ్మెల్యే దృష్టి కి తీసుకుపోగా మట్టి రోడ్డు ఏర్పాటు కు సహకారం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ గుండా లక్ష్మి నారాయణ, మాజీ ఎంపిటిసి చీకటి సరోజనా – చంద్రయ్య, రాజయ్య, సిద్ధ గట్టయ్య, గుర్రపు అంజయ్య,గుండా రాజు, కంకణాల హరిష్, దామా అనిల్, కొయ్యడ రాజు, కొయ్యడ అఖిల్, మర్రి కుమార్, చిట్యాల సతీష్, అరె కుమార్, అరె నరేష్, గుండా రాజు, చీకటి లక్ష్మి నర్సయ్య తో పాటు పలువురు పాల్గొన్నారు.

## అర్హులైన రైతులందరికీ రుణ మాఫీ చేయాలని నేడు కలెక్టర్‌కు వినతి

**ముత్తారం. సెప్టెంబర్. 30. (ది క్రైమ్ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా అర్హులైన రైతులందరికీ 2 లక్షల రూపాయల రుణ మాఫీ చేయాలని,రైతు భరోసాను వెంటనే ఇవ్వాలని కోరుతూ నేడు మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ మంథని ఇన్చార్జి పుట్ట మధూకర్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేయనున్నట్లు ముత్తారం మాజీ ఎంపిపి అత్తె చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు.రుణ మాఫీ కానీ రైతులందరూ రుణానికి సంబంధించిన పత్రాలతో ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలు పెద్ద మొత్తంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## సుల్తానాబాద్ కోర్టుకు హాజరైన బిజెపి నాయకులు



**సుల్తానాబాద్, సెప్టెంబర్ 30( ది క్రైమ్ న్యూస్):** సుల్తానాబాద్ మున్సిపాలిటీలోని సుగ్లంపల్లిలో 17 నెలల క్రితం ఐకేపీ సెంటర్ లో రైతుల వరి ధాన్యం కొనుగోలు విషయములో వడ్లు అధిక తూకం వేసి రైతులను నష్టపరచడాన్ని నిరసిస్తూ రైతులకు న్యాయం చేయాలని నిరసన కార్యక్రమము చేయడం జరిగింది. రైతుల న్యాయం జరగాలని చేసిన ధర్నాలో పాల్గొన్న బిజెపి నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసి కేసు నమోదు చేయడం జరిగింది. సుల్తానాబాద్ కోర్టుకు హాజరైన బిజెపి మాజీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు రావుల రాజేందర్, అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్, అసెంబ్లీ సభ్యత్వ నమోద్ ప్రముక్ పొల్సాని సంపత్ రావు బిజెపి రాష్ట్ర మరియు జిల్లా నాయకులు తంగెల్ల రాజేశ్వర్ రావు, బెజ్జంకి దిలీప్, ఎర్రోళ్ల శ్రీకాంత్, ఉప్పు కిరణ్, వేగొలం మల్లికార్జున్, కొల్లూరి సంపత్, మరియు సుల్తానాబాద్ మున్సిపాలిటీ అధ్యక్షులు కూకట్ల నాగరాజు తదితరులు హాజరైనారు.

## ఏఎస్సై బి.తిరుపతిరావును అభినందించిన ఎస్పీ రోహిత్ రాజు



**ఉమ్మడి ఖమ్మం జిల్లా. బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** వర్టికల్స్ వారీగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో ప్రతిభ కనపరిచిన అధికారులకు ఇటీవల తెలంగాణ రాష్ట్ర డీజిపి జితేందర్ ప్రశంసా పత్రాలను అందజేయడం జరిగింది. జిల్లా నుండి జూలూరుపాడు పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న బి.తిరుపతిరావు గారు “బెస్ట్ ఎంక్వయిరీ ఆఫీసర్” గా డీజీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఏఎస్ఐ తిరుపతిరావు ని ప్రత్యేకంగా అభినందించారు.పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన విధులను బాధ్యతతో,నిబద్ధతతో నిర్వర్తిస్తే ఎప్పటికైనా తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి రెహమాన్, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై రాణాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ సింగరేణి అధికారికి వీడ్కోలు సన్మానం



**యైటింక్లయిన్ కాలని. (క్రైమ్ న్యూస్):** సంగరేణి సంస్థ నుండి ఉద్యోగ విరమణ పొందిన డివిజన్ సీనియర్ సెక్యూరిటీ ఇన్స్పెక్టర్ రేనా రాజలింగు కు సోమవారం ఉద్యోగ విరమణ సన్మానం జరిగింది. రామగుండం రెండవ డివిజన్ లో సర్వీస్ కాలం పూర్తి చేసిన సందర్భంగా యాజమాన్యం డివిజన్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డివిజన్ జనరల్ మేనేజర్ ఎల్.వి. సూర్యనారాయణ, ఇన్చార్జి ఎస్ఓ టూ జీఎం సంతోష్ కూమార్, గుర్తింపు సంఘం డివిజన్ ప్రతినిధి జి. రవీందర్, పర్సనల్ డిజిఎం ఎస్. అనీల్ కుమార్ పాల్గొని రాజాలింగు దంపతులకు శాలువాకప్పి, జ్ఞాపిక అందజేసి ఘన సన్మానం తో వీడ్కోలు పలికారు. అలాగే ఎస్సి, ఎస్టి ఉద్యోగుల సంఘం నాయకులు ఘన సన్మానం తో వీడ్కోలు తెలిపారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. రేనా రాజలింగు 39 సం: రాలు సింగరేణిలో వివిధ హెూదాలలో పని చేసి, అందరి మన్ననలను పొంది సంస్థకు సేవలు అందించి, నేడు పదవి విరమణ పొందడం గొప్ప విషయమన్నారు. పదవి విరమణ అనంతరం వారి శేషజీవితం అష్టఐశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో గడపాలని కోరుకున్నారు. ఇంకా ఈ కార్య క్రమంలో సిఎంఓఏఐ ప్రతినిధి సుగుణాకర్, డిజిఎం (సివిల్) ధనుంజయ, డిజిఎం ఫైనాన్స్ వెంకట రామచంద్ర, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్, డివైఎస్ఇ (ఐఈ) రాజన్న, ఎస్ఇ పర్చేజ్ పందరీనాధన్, ఐటి మేనేజర్ నారాయణ, డివైపిఎం వేణుగోపాల్, ఎస్సి, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు పరకాల శ్రీనివాస్, జె.ఎస్.సంపత్ కుమార్, టి.వేంకటేశ్వర్లు, వెంకటి, దేవదాస్, సంజీవరాజు, పి.రాజలింగం, తదితరులు పాల్గొన్నారు.

## విస్తృత ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి

**- డాక్టర్ బండారి రాజ్ కుమార్**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రానున్న కరీంనగర్ ఆదిలాబాద్, నిజామాబాద్ మెదక్ జిల్లాల పరిధిలో ఉన్న పట్టభద్రులను, నిరుద్యోగులను ఉపాధ్యాయులను కలిసి పట్టుభద్రుల ఎన్నికల్లో తనకు మద్దతు తెలుపాలంటూ పట్టుభద్రుల ఎన్నికల బరిలో ఉన్న స్వతంత్ర అభ్యర్థి తెలంగాణ మెడికల్ కౌన్సిలర్ మెంబర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ బండారి రాజ్ కుమార్ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.ఈ మేరకు సోమవారం పెద్దపల్లి జూనియర్ కళాశాల వాకర్ అసోసియేషన్ వాకర్స్, క్రీడాకారులతో కలిసి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డాక్టర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు ఎమ్మెల్సీ ఓటు వినియోగించుకోవాలని కోరారు. బుధవారం నమోదు ప్రక్రియ ప్రారంభం అవుతు,ప్రతి ఒక్కరు ఇందులో భాగస్వామ్యం కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు, డాక్టర్లు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు, టీజిఎఫ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే స్టేషన్ రోడ్డులో డ్రైనేజీ దుర్గంధం వెదజల్లుతోంది

- కమిషనర్ గారు ఈ కంపు వాసన భరించలేకపోతున్నాం
- మా పరిధి కాదంటున్న మున్సిపల్ - రైల్వే శాఖ అధికారులు
- ఈ డ్రైనేజీ సమస్యను పరిష్కరించే నాదులే లేరా





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పట్టణ ప్రగతి పరిసరాల పరిశుభ్రత అంటూ ప్రచార ఆర్భాటాలు నిర్వహిస్తున్న అధికార యంత్రాంగం 15 రోజులుగా దుర్గంధం వెదజల్లుతున్న రైల్వే స్టేషన్ రోడ్డులో గల డ్రైనేజీ కాల్వకు పరిష్కారం చూపలేకపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసిన ఈ డ్రైనేజీ మురుగునీరు బయటికి వెళ్లే దారి లేదని ఇది రైల్వే కి సంబంధించిన విషయమని తూతూ మంత్రంగా మున్సిపల్ సిబ్బంది బ్లీచింగ్ చల్లి వదిలేసారు. రైల్వే శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే ఇది మా పరిధి కాదని మున్సిపల్ పరిధిలోకే వస్తుందని రైల్వే శాఖ అధికారులు చెప్పడం కాదు రైల్వే శాఖ పరిధికే వస్తుందని మునిసిపల్ శాఖ అధికారులు చెప్పడం ఆశ్చర్యానికి గురి చేస్తుందని, ఈ డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపే నాదులే లేరా అని ప్రశ్నిస్తున్నారు. పెద్దపల్లి పట్టణంలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందుగల డ్రైనేజీ కాలువ జీవనదిల పారుతూ రైల్వే స్టేషన్ హమాలీల రెస్ట్ రూమ్ వెనకాల వచ్చి చేరి చెరువును తలపిస్తోంది. అసలు ఈ డ్రైనేజీ కాలువలోకి నీళ్లు ఎక్కడినుండి వస్తున్నాయి ఇండ్ల నుండి వచ్చే మురుగునీరు ఇందులోకి రాదు, ఏ కారా?నాలు లేవు, ఏ దుకాణాల నుండి రావు ఆ వార్డు పరిధిలోని ఏ ఇంటి నుండి కూడా ఒక చుక్క నీళ్లు ఈ కాలువలోకి రావు మరి ఈ డ్రైనేజీ కాలువ జీవ నదిల పారుతూందంటే పట్టణంలోని ఓ ప్రముఖ కార్పొరేట్ పాఠశాల హాస్టల్ నుండి వచ్చే మురుగు నీళ్లు ఇందుకు కారణం కాని ఇవేమీ అధికారుల కంటికి కనిపించక పోవడం ఆశ్చర్యమని స్థానికులు చర్చించుకుంటున్నారు. పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రచారాలు నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులకు, చైర్ పర్సన్ కు, ప్రజా ప్రతినిధులకు ఈ డ్రైనేజీ కాలువ కనిపించడం లేదా అంటూ స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. దాదాపు 15 రోజులుగా ఈ దుర్గంధం వాసనతో అవస్థలు పడుతున్నామని కమిషనర్ గారు ఈ కంపు వాసన భరించలేకపోతున్నామని ఈ డ్రైనేజీ కాల్వకు శాశ్వత పరిష్కారం చూపాలని స్టేషన్ రోడ్ లోని స్థానికులు, చిరు వ్యాపారస్తులు మొరపెట్టుకుంటున్నారు. ఈ డ్రైనేజీ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే కరుణించి మున్సిపల్ అధికారులతో, రైల్వే శాఖ అధికారులతో మాట్లాడి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

# సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట బిఎంఎస్ మహాధర్నా

**యైటింక్లయిన్ కాలని. (క్రైమ్ న్యూస్):** సింగరేణి ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై బిఎంఎస్ కార్యకర్తలు సోమవారం కొత్తగూడెంలోని కంపెనీ ప్రధాన కార్యాలయం ఎదుట మహా ధర్నా చేపట్టారు. సంస్థలోని అన్ని డివిజన్లో నుండి తరలి వెళ్లిన యూనియన్ నాయకులు, కార్యకర్తలు ప్రధాన ద్వారం వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీకేఎంఎస్ కార్యదర్శి, జేబీసీసీఐ సభ్యులు పి. మాధవ నాయక్ మాట్లాడుతూ.. సీఎం పిఎఫ్ నిధుల్లో జరిగిన అవినీతిపై సిబిఐ చే విచారణ జరిపించి బాధ్యులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ సంస్థలు ట్రాన్స్కో, జెన్కో ల నుండి రావలసిన 33000 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లింప చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ ఆర్థిక పరిస్థితి, నికర లాభాలను వివరిస్తూ, శ్వేతపత్రం విడుదల చేయాలని, అన్నీ రీజియన్లలో సూపర్ స్పెషాలిటీ వైద్యశాలల ఏర్పాటు, కేంద్రియ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని యాజమాన్యాన్ని కోరారు. సొంత ఇంటి పథకం లో భాగంగా రెండు గుంటల ఇంటి స్థలం కేటాయించాలని, ఆదాయపు పన్ను రియంబర్స్మెంట్ అమలు చేయాలని, ఇంకా తదితర న్యాయమైన హక్కులను అమలు చేస్తూ, పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆయన డిమాండ్ చేశారు. తదనంతరం డైరెక్టర్ సత్యనారాయణ రావుకు నాయకులు మెమోరాండం అందజేశారు. ఇంకా ఈ మహా ధర్నా కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వై. సారంగపాణి, అప్పాని శ్రీనివాస్, కేంద్ర ఉపాధ్యక్షులు బి.రాంసింగ్, శ్రీనివాసులు, కేంద్ర కార్యదర్శి మదాసి రవీందర్, గట్టు శ్రీనివాస్, రాగం రాజేందర్, నాయకులు పవన్ కుమార్, ప్రదీప్, సతీష్, మల్లేష్, రౌత్ రమేష్, జివి. కృష్ణారెడ్డి, రవి, సృజన్, వి.కుమార్ స్వామి, గణేశ్, లీలా కృష్ణ, మహేష్, సంగం చందర్, లట్టి జగన్ మోహన్, అన్ని ఏరియాలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# వృత్తి విద్యా శిక్షణా కేంద్రం 35వ వార్షికోత్సవ వేడుకలు ..





**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్30(ది క్రైమ్ న్యూస్):** మానకొండూర్ నియోజకవర్గం తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ గ్రామంలోని ది కరీంనగర్ జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల, వృత్తి విద్యా శిక్షణా కేంద్రం 35 వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.ముఖ్య అతిథిగా హాజరైన మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ, కార్యక్రమంలో పాల్గొన్న ట్రస్ట్ చైర్మన్ సీపీఐ జాతీయ కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి,మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ బండ్రూ శోభారాణి ,స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకిటి కరుణ ,డైరెక్టర్ క్రాంతి వేస్లి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ,అడిషనల్ కలెక్టర్ ప్రపుల దేశాయ్.

# గ్రామ ఆరోగ్య పారిశుద్ధ్య పోషణ దినోత్సవం

## సందర్భంగా పోషణ ఆరోగ్య జాతర కార్యక్రమం ..

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్30(ది క్రైమ్ న్యూస్):** మానకొండూర్ నియోజకవర్గం మానకొండూర్ బాలికల ఉన్నత పాఠశాలలో గ్రామ ఆరోగ్య పారిశుద్ధ్య పోషణ దినోత్సవం సందర్భంగా పోషణ ఆరోగ్య జాతర కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రులు సీతక్క,పొన్నం ప్రభాకర్ స్థానిక శాసనసభ్యులు డా.కవ్వంపల్లి సత్యనారాయణ,కార్యక్రమంలో పాల్గొన్న శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకటి కరుణ , డైరెక్టర్ క్రాంతి వెస్లి , మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ బండ్రు శోభారాణి ,కలెక్టర్ ప్రమేల సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ , మున్సిపల్ కమిషనర్ ఛాహత్ భాజ్ పెయ్ యూనిసేఫ్ ప్రతినిధి జలాల్ ఇతర అధికారులుపోషణ ఆరోగ్య జాతర సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్ లను సందర్శించిన మంత్రులు సీతక్క , పొన్నం ప్రభాకర్ స్టాల్ లో పిల్లల పోషణ కు సంబంధించిన ఆహార పదార్థాలను రుచి చూసిన మంత్రులు ,అధికారులు అక్కడే ఏర్పాటు చేసిన వైద్య శిబిరం పరిశీలన చేసి అనంతరం జరిగిన సభలో పాల్గొన్నారు.





# సింగరేణి అధికారికి వీడ్కోలు సన్మానం



**యైటింక్లయిన్ కాలని. (క్రైమ్ న్యూస్):** సింగరేణి రామగుండం రీజియన్‌లో ఉద్యోగ విరమణ పొందిన అధికారి కె.వి.రావు కు సోమవారం వీడ్కోలు సన్మానం జరిగింది. డివిజన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ ఎల్.వి. సూర్యనారాయణ, వకీల్ పల్లి ప్రాజెక్టు అధికారి ఏ. నెహ్రూ, ఇనచార్జ్ డివిజన్ ఎస్ఓ టు జిఎం ఎస్. సంతోష్ కుమార్ పాల్గొని రీజియన్ జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన కె.వి.రావు శాలువా కప్పి జ్ఞాపకం అందజేసి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిఎం సూర్యనారాయణ మాట్లాడుతూ.. కె.వి రావు సింగరేణిలో వివిధ హోదాలలో పని చేసి, అందరి మన్ననలను పొందుతూ, సంస్థకు సేవలు అందించి పదవి విరమణ పొందడం గొప్ప విషయమన్నారు. పదవి విరమణ అనంతరం వారి శేషజీవితం అష్టఐశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో గడపాలని కోరుకున్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ నరసింహారావ్, డీజీఎం పర్సనల్ %ఙ% అధికార ప్రతినిధి ఎస్.అనిల్ కుమార్, డీజీఎం సివిల్ ధనుంజయ, డీజీఎం ఫీనాన్స్ వెంకట రామచంద్ర, ఏరియా సర్వే అధికారి బుక్య దేశాయ్, ఏరియా సెక్యూరిటి అధికారి షరీఫ్ మహమ్మద్, డివై.ఎస్ఇ (ఐఈ) రాజన్న, డిప్యూటీ మేనేజర్ క్వాలిటీ సుభాష్, ఐటి మేనేజర్ నారాయణ, ఫారెస్ట్ అధికారి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మున్నేరు వరద బాధితులకు వనిత గ్రూప్ చేయూత





**ఖమ్మం ఉమ్మడి జిల్లా, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** మున్నేరు వరద బాధితులకు వనిత గ్రూప్ ప్రతినిధులు అండగా నిలిచారు. సోమవారం వరదలతో సర్వస్వం కోల్పోయిన 15మంది వరథ బాధితులకు దుస్తులు, బియ్యం, నూనె, ఉల్లిగడ్డలు, గోదుమ పిండి శానిటరి పాడ్స్, తదితర నిత్యావసరాల సరకులను సత్య మార్గం సంస్థతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వనిత గ్రూప్ ప్రతినిధులు గుడిమెట్ల రజిత, వైదేహి, హేమ, సత్యమార్గం సర్వీస్ సొసైటీ ప్రతినిధులు శ్రీలక్ష్మి, అనిత, మంజుల తదితరులు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవగా బావించి వరదలు వలన తీవ్రంగా నష్టపోయిన బాధితులకు మానవత్వంతో నెల రోజుల నుంచి సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు.

# రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి: ఆర్ ఐ అన్వేష్..



**ఎండపల్లి, సెప్టెంబర్ 30(ది క్రైమ్ న్యూస్ ):** పౌర హక్కుల పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, పౌర హక్కులకు భంగం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఆర్ఐ అన్వేష్ అన్నారు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని అంబారిపేట గ్రామంలో సోమవారం అధికారులు పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ ఐ అన్వేష్ మాట్లాడుతూ...అంటరానితనాన్ని నిర్మూలించడమే పౌర హక్కుల దినోత్సవం ముఖ్య ఉద్దేశం అని అన్నారు. రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కుల పై ప్రతి ఒక్కరు ఆహ్వాన కలిగి ఉండాలని ఈ సందర్భంగా తెలిపారు. పూర్వం స్వాతంత్రం రాక మునుపు అంటరానితనం ప్రభలంగా ఉండేదని ఇప్పుడు దాదాపుగా తగ్గిపోయిందని తెలియజేశారు. గ్రామలాల్లో ప్రతి ఒక్కరు సోదర భావంతో ఉండాలని, స్వేచ్ఛ, సమానత్వం ప్రజలందరూ కలిగి ఉండాలని కుల వ్యవస్థ దౌర్జన్యం వంటి వాటి నుంచి దూరంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుండేటి గోపిక జితేందర్ రెడ్డి, ఎం ఈ ఓ రాంచంద్రం, ఎం పీ ఓ శ్రీనివాస్, ఎస్సీ వెల్ఫేర్ వార్డెన్ అప్సర్, పంచాయతీ కార్యదర్శి గోపు భీమన్న, ఐకెపి సీఓ నక్క మురళి, ఆశలు , అంగన్వాడీ సిబ్బంది తో పాటు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చదువు మధ్యలో ఆపేసిన వారికి మళ్లీ చదువుకునేందుకు అవకాశం.

**ముత్తారం.సెప్టెంబర్.30.(ది క్రైమ్ న్యూస్):** అనివార్య కారణాల వలన చదువు మధ్యలో మానేసిన వారికి రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ చదువుకునేందుకు అవకాశం కల్పించిందని అడవి శ్రీరాంపూర్ జడ్పిహెచ్ఎస్ హెచ్ఎం, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ ఇరుగురాల ఓదెలు ఒక ప్రకటనలో తెలిపారు.ఆర్థికంగా,అనివార్య కారణాల వలన చదువుకునే అవకాశం లేక చదువు మధ్యలో మానేసిన వారికి పదవ తరగతి,ఇంటర్ విద్యను పూర్తి చేసే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఓపెన్ స్కూల్ ద్వారా అవకాశం కల్పిస్తుందని తెలిపారు.ఈ అవకాశంను మండలంలోని విద్యాభిమానులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి జీవితం ఆనందంగా గడపాలి

## - పదవి విరమణ పొందిన అధికారులను సన్మానించి జ్ఞాపకాలు అందజేసిన సిపి

## - అధికారులకు సిబ్బందికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్







**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** పోలీస్ శాఖ నందు సుదీర్ఘ కాలం పాటు విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన ఎస్ఐ మరియు ఎ ఆర్ఎస్ఐ లను ఈరోజు రామగుండం పోలీస్ కమీషనర్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన పదవీ విరమణ కార్యక్రమంలో రామగుండము పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ పాల్గొని పదవీ విరమణ పొందుతున్న ఇద్దరు పోలీసు అధికారులను వారి కుటుంబ సభ్యుల తో కలిసి శాలువా పూలమాలతో సత్కరించి జ్ఞాపిక అందచేసి శుభాకాంక్షలు తెలియజేశారు ఈరోజు పదవీ విరమణ పొందిన కె. పోచయ్య ఎస్ఐ సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ 1984 సంవత్సరంలో పోలీసు డిపార్ట్మెంట్‌లోకి కానిస్టేబుల్ గా ఎంపికై అంచలంచలుగా ఎదిగి 40 సంవత్సరముల విధులను నిర్వర్తించడం జరిగింది ఎ ఆర్ ఎస్ఐ కె. శ్రీనివాసులు రామగుండం1984 సంవత్సరంలో పోలీసు డిపార్ట్మెంట్ లోకి కానిస్టేబుల్ గా వచ్చి అంచలంచలుగా సర్వీసులోని 40 సంవత్సరముల విధులను నిర్వర్తించడం జరిగింది ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ గతంలో పోలీసు వ్యవస్థ అత్యంత క్లిష్ట పరిస్థితుల నందు విధులను నిర్వర్తించి ప్రస్తుతం పోలీసు వ్యవస్థ ప్రశాంతంగా ఉండడానికి గల కారణమైన అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. సుదీర్ఘ కాలం పాటు పోలీసు వ్యవస్థను సేవలందించి పదవీ విరమణ పొందుతున్నందుకు ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలను పోలీసులు సక్రమంగా విధులను నిర్వర్తించడానికి కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతగానో ఉంటుందని వారి తోడ్పాటు వల్లనే విధులను నిర్వర్తించి ఉన్నత స్థానాలకు ఎదగగలరని తెలియజేశారు. పదవీ విరమణ పొందిన తర్వాత వచ్చే ప్రయోజనాలను త్వరగా అందించాలని సిబ్బందికి తెలియజేశారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో తమ శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఆనందంగా గడపాలని సూచించారు. తమ ఆరోగ్యాల పట్ల తగు జాగ్రత్తలను తీసుకోవాలని కోరారు. ఎటువంటి అవసరం ఉన్న కమీషనరేట్ పోలీసు వ్యవస్థ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి అడ్మిన్ సి.రాజు ఎఆర్ ఎసిపి ప్రతాప్ సుందర్ ఏఓ అశోక్ కుమార్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు దామోదర్ వామన మూర్తి సంపత్ శ్రీనివాస్ మల్లేశం సూపరింటెండెంట్ ఇంద్ర సేనా రెడ్డి మనోజ్ కుమార్ రామగుండం పోలీస్ కమీషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు దబోర్లా కుంట పోచలింగం, స్వామి పదవి విరమణ అధికారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పోస్ట్ మెట్రిక్ ఉపకారవేతనాలకు దరఖాస్తుల స్వీకరణ

## - జిల్లా ఎస్సీ డీ డీ రవీందర్ రెడ్డి




**లక్షెట్టిపేట (ది క్రైమ్ న్యూస్):** 2024-25 విద్యా సంవత్సరానికి మంచిర్యాల జిల్లాలోని ఎస్సీ విద్యార్థుల పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల ఉపసంచాకులు పోటు రవీందర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరం 2024-2025 నకు ఎస్సీ విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు చేసుకోవాడానికి మూడు దశల్లో ప్రక్రియ ఉంటుందని డెమో అతెంటేకేషన్, బయోమెట్రిక్ అతేంటికేషన్, రిజిస్ట్రేషన్ 3 ప్రక్రియలకు సంబంధించి ముందుగా ఎస్సీ విద్యార్థి మొదటి దశకు డెమో అతేంటికేషన్, చేయవలసి ఉంటుందన్నారు. అందులో భాగంగా విద్యార్థి ఈ పాస్ వెబ్సైట్ నందు ఫ్రెస్ రెన్యువల్ రిజిస్ట్రేషన్ లో భాగంగా తన ఆధార్ కార్డు నెంబర్ ను సమర్పించి తన ఎస్ఎస్సీ డీటెయిల్స్ తో మ్యాచ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ విద్యార్థి ఆధార్ డీటెయిల్స్ తన ఎస్ఎస్సి డీటెయిల్స్ తో మ్యాచ్ అయితే కనుక డెమో అతేంటికేషన్ విజయవంతమైనట్లు సందేశం కనబడుతుందన్నారు. దాని అనుగుణంగా విద్యార్థి తదుపరి దశ అయిన బయోమెట్రిక్ అథెంటిఫికేషన్ చేయవలసి ఉంటుందన్నారు. ఒకవేళ విద్యార్థి ఆధార్ కనుక ఎస్ఎస్సి డీటెయిల్స్ తో మ్యాచ్ కాకుంటే దానికోసం విద్యార్థి తన ఆధార్ డీటెయిల్స్ సమీప మీ సేవ కేంద్రంలో అప్డేట్ చేయవలసి ఉంటుందన్నారు. డెమో అథెంటికేషన్లో సక్సెస్ అయిన విద్యార్థి రెండో దశ లో సమీప మీసేవ కేంద్రంలో బయోమెట్రిక్ అతేంటికేషన్ చేయవలసి ఉంటుందన్నారు. అది కూడా సక్సెస్ అయితే తదుపరి మూడోవ దశకు అప్లికేషన్ కు చేరుకుంటుందన్నారు. చివరి దశలో గతంలో మాదిరిగానే సంబంధిత సర్టిఫికెట్లను అప్లోడ్ చేసి ఉపకార వేతనాల డీటెయిల్స్ పూర్తిగా నింపి దరఖాస్తు సమర్పించవలసి ఉంటుందన్నారు. ఒకవేళ ఆధార్ సెట్ కాకపోతే వెంటనే సంబంధిత బ్యాంకులో చేయించుకోవాలని అయితే మూడు దశలో విద్యార్థి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి సదరు దరఖాస్తులను తదుపరి ప్రక్రియ కోసం సంబంధిత కళాశాల ప్రిన్సిపల్ కు సమర్పించవలసి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియ అంతా ఈపాస్ వెబ్సైట్ నందు ఉంటుందన్నారు. జిల్లాలోని సంబంధిత కళాశాల యాజమాన్యాలు ఎస్సీ విద్యార్థులకు తగు సూచనలు చేసి వారు రిజిస్ట్రేషన్ చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు కోరారు. ఇతర వివరములకు ఉప సంచాలకులు జిల్లా షెడ్యూల్ అభివృద్ధి శాఖ కార్యాలయం, రూమ్ నెంబర్- 3 నస్పూర్ లోని సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సముదాయంలో సంప్రదించవలసినదిగా ఆయన తెలిపారు.

# సింగరేణి ఆసుపత్రిలో గుండె జబ్బులపై అవగాహన



**యైటింక్లయిన్ కాలని. (క్రైమ్ న్యూస్):** స్థానిక సింగరేణి రామగుండం సెక్టార్.3 ఆసుపత్రిలో సోమవారం రోగులకు గుండె జబ్బుల పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆసుపత్రి లో రెండవ డివిజన్ జనరల్ మేనేజర్ ఎల్.వి. సూర్యనారాయణ ఆదేశాల మేరకు ఆసుపత్రి మెడికల్ సూపర్ ఇండెంట్ డాక్టర్ మహిపాల్ నేతృత్వంలో చేపట్టిన కార్యక్రమంలో ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పద్మ పాల్గొని వైద్య సదుపాయం కొరకు వచ్చిన రోగులతో మాట్లాడుతూ.. నాడు గుండె జబ్బులు వయసు ఎక్కువ ఉన్నవారికి, వయసు మళ్ళిన వారికి వచ్చేవనీ, కానీ నేడు వయస్సు తేడా లేకుండా, చాలా మంది గుండె జబ్బు బారిన పడి కన్ను మూస్తున్నారన్నారు. ప్రపంచ దేశాలు ఏటా సెప్టెంబర్ 29న ప్రపంచ హృదయ దినోత్సవం జరుపుతున్నాయని, జీవన శైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా, గుండె సంభందమైన జబ్బుల నుండి కాపాడు కోవచ్చునన్నారు. ముఖ్యంగా ఆహారపు అలవాట్లు, ధూమపానం, మద్యపానం మానేయడం, వ్యాయామాలు, సరియైన నిద్ర, ఒత్తిడి లేని జీవితం, బరువు తగ్గడం, నియంత్రిత షుగర్, హైపర్‌టెన్షన్, రెగ్యులర్ మెడికల్ చెకప్‌ల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చుననీ సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ శానీటరి ఇన్స్పెక్టర్ రామకోటి, ప్యారమెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణి బ్యాడ్మింటన్ పోటీల్లో ఓసిపి.3 జట్టు గెలుపు



**యైటంక్లయిన్ కాలని. (క్రైమ్ న్యూస్):** సింగరేణి రామగుండం రెండవ డివిజన్ వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన డిపార్ట్మెంటల్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో ఓసిపి.3 ప్రాజెక్టు జట్టు గెలుపొందింది. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు జరిగిన ఈ పోటీల్లో ఓసిపి.3 ప్రాజెక్టు జట్టు తో వకీల్ పల్లి సర్ఫేస్ మైనర్ జట్టు పోటీ పడగా ఓసిపి.3 జట్టు విజయం సాధించగా, వకీల్ పల్లి జట్టు రన్నర్స్‌గా నిలిచింది. క్రీడా అసోసియేషన్ సూపర్వైజర్ నరేందర్ రెడ్డి పోటీలు నిర్వహించారు.


## వాణినికేతన్ పాఠశాలలో బతుకమ్మ పండగా





**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్30(ది క్రైమ్ న్యూస్):** వాణినికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బతుకమ్మ పండుగను చాలా వైభవంగా జరుపుకున్నారు. డైరెక్టర్ రేణుక తంగేడు, గునుగు, బంతి, చేమంతి, పట్టుగుచ్చు ఇలా రకరకాల పువ్వులతో బతుకమ్మలను భక్తి శ్రద్ధలతో పేర్చారు. ఆ తర్వాత విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తెచ్చిన రంగురంగుల బతుకమ్మలను ఒకచోట చేర్చి, అనేక బతుకమ్మ పాటలతో బతుకమ్మ ఆడారు. బతుకమ్మల చుట్టూ చేసిన నృత్యాలు, కోలాటాలు అందరిని అలరించాయి. డైరెక్టర్ రేణుక సత్తు ముద్దల ప్రసాదాన్ని అందరికీ పంచారు. మంచిగా పేర్చిన బతుకమ్మలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కోట లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయలు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## హరిపురం జిపిని సందర్శించిన ఎంపిడిఓ



**ముత్తారం. సెప్టెంబర్. 30. (ది క్రైమ్ న్యూస్):** మండలంలోని హరిపురం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఎంపీడీవో సురేష్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా రిజిస్టర్లను ఆయన తనిఖీ చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి, సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని సూచించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు శానిటైజేషన్ చేయాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు.

# ఎస్టీ హాస్టల్‌ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎం ఈ ఓ



**లక్షెట్టిపేట (ది క్రైమ్ న్యూస్):** పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలను సోమవారం మండల విద్యాధికారిణి హెలెన్ డార్తి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలో యూ డైస్ అమలు గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.,సమర్ధవంతమైన ప్రణాళిక అమలు యూ డైస్ తోనే సాధ్యమని ఆమె తెలిపారు.అదే విధంగా జాతీయ కనీస సామర్థ్య పరీక్షలపై కూడా అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు.అంతకుముందు పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మరింతగా ఉత్తీర్ణత పెరిగేలా ఉపాధ్యాయ బృందం కృషి చేయాలని ఆదేశించారు. పాఠశాలల సందర్శనతో విద్యా ప్రమాణాలు మరింతగా మెరుగు పడేలా కృషి చేస్తానని ఈ నూతన ఏం ఈ ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, వసతి గృహ సంక్షేమాధికారి మల్లా రెడ్డి,తెలుగు పండిట్ సత్యనారాయణ,స్పోర్ట్స్ ఆఫీసర్ జీవరత్నం, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

# కమీషనరేట్ వ్యాప్తంగా పదవి విరమణ పొందిన ముగ్గురు పోలీస్ అధికారులు

## పోలీసు అధికారులను ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికిన కరీంనగర్ అడిషనల్ డీసీపీ ఏ.లక్ష్మి నారాయణ




**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్30(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ కమీషనరేట్ లో పనిచేస్తూ పదవీకాలం ముగిసిన ముగ్గురు ఏఎస్సైలు,మహమ్మద్ యూసఫ్ షరీఫ్ 41 సంవత్సరాలు, బి. మల్లయ్య 39 సంవత్సరాలు, యం.లక్ష్మయ్య 35 సంవత్సరాలు, సుదీర్ఘ కాలంపాటు పోలీసు శాఖకు సేవలందించి పదవి విరమణ పొందారు. కమీషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలునందు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ అడిషనల్ డీసీపీ ఎ.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ అనివార్యమన్నారు. ఎన్నో సవాళ్లతో కూడుకుని వున్న పోలీస్ ఉద్యోగం సంపూర్ణంగా చేసి పదవి విరమణ పొందడమే గొప్ప విజయం అన్నారు. ఇంతకాలం సేవలందించగలిగారంటే కుటుంబ సభ్యుల సహకారం కూడా ఎంతో ఉందన్నారు. పదవి విరమణ పొందుతున్న అధికారులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం పదవి విరమణ పొందుతున్న అధికారులకు అడిషనల్ డీసీపీ చేతుల మీదుగా పూలమాలవేసి శాలువాతో సత్కరించారు. వారికి జ్ఞాపికలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఏ.లక్ష్మీనారాయణతో పాటుగా రిజర్వు ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి (సంక్షేమం) కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్సై మామిడి సురేందర్, రిజర్వు ఎస్సై తిరుపతి ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గన్నేరువరం మండల కేంద్రంలో స్వచ్ఛభారత్




**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్30(ది క్రైమ్ న్యూస్):** నెహ్రూ యువ కేంద్రం, యువ చైతన్య యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ గన్నేరువరం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.యువ చైతన్య యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అనిల్ రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛత పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి మన ఇంటిని ఏ విధంగా అయితే పరిశుభ్రంగా ఉంచుకుంటామో అదేవిధంగా దేశాన్ని పరిశుభ్రంగా ఉంచే వైపు ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించి పనిచేయాలని ప్రతి సంవత్సరంలో 100 గంటలు ప్రతి వారానికి రెండు గంటలు శ్రమదానం చేయాలని తెలియజేస్తూ, విద్యార్థులు, యువతి యువకుల్లో స్ఫూర్తిని నింపేందుకు శ్రమదానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గంట గౌతమ్ ,శీను, సాయి , రమ్య, దివ్య విద్యార్థినీ విద్యార్థినులు మండల యువకులు తదితరులు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

# పశ్చిమాసియా పరిణామాలు నెతన్యాహుతో మోడీ సంభాషణ

**న్యూఢిల్లీ,(ది క్రైమ్ న్యూస్):** కొంతకాలంగా లెబనాన్‌లో వరుస దాడులు చేపట్టి.. హెజ్‌బొల్లా చీఫ్ నస్రల్లా సహా కీలక కమాండర్లను ఇజ్రాయెల్ హతమార్చిన విషయం తెలిసిందే. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్ ద్వారా సంభాషించారు. పశ్చిమాసియాలో చోటుచేసుకున్న ఇటీవలి పరిణామాలపై చర్చించారు. ఈ మేరకు ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. పశ్చిమాసియాలో చోటుచేసుకున్న ఇటీవలి పరిణామాలపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో మాట్లాడాను. ప్రపంచంలో ఉగ్రవాదానికి చోటులేదు. స్థానికంగా ఉద్రిక్తతలు తీవ్రతరం కాకుండా చర్యలు తీసుకోవడంతోపాటు బందీలందరిని సురక్షితంగా విడుదల చేయడం చాలా ముఖ్యం. వీలైనంత త్వరగా శాంతి, స్థిరత్వాల పునరుద్ధరణ ప్రయత్నాలకు మద్దతు ఇచ్చే విషయానికి భారత్ కట్టుబడి ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏఎస్ఐ గా పనిచేస్తూ ఎస్ఐ గా పదోన్నతి పొందిన ఆరుగురు అధికారులు

**- అభినందింఛి ర్యాంక్ పదోన్నతి చిహ్నంను అలకరించి శుభాకాంక్షలు తెలిపిన సిపి శ్రీనివాస్**



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీసు శాఖలో పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందని పెరిగిన బాధ్యతను క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలని సీపీ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కష్టపడి పనిచేసి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రజలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కష్టపడి పని చేస్తే ఎప్పటికైనా మంచి గుర్తింపు లభిస్తుందని ఇప్పటివరకు ఎలాంటి క్రమశిక్షణతో విదులు నిర్వహించారో అదేవిధంగా మిగతా సర్వీస్ పూర్తి చేసి మరిన్ని పదోన్నతులు పొందాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉంటాం మానసికంగా శారీరకంగా ఒత్తిడిని దూరం చేయడానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని మనం ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు అని ఈ సందర్భంగా సీపీ తెలియజేశారు ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ సి రాజు ఏ ఆర్ ఏసిపి ప్రతాప్ సుందర్ రావు ఆర్ఐ లు దామోదర్ మల్లేశం వామన మూర్తి సంపత్ శ్రీనివాస్ సూపరిండెంట్స్ ఇంద్రసేనారెడ్డి మనోజ్ కుమార్ గౌస్ రామగుండం పోలీస్ కమీషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లాకుంట పోచలింగం పాల్గొన్నారు.

# గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బొడ్డెమ్మ వేడుకలు

**ధర్మపురి సెప్టెంబర్ 30, ( ది క్రైమ్ న్యూస్ ):** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బొడ్డెమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలో ని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ వేడుకలను ఆనవాయితీగా గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతోందని వారు తెలిపారు. ఈ బొడ్డెమ్మ పేర్చే విధానం లో మహిళలు ఎంతో నిష్ఠతో ఉపవాస దీక్షతో రకరకాల పుష్పయాలతో పేర్చడం జరుగుతుందని వారు వివరించారు. ఈ బొడ్డెమ్మ ను తలపై స్వీకరించే స్త్రీలు పెళ్లి కాని వారికి మాత్రమే ఎత్తడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. అలా ఎత్తిన మహిళ కు సంవత్సరం వెళ్లే లోపు పెళ్లి జరుగుతుందని వారి పూర్వికుల నుండి అలానే ఆనవాయితీగా వస్తోందని వారు వివరించారు. బొడ్డెమ్మ పై పెట్టె (పసుపు ముద్ద) గౌరమ్మ ను పిల్లలు కానీ మహిళలు ప్రసాదంగా స్వీకరిస్తే తప్పక పిల్లలు కలుగుతారని గంగపుత్ర మహిళల యొక్క ప్రగాఢ విశ్వాసం. వీళ్ళు నిర్వహించుకొనే ఈ బొడ్డేమ్మ వేడుకలకు సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన గంగపుత్ర కుటుంబాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై అంగరంగ వైభవంగా నిర్వహించుకొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పిత్ర అమావాస్య కు వారం రోజుల ముందు ఏర్పాటు చేసుకొని నిర్వహించుకొవడం జరుగుతుందని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సంగి సతెమ్మ, మహిళా కౌన్సిలర్ లు గరిగే ఆరుణ, జక్కు పద్మ, అసెట్టి మమత, చిత్తనోజి స్వప్న, వేముల నాగలక్ష్మి, గంగపుత్ర మహిళా సభ్యులు గడప గంగమ్మ, గజ్జి రాధ, నర్ముల పొసమ్మ, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.





# తిరుపతి లడ్డు కల్తీ విషయంలో విచారణ జరపాలి..

**- గోవిందా..గోవిందా.. నినాదాలతో మార్మోగిన వైరా..**
**- నిందితులను కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్..**
**- చైతన్య హిందూ వేదిక ఆధ్వర్యంలో.. వైరా లో 300 మందితో నిరసన ర్యాలీ..**






**ఖమ్మం ఉమ్మడి జిల్లా, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** తిరుపతి లడ్డు కల్తీ వివాదంలో వెంటనే విచారణ జరపాలంటూ చైతన్య హిందూ వేదిక ఆధ్వర్యంలో వైరాలో హిందూ వాదులు భారీ ఎత్తున సోమవారం సాయంత్రం నిరసన ర్యాలీ నిర్వహించారు.. వైరా ఖమ్మం రోడ్డు హెచ్ పి పెట్రోల్ బంక్ వద్దనుండి ప్రారంభమైన ఈ నిరసన ర్యాలీ పాత సెంటర్ మీదుగా రింగ్ రోడ్డు , పాత కూరగాయల మార్కెట్ మీదుగా శ్రీ కోదండ రామాలయ దేవాలయం వద్దకు చేరుకుంది.. గోవిందా గోవిందా అంటూ మార్మోగిన నినాదాలతో నినాదాలతో ఈ ర్యాలీ కొనసాగింది.. తిరుపతి లడ్డు కల్తీ వివాదాన్ని వెంటనే విచారణ జరిపి నిందితులను కట్నంలో శిక్షించాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో చైతన్య హిందూ వేదిక సభ్యులు, వర్తక సంఘం అధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు, వైరా ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు మిట్టపల్లి కిరణ్ కుమార్ , నూకల వాసు, మిట్టపల్లి సత్యం బాబు, అనుమోలు భాస్కరరావు మిట్టపల్లి రాఘవ రావు, మిట్టపల్లి రమణ, గ్రంధి లక్ష్మీనరసయ్య , చంపసాల వరదరాజు,గ్రంధి విశ్వం, రంగా వాసవి, నూకల అన్నపూర్ణతదితరులు పాల్గొన్నారు..

# కారులో తరలిస్తున్న గంజాయి పట్టివేత

**భద్రాచలం, (ది క్రైమ్ న్యూస్):** భద్రాచలంపట్టణంలోని పాత మార్కెట్లో ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారుల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కారులో అక్రమంగా తరలిస్తున్న సుమారు 138 కేజీల గంజాయిని పట్టుకున్నారు. ఒడిశా రాష్ట్రం మల్కన్గిరి నుంచి భద్రాచలం మీదుగా మహారాష్ట్రలోని ముంబయికి తరలిస్తున్నట్లుగా పోలీసులు తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ సుమారు రూ.37.5లక్షలు ఉంటుందన్నారు. గంజాయిని తరలిస్తున్న వ్యక్తితోపాటు కారు, ఒక సెల్ఫోన్ను స్వాధీనం చేసుకున్నారు.

# కోర్టు డ్యూటీ ఆఫీసర్లను అభినందించిన ఏసిపి





**హుజురాబాద్ సెప్టెంబర్ 30 (ది క్రైమ్ న్యూస్):** హుజురాబాద్ సబ్ డివిజన్ పరిధిలో గల 2136 కేసులను లోక్ అదాలత్ లో పరిష్కారానికి కృషి చేసిన కోర్టు డ్యూటీ ఆఫీసర్లను హుజురాబాద్ ఏసిపి శ్రీనివాస్ జి సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని రెండువేల పైచిలుకు కేసులను సంబంధిత వ్యక్తులతో మాట్లాడి లోక్ అదాలత్ కు వారిని తీసుకువెళ్లి ఆ కేసుల పరిష్కారానికి పోలీసులు తమ మీద బాధ్యత వేసుకొని పనిచేశారన్నారు. సిడిఓ లా పనితీరు బేష్ అని కితాబిచ్చారు. ఇదే పనితీరును పోలీసులు శాంతి భద్రతల విషయంలో కూడా ఉండాలని సూచించారు. శాంతి భద్రతల విషయంలో రాజీ పడేదే లేదని, వాటికి భంగం కలిగితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని కూడా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ టౌన్ సిఐ తిరుమల్ గౌడ్, రూరల్ సీఐ పులి వెంకట్ గౌడ్, జమ్మికుంట సిఐ వరగంటి రవి, జమ్మికుంట రూరల్ సీఐ కిషోర్, ఎస్సైలు యూనస్ అహ్మద్ అలీ, సిహెచ్ తిరుపతి, తోట తిరుపతి తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# ముందస్తు బతుకమ్మ సంబరాలు..



**సెప్టెంబర్ 30 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట పట్టణంలోని స్రవంతి జూనియర్ కళాశాలలో సోమవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు... విద్యార్థినిలు, అధ్యాపకులు బతుకమ్మలతో ఆట పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పుల్లూరి సంపత్ రావు, ప్రిన్సిపాల్ నడిపెల్లి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. తెలంగాణలో బతుకమ్మ పండుగకు ఎంతో ప్రాధాన్యత, విశిష్టత ఉన్నాయని అన్నారు...ప్రకృతిని పూజించే పండుగ బతుకమ్మ అని,తొమ్మిది రోజులు తొమ్మిది రకాల ప్రసాదాలతో పూజిస్తూ, తీరొక్క పూలతో పూజిస్తారని అన్నారు.. ప్రేమానురాగాలకు ప్రతీక అని, ఆడపడుచులకు అతి పెద్ద పండుగ బతుకు పండగ అని అభివర్ణించారు. మన సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించాలని కోరారు. ఈసందర్భంగా విద్యార్థుల నృత్యాలు, ఆటపాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ పుల్లూరి సంపత్ రావు,ప్రిన్సిపాల్ నడిపెల్లి శ్రీనివాస్ రావు, కళాశాల డైరెక్టర్లు కొండ విజయ్, రహమాన్ ఖాన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు...

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ సర్కార్ ధ్యేయం

**- రైతుల అభ్యున్నతి సింగిల్ విండోల కృషి**
**- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు**






**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రైతుల అభ్యున్నతికి సింగిల్ విండోల ద్వారా కృషి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. సోమవారం పెద్దపల్లి మండలం, అప్పన్నపేట, సుల్తానాబాద్ మండలం చిన్నకాల్వల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల 129 వ సర్వ సభ్య సమావేశం సింగిల్ విండో చైర్మన్లు చింతపండు సంపత్ గారు, దేవరనేని మోహన్ రావు గర్ల అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ముఖ్య అతిధిగా హాజరై పెద్దపల్లి మండలం కనగర్తి, సుల్తానాబాద్ మండలం మియాపూర్ గ్రామాలల్లో ఆ ప్రాంత రైతుల అవసరాలకు అనుగుణంగా నూతనంగా నిర్మించిన గోదాములను తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ లిమిటెడ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు గారితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చింతపండు సంపత్, వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు మరియు తదితర గ్రామాల రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# అంటరానితనం నిర్మూలించడం అందరి బాధ్యత






**రామగిరి, (ది క్రైమ్ న్యూస్):** గ్రామాలలోఅంటారాని తనాన్ని నిర్మూలించుట మనందరి బాధ్యత అని ఆర్ఐ నిహారిక అన్నారు. సోమవారం రామగిరి మండలంలోని జల్లారం గ్రామపంచాయతీ పరిధిలో గల సింగిరెడ్డి పల్లె గ్రామంలో ఎస్సీ కాలనీలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రామగిరి తాసిల్దార్ రామచంద్రరావు ఆదేశాలతో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ ఐ నిహారిక మాట్లాడుతూ గ్రామాలలో ఒకరిది ఎక్కువ ఒకరిది తక్కువ కులమత బేధం లేకుండా కలిసిమెలిసి జీవించాలని రెండు గ్లాసుల విధానానికి స్వస్తి పలకాలని గ్రామాలలో కులమతాలను ఎవరైనా ప్రేరేపించినట్లయితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ కె.మహేష్ జూనియర్ అసిస్టెంట్ యశ్వంత్, మాజీ ఎంపీటీసీలు ఏలువాక ఓదెలు, మల్లెపెల్లి సుకన్య, పంచాయితీ కార్యదర్శి నజుమా, మంథని బానయ్య, తోడేటి శ్రీనివాస్, జూల లక్ష్మయ్య ,జూల కొమురయ్య ఫీల్డ్ అసిస్టెంట్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

**- అనాధికారికంగా ప్రెస్, పోలీస్, ఆర్మీ స్టిక్కర్ వేసుకున్న వారికి కఠిన చర్యలు తప్పవు - ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో రామగుండం సిపి, ట్రాఫిక్ ఏసిపి ఆదేశాల మేరకు అయ్యప్ప టెంపుల్ వద్ద స్పెషల్ డ్రైవ్ లో భాగంగా సోమవారం ట్రాఫిక్ సిఐ అనిల్ కుమార్ నేతృత్వంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలు లేని , డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ప్రెస్, పోలీస్, ఆర్మీ వాహనాలపై అనాధికారంగా స్టిక్కర్ వేసుకున్న వాహనాలను వారి చేతనే తొలగింపచేశారు. వాహనాలపై జరిమాణాలు విధించారు. రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలతో పాటు జరిమానాలు విధిస్తున్నామన్నారు. వాహనదారులు తప్పనిసరిగా వాహన ధ్రువీకరణ పత్రాలు, లైసెన్సులు, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# పదవి విరమణ పొందిన పోలీస్ అధికారుల సేవ స్పూర్తి వంతం

## పదవి విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్ష: జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్

**జగిత్యాల, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** విధి నిర్వహణలో అందరి మన్ననలు అందుకొని పదవీ విరమణ పొందుతున్న ఏ.ఎస్.ఐ వాలి బెగ్, హెడ్ కానిస్టేబుల్ రాజయ్య గార్లను ని శాలువా,పులమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేసిన ఎస్పీ గారు. ఈరోజు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన పదవీ విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన ఎస్పీ గారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. ఎన్నో రకాల త్యాగాలతో పాటు కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజలకు సేవలందించడం ఎంతో గర్వకారణమన్నారు. ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పదని అన్నారు. విజయవంతంగా సర్వీస్ పూర్తి చేసిన అధికారుల సేవలను ఈ సందర్భంగా గుర్తు చేస్తూ వారి అనుభవం, సేవలు భవిష్యత్ తరాలకు ఎంతో స్ఫూర్తివంతంగా నిలుస్తాయని చెప్పారు. పదవి విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావిజీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షినారు.అనంతరం పదవి విరమణ పొందిన అధికారులను పోలీసు వాహనంలో ఎక్కించి పోలీస్ బ్యాండ్ తో ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీమ్ రావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు కిరణ్, వేణు, ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు..



# ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే ప్రభుత్వం నెరవేర్చాలి..

## - జిల్లా సిపిఐ ప్రధాన కార్యదర్శి వెన్న సురేష్..

**జగిత్యాల, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వానికి సిపిఐ పార్టీ తరఫున సిపిఐ జిల్లా కార్యదర్శి వెన్న సురేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సంవత్సరం గడుస్తున్న ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రతి మహిళకు 2500 రూపాయలు పింఛన్ ఇవ్వాలని ప్రతి బీడీ కార్మికురాలికి 4000 రూపాయల పింఛన్ ఇవ్వాలని ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ వెంటనే మొదలు పెట్టాలని సిలిండర్ సబ్సిడీ అందరికీ అందే విధంగా ఆదుకోవాలని స్థలం ఉండి డబ్బు లేని నిరుపేదలకు 5 లక్షల రూపాయలు ఇచ్చి ఆదుకోవాలని చేయుంత గ్యారంటీలో భాగంగా అర్హులైన వారికి ప్రతి నెల 4000 రూపాయలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అందేలా చూడాలని పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలను తగ్గే విధంగా చర్యలు చేపట్టాలని గృహలక్ష్మి పథకంపై 200 యూనిట్ల కరెంట్ చాలామంది ప్రజలకు ఇప్పటివరకు అందుబాటులో లేదని దాన్ని అందేలా చూడాలని ప్రతి మండలానికి ఇంటర్నేషనల్ స్కూల్ కార్యాచరణ తక్షణమే మొదలు పెట్టాలని సురేష్ కోరారు ఇందులో భాగంగా సీపీఐ నాయకులు ఎండి మౌలానా మణుగూరు హనుమంతు సుతారి రాములు శ్రీ గాద దేవదాసు ఎండి అక్రమ్ ఏన్నం రాధ జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కొండ రాజన్న కసారం కార్యదర్శి మునుగురు గంగ నర్సయ్య




కల్వకోట కార్యదర్శి బెత్తం గంగరాజం కొండాపురం కార్యదర్శి ఎదులపురం గంగరాజం మల్లాపూర్ రాజన్న ఇంకా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# నైతిక విలువపై విద్యార్థులకు అవగాహన సదస్సు..



**జగిత్యాల, రాయికల్ (ది క్రైమ్ న్యూస్):** ప్రముఖ సైకాలజిస్ట్, మోటివేటర్ గంపా నాగేశ్వర్ రావు గారిచే ఇంపాక్ట్ సదస్సులో ఉత్తమ ట్రైనర్ అవార్డు గ్రహిత వ్యక్తిత్వ వికాస నిపుణులు సుధీర్ వి అర్ డి గారిచే భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పర్సనాలిటీ డెవలప్మెంట్, నైతిక విలువలపై విదార్థులకు చక్కని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణులు సుదీర్, ప్రధానోపాధ్యాయురాలు ఉమ్మెంతల వెంకటరమణి, తాజా మాజీ చైర్మన్ జక్కుల రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు బొల్లె చిన్నయ్య, మహేష్, సురేష్, వేణు, సంజీవ్, హుస్సేన్, రాజగోపాల్, శంకరయ్య, కమరుద్దీన్, పుష్పలత, శైలజ, సరోజిని మరియు విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

# జీతాల కోసం వెయిట్ లెస్ బ్రిక్స్.. ఎదుట టెంట్ వేసిన ఉద్యోగస్తులు..

## జీతాలు చెల్లించటం లేదంటూ...పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు..





**ఖమ్మం ఉమ్మడి జిల్లా, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** గత నాలుగు నెలలుగా తమకు జీతాలు చెల్లించడం లేదని జీతాలు అడిగితే.. సాకులు చెబుతూ..కాలం వెల్లబుచ్చుతున్నారని వెంటనే జీతాలు చెల్లించాలంటూ రైన్ కేర్ ఇండస్ట్రియల్ లిమిటెడ్ కంపెనీ ఎదుట టెంట్ వేసి సోమవారంనిరసన వ్యక్తం చేశారు దాదాపు నాలుగు లక్షలకు పైగా వేతనం రావాల్సి ఉందని సంబంధం లేని సమాధానాలు చెబుతూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని కంపెనీలో పని చేసేవారు పేర్కొన్నారు చాలా రోజుల నుంచి ఎదురు చూసి వారు చెప్పే సమాధానాలను నమ్మి ఇప్పటివరకు జీతాలు కోసం ఎదురుచూసామని రేపు మాపు ఇస్తామంటూ చెబుతున్నారే తప్ప జీతాలు ఇవ్వటం లేదని. గత్యంతరం లేక టెంట్ వేసి జీతాల కోసం పోరాడుతున్నామని కంపెనీ జీతాల మీద ఆధారపడి కుటుంబ అవసరాలకు అప్పులు చేసి కుటుంబ పోషణ కడుపుకున్నామని జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు కంపెనీలో పని చేసే ఉద్యోగులు కంపెనీ యాజమాన్యంపై దాదాపు 35 మంది కి జీతాలు ఇప్పించగలరని కొనిజర్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు..

# ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు..

## - రకరకాల వేషధారణలతో ఆకట్టుకున్న విద్యార్థులు



**జగిత్యాల, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్లేట్ హైస్కూల్లో సోమవారం రోజు ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థినిలు రకరకాల పూలతో బతుకమ్మను అలంకరించి వివిధ వేషధారణలతో ఆటపాటలతో అంగరంగ వైభవంగా ముందస్తు బతుకమ్మ పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపల్ స్వప్న మాట్లాడుతూ బతుకమ్మ' పండుగను తెలంగాణా రాష్ట్రంలో ఆశ్వయుజమాస శుద్ధ పాడ్యమి నుండి తొమ్మిది రోజుల పాటు ఆడబిడ్డలు పెద్ద ఎత్తున ఎంతో ఆప్యాయతతో జరుపుకుంటారు. ఈ బతుకమ్మ (గౌరి) పండుగ లేదా సద్దుల పండుగ దసరాకి రెండు రోజుల ముందు వస్తుంది.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత బతుకమ్మను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ స్వప్న తల్లిదండ్రులకు పోషకులకు ఉపాధ్యాయులకు విద్యార్థిని విద్యార్థులకు ముందస్తు బతుకమ్మ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్జగన్మోహన్రెడ్డి, డైరెక్టర్లు తిరుపతిరెడ్డి,రాజ్యలక్ష్మి,ఇంచార్జ్ మల్లికార్జున్ మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# కాశ్మీర్‌లో నేడు తుదివిడత పోలాంగ్

**న్యూఢిల్లీ,(ది క్రైమ్ న్యూస్):** జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల మూడోవిడత పోలింగ్ మంగళవారం జరుగనుంది. ఈ మేరకు ఇసి అన్ని ఏర్పాట్లు చేసింది. మూడో విడత పోలింగ్ నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ కీలక సూచన చేశారు. ప్రజాస్వామ్య పండుగలో ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అక్టోబర్ 1న తుది విడత పోలింగ్ జరుగనుంది. తొలి రెండు విడతల్లో రికార్డు స్థాయిలో పాల్గొన్న ఓటర్లకు రాజీవ్ కుమార్ అభినందనలు తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 58.58 శాతం పోలింగ్‌తో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ శాతాన్ని పోల్చారు. మొదటి విడతలో 61.38 శాతం, రెండో విడతలో 57.3 శాతం పోలింగ్ నమోదైనట్టు చెప్పారు. ఓటింగ్ శాతం, అభ్యర్థుల సంఖ్య, ప్రచారం గణనీయంగా పెరగడాన్ని తాము గమినించామని, రెండు విడతల్లోనూ ఎన్నికలను బహిష్కరించడం కానీ, రీపోలింగ్ కానీ చోటుచేసుకోలేదన్నారు. ఓటర్ టర్నవుట్ చరిత్రాత్మకమని చెప్పారు. మూడో దఫా పోలింగ్‌లోనూ గరిష్టంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. సెప్టెంబర్ 18, 25 తేదీల్లో మొదటి రెండు విడతల పోలింగ్ జరుగగా, మంగళవారంనాడు 40 నియోజకవర్గాల్లో తుది విడత పోలింగ్ జరుగనుంది. అక్టోబర్ 8న ఎన్నికల ఫలితాలు వెల్లడవుతాయి.

# తిరుమల లడ్డూ వివాదం మరో కీలక మలుపు

## ఏఆర్ డెయిరీ ఎండీ రాజశేఖరన్ ముందస్తు బెయిల్ పిటిషన్

**అమరావతి,(ది క్రైమ్ న్యూస్):** తిరుమల లడ్డూ వివాదం మరో కీలక మలుపు తిరిగింది. శ్రీవారి ప్రసాదం కల్తీ వివాదంలో ముందస్తు బెయిల్ కోరుతూ ఏఆర్ డెయిరీ ఎండీ రాజశేఖరన్ ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న తితిదే ఫిర్యాదుతో ఏఆర్ డెయిరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఆ సంస్థ ఎండీ రాజశేఖరన్ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. వివరణ తీసుకోకుండా కేసు పెట్టడం సహజన్యాయ సూత్రాలకు విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. అరెస్టు సహా ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని కోరారు. బెయిల్ మంజూరులో ఎలాంటి షరతులు విధించినా కట్టుబడి ఉంటానని, కేసు దర్యాప్తునకు సహకరిస్తానని పిటిషన్‌లో తెలిపారు. ఈ పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది. కల్తీ నెయ్యి సరఫరా చేశారని టీటీడీ ఇచ్చిన ఫిర్యాదుతో తిరుపతిలో ఏఆర్ డెయిరీపై కేసు నమోదు అయ్యింది. దీంతో తన అరెస్టుతోపాటు ఎటువంటి తొందరపాటు చర్యలూ తీసుకోవద్దని ఆయన హైకోర్టులో పిటిషన్ వేశారు. నెయ్యి శాంపిల్స్ సేకరణ, దాన్ని విశ్లేషించడంలో అధికారులు ఫుడ్ సెఫ్టీ అండ్ స్టాండెడ్స్ అథారిటీ చట్ట నిబంధనలు అనుసరించలేదని ఎండీ రాజశేఖరన్ పిటిషన్‌లో పేర్కొన్నారు. నేతి కల్తీ ఆరోపణలపై తన నుంచి ఎలాంటి వివరణ తీసుకోకుండానే కేసు పెట్టడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని ఆయన కోర్టుకు తెలిపారు. తనపై చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలూ లేవని, రాజకీయ కారణాలతోనే కేసు పెట్టారని ఏఆర్ డెయిరీ ఎండీ ఆరోపించారు. తనను పోలీసులు అరెస్టు చేస్తే పూడ్చుకోలేని నష్టం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముందస్తు బెయిల్ మంజూరుకు ఎలాంటి షరత్తులు విధించినా కట్టుబడి ఉంటానని ఆయన పేర్కొన్నారు. రాజశేఖరన్ వేసిన పిటిషన్ హైకోర్టులో నేడు విచారణకు వచ్చే అవకాశం ఉంది. గత ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించినట్లు ఎన్‌డీడీబీ నివేదిక స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘోర అపచారం జరిగిన నేపథ్యంలో శ్రీవారి ఆలయంలో శాంతి హోమాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించింది. అలాగే సంప్రోక్షణ కార్యక్రమాన్ని సైతం చేపట్టింది. అందులోభాగంగా ఆనంద నిలయంతో పాటు తిరుమల మాఢవీధుల్లో సైతం సంప్రోక్షణ నిర్వహించింది. మరోవైపు తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారాన్ని ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరపాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. గుంటూరు ఐజీ సర్వ శ్రేష్ఠి త్రిపాఠి నేతృత్వంలో సిట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో శనివారం సిట్ బృందం తిరుమల చేరుకుని.. తన దర్యాప్తును ప్రారంభించింది.

# తిరుమల లడ్డూ కల్తీపై సుప్రీం వ్యాఖ్యలు

## కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలక చెంపపెట్టు

## సిబిఐ విచారణ జరపాల్సిందేనన్న షర్మిల

**విజయవాడ, (ది క్రైమ్ న్యూస్):** తిరుమల లడ్డూ కల్తీపై సుప్రీంకోర్టు చేసిన సూచన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు చెంపపెట్టు లాంటిదని ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల అన్నారు. సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందించారు. కేంద్రం దర్యాప్తు చేయాలని, అఃఐ తో విచారణ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ ముందునుంచే వాదిస్తోందని గుర్తు చేశారు. ఇవ్వాళ సుప్రీం ఇచ్చిన సూచన కాంగ్రెస్ పార్టీ డిమాండ్ కి బలం చేకూరినట్లయ్యిందన్నారు. సిట్ దర్యాప్తు రబ్బర్ స్టాంప్ తప్పా.. విచారణకు ఉపయోగం లేదన్నారు. సీబీఐకి అప్పగిస్తేనే లోతైన దర్యాప్తు జరిగే అవకాశం ఉందన్నారు. సిబిఐకి అప్పగిస్తేనే లడ్డూ కల్తీపై లోతైన దర్యాప్తు జరుగుతుందని.. ఆందోళనలో ఉన్న కోట్లాది మంది భక్తులకు నిజానిజాలు వెల్లడవుతాయని స్పష్టం చేశారు. కల్తీ ఎలా జరిగింది ? ఎక్కడ జరిగింది ? పాల్పడ్డ దొంగలు ఎవరు ? తక్కువ ధరకు కాంట్రాక్టు ఇవ్వడం వెనుక కారణం ఏంటి ? రిపోర్ట్ ను ఎందుకు ఇంతకాలం దాచిపెట్టారు ? మత రాజకీయాలకు ఆజ్యం పోసింది ఎవరు ? ఇలాంటి ఎన్నో సందేహాలకు సమాధానం దొరకాల్సిన అవసరం ఉందని షర్మిల స్పష్టం చేశారు. లడ్డూ కల్తీ నిందితులకు కఠిన శిక్ష పడాల్సిన అవసరం ఉందని.. కూటమి సర్కారును మళ్ళీ డిమాండ్ చేస్తున్నామన్నారు. దెబ్బతిన్న హిందువుల మనోభావాలు మీకు ముఖ్యం అనుకుంటే.. మత రాజకీయాలు మీ అజెండా కాకపోతే లడ్డూ కల్తీపై సుప్రీంకోర్టు సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. లడ్డూ నెయ్యి కల్తీ అంశంపై సుప్రీంకోర్టులో జరిగిన విచారణలో న్యాయమూర్తులు కీలక వ్యాఖ్యలు చేశారు. కల్తీ నెయ్యిని వెనక్కి పంపారని.. లడ్డూలకు ఉపయోగించిన నెయ్యిలో కల్తీ అయిందో లేదో ఆధారాలు చూపించాలన్నారు. లడ్డూలను టెస్టు చేయించారా అనిప్రశ్నించారు. ఈ అంశంపై న్యాయమూర్తులు తీవ్రంగా ప్రశ్నించారు. విచారణకు సిట్ ను నియమించిన తర్వాత ముఖ్యమంత్రి ఎలా మీడియా ప్రకటన చేస్తారని ప్రశ్నించారు. ఈ అంశంలో సిట్ విచారణ చేయాలా.. లేకపోతే కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ చేయించాలా అన్నది గురువారం విచారమలో నిర్ణయించే అవకాశం ఉంది.

# సచివాలయ ఉద్యోగుల సంఘం గుర్తింపు రద్దు

## ప్రభుత్వానికి లేఖ రాయాలని అప్సా నిర్ణయం

**అమరావతి,(ది క్రైమ్ న్యూస్):** సచివాలయ ఉద్యోగుల సంఘం గుర్తింపు రద్దు వ్యవహారంపై మరోమారు ప్రభుత్వానికి లేఖ రాయాలని అప్సా నిర్ణయించింది. అప్సా జనరల్ బాడీ సమావేశం తర్వాత రద్దు నిర్ణయాన్ని పునః పరిశీలించాల్సిందిగా కోరాలని నిర్ణయించారు. సచివాలయ ఉద్యోగుల సంఘం గుర్తింపు రద్దుపై ఇటీవల సాధారణ పరిపాలన శాఖ షోకాజ్ నోటీసు జారీ చేసింది. సీఎస్ నుంచి సీఎం వద్దకు చేరిన సచివాలయ ఉద్యోగుల సంఘం గుర్తింపు రద్దు ÷ల్, అప్సా రద్దు అంశంపై రెండు మూడు రోజుల్లో ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. చివాలయ ఉద్యోగుల సంఘం గుర్తింపు రద్దు కాకుండా చూసేందుకు అప్సా ప్రతినిధులు నానా అవస్థలు పడుతున్నారు. దీనిపై ఇటీవలే సంఘం నేతలు ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. రద్దు నుంచి తప్పించుకోవాలంటే ప్రస్తుతం ఉన్న వాళ్లు రాజీనామా చేయాలనే అంశంపై ఈసీ సమావేశంలో చర్చించారు. అప్సా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి సహా ఒకరిద్దరు రాజీనామా చేయడానికి అంగీకరించారు.ఉపాధ్యక్షులు ఎవరైనా ముందుకు వస్తే అప్సా అధ్యక్ష పదవి నుంచి తప్పుకోడానికి సిద్ధమని వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. కార్యవర్గంలో సభ్యుల రాజీనామాకు వెంకట్రామిరెడ్డి ససేమిరా అంటున్నారు.

# క్రిమినల్ పరువునష్టం కేసు

## ఆప్ నేతలకు సుప్రీంలో ఊరట

**న్యూఢిల్లీ,(ది క్రైమ్ న్యూస్):** క్రిమినల్ పరువునష్టం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు సుప్రీంకోర్టులో సోమవారంనాడు ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి దిగువ కోర్టులో విచారణపై అత్యున్నత న్యాయస్థానం స్టే ఇచ్చింది. ఢిల్లీ ఓటర్ల జాబితా నుంచి పలువురి పేర్లను తొలగించారంటూ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఈ ఇరువురిపై పరువునష్టం కేసు దాఖలైంది. దీనిపై సమాధానం ఇవ్వాల్సిందిగా ఢిల్లీ పోలీసులకు, ఫిర్యాదుదారు, బీజేపీ నేత రాజీవ్ బబ్బర్‌కు జస్టిస్ హృషికేష్ రాయ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టితో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. అనంతరం దిగువ కోర్టు విచారణపై స్టే ఇచ్చింది. అతిషి, కేజ్రీవాల్‌తో పాటు ఆప్ నేతలు సుశీల్ కుమార్ గుప్తా, మనోజ్ కుమార్‌పై బబ్బర్ క్రిమినల్ పరువునష్టం దావా వేశారు. బీజేపీ ఆదేశాలతో వివిధ వర్గాలకు చెందిన 30 లక్షల మంది ఓటర్ల పేర్లను ఢిల్లీ ఓటర్ల జాబితా నుంచి తొలగించారంటూ 2018 డిసెంబర్‌లో జరిగిన మీడియో సమావేశంలో ఆప్ నేతలు ఆరోపించారని, ఇందువల్ల తమ పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగిందని బబ్బర్ కోర్టుకు నివేదించారు. 2019 మార్చిలో కేజ్రీవాల్, ఇతరులకు మెజిస్ట్రేట్ సమన్లు జారీ చేయగా, దీనిపై సెషన్స్ కోర్టును ఆప్ నేతలు ఆశ్రయించారు. అయితే సెన్షన్ కోర్టు వీరి వాదనను తోసిపుచ్చింది. అనంతరం హైకోర్టును ఆప్ నేతలు ఆశ్రయించగా క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కోర్టు సమర్థించింది. దీంతో అతిషి, కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# నిర్మలాసీతారామన్‌కు ఊరట

## ఎన్నికల బాండ్ల కేసుపై హైకోర్టు స్టే

**బెంగళూరు, (ది క్రైమ్ న్యూస్)::** ఎన్నికల బాండ్ల కొనుగోలు చేయాలంటూ బెదిరింపుల కేసులో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు పలువురు బీజేపీ అగ్రనేతలకు సోమవారం కర్ణాటక హైకోర్టు భారీ ఊరట నిచ్చింది. ఈ కేసు విచారణను నిలిపివేస్తూ.. హైకోర్టు సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల బాండ్ల కొనుగోలు చేసేందుకు బెదిరింపులకు పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, పలువురు బీజేపీ అగ్రనేతలతోపాటు ఈడీ ఉన్నతాధికారులపై బెంగళూరులోని తిలక్ నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయాలని ప్రత్యేక కోర్టు ఇటీవల ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తిలక్ నగర్ పీఎస్‌లో వీరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసేందుకు వివిధ సంస్థలను బెదిరించినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, బీజేపీ అగ్రనేతలు, పలువురు ఈడీ ఉన్నతాధికారులపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఆరోపణల నేపథ్యంలో వారిపై జ్ఞానధికార్ సంఘర్ష పరిషత్ సంస్థ సహా అధ్యక్షుడు అదర్ష్ అయ్యార్ తిలక్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ ఫిర్యాదును స్వీకరించేందుకు ఆ స్టేషన్ పరిధిలోని పోలీసులు అభ్యంతరం తెలిపారు. దాంతో గతేడాది ఏప్రిల్‌లో చట్టసభ ప్రతినిధుల కోర్టును ఆయన ఆశ్రయించి.. పిటిషన్ దాఖలు చేశారు. దాంతో ఈ కేసు విచారణ నిలిపి వేసేలా ఆదేశాలు జారీ చేయాలంటూ బీజేపీ కీలక నేతలు కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. దాంతో సోమవారం హైకోర్టు ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. ఎన్నికల బాండ్ల బెదిరింపుల కేసులో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, ఈడీ ఉన్నతాధికారులు, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కర్ణాటక బీజేపీ అగ్రనేతలు నళిని కుమార్ కటీల్, విజయేంద్రలకు వ్యతిరేకంగా పోలీసులకు అదర్ష్ అయ్యార్ ఫిర్యాదు చేసిన విషయం విదితమే.

# బ్లూ ఆధార్ కార్డ్‌లో బయోమెట్రిక్

## వివరాల అప్‌డేట్ కోసం ఎంత చెల్లించాలి?






ఆధార్ సంఖ్య వ్యక్తిగత గుర్తింపు మాత్రమే కాదు, ఎన్నో అవసరాలకు ఉపయోగపడుతుంది. చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో ఆధార్ ప్రధాన వనరుగా పరిగణిస్తారు. దీంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరికీ ఆధార్‌ను తప్పనిసరి. బోర్డింగ్ స్కూల్ నుండి ఆసుపత్రి వరకు, ప్రతిచోటా ఆధార్‌ను ప్రాథమికంగా ఉపయోగపడుతుంది. పెద్దలకే కాకుండా పిల్లలకు కూడా ఆధార్ కార్డు అందుబాటులో ఉంది. దీనిని బ్లూ ఆధార్ కార్డ్ అంటారు. 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు బ్లూ ఆధార్ కార్డ్ తీసుకువచ్చింది కేంద్రం. దీనిని 2018లో ప్రారంభించింది. దీని ప్రకారం, ఈ బ్లూ ఆధార్ కార్డ్ 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు జారీ చేస్తారు. బాల్యంలో ఆధార్ కార్డు జారీ చేసినందున తల్లిదండ్రులు తమ పిల్లల బ్లూ ఆధార్ కార్డును రెండుసార్లు పునరుద్ధరించాలి. ఈ సందర్భంలో బ్లూ ఆధార్ కార్డ్‌లో బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేయడానికి ఎంత చెల్లించాలి? ఎలా అప్‌డేట్ చేయాలో వివరంగా చూద్దాం. బ్లూ ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్: 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు బ్లూ ఆధార్ కార్డులు జారీ చేసిన తర్వాత వారు పెద్దయ్యాక వేలిముద్ర, ఐరిస్‌తో సహా వారి బయోమెట్రిక్ ఆధారాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ కారణంగా, పిల్లలు పెద్దలు కాగానే వారి బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేయడం తప్పనిసరి. దీని ప్రకారం, తల్లిదండ్రులు తమ పిల్లలకు 5 సంవత్సరాలు, 15 సంవత్సరాలు నిండినప్పుడు బ్లూ ఆధార్ కార్డును రెండుసార్లు పునరుద్ధరించాలి. దీని ప్రకారం, తల్లిదండ్రులు తమ పిల్లల ఆధార్ కార్డులను సేవా కేంద్రంలో ఉచితంగా అప్‌డేట్ చేసుకోవచ్చు. దీనికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. 5, 15 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న పిల్లల బ్లూ ఆధార్ కార్డును అప్‌డేట్ చేయకపోతే, రూ.100 రుసుము వసూలు చేస్తారు. బ్లూ ఆధార్ కార్డ్ కోసం ఎలా దరఖాస్తు చేయాలి? తల్లిదండ్రులు తమ 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు బ్లూ ఆధార్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి ఎలాంటి ప్రధాన పత్రాలు అవసరం లేదు. మీరు పిల్లల జనన ధృవీకరణ పత్రం లేదా ఆసుపత్రిలో తల్లిదండ్రులు ఉపయోగించే డిశ్చార్జ్ స్లిప్‌తో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. పిల్లలను పాఠశాలలో చేర్పిస్తే, ఆకార్డు కూడా ఉపయోగించవచ్చు. సంబంధిత పత్రాలతో వెబ్‌సైట్‌కి వెళ్లండి. మై ఆధార్‌పై క్లిక్ చేసి, ఆపై అపాయింట్‌మెంట్ బుకింగ్‌పై క్లిక్ చేయండి. కొత్త ఆధార్‌ని ఎంచుకుని, మీ మొబైల్ నంబర్, క్యాప్చా నమోదు చేయండి. ఆపై పిల్లల వయస్సు, అవసరమైన వివరాలను నమోదు చేయండి. అలాగే సమీపంలోని ఆధార్ సేవా కేంద్రంలో అపాయింట్‌మెంట్ బుక్ చేయండి. మీ పిల్లల కోసం మీరు ఇంకా బ్లూ ఆధార్ కార్డ్‌ని తీసుకోనట్లయితే పైన పేర్కొన్న విధానాలను అనుసరించడం ద్వారా మీరు దరఖాస్తు చేసుకోవచ్చని గమనించడం ముఖ్యం.

# మీరు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తున్నారా? అధిక వడ్డీ అందించే బ్యాంకులు ఇవే..!

ఫిక్స్‌డ్ డిపాజిట్ ఇప్పటికీ భారతీయ కస్టమర్‌లలో వారి డిపాజిట్‌ల సురక్షిత పెట్టుబడి కోసం ఉత్తమ ఎంపికగా పరిగణిస్తున్నారు. మీరు కూడా సమీప భవిష్యత్తులో మీ డిపాజిట్లను ఎఫ్‌డీలో పెట్టుబడి పెట్టడం ద్వారా బంపర్ లాభాలను సంపాదించాలని ఆలోచిస్తున్నట్లయితే, దేశంలోని పెద్ద ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులే కాకుండా, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు కూడా తమ కస్టమర్‌లకు ఎఫ్‌డీపై బంపర్ రిటర్న్‌లను అందిస్తాయి. ఎఫ్‌డీపై తమ కస్టమర్‌లకు 9.60 శాతం వరకు వడ్డీని అందిస్తున్న 10 స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల గురించి తెలుసుకుందాం. గరిష్టంగా 9.60% వడ్డీ సూర్యాదే స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తన సాధారణ కస్టమర్లకు 5 సంవత్సరాల ఎఫ్‌డీలపై 9.10% వడ్డీని, సీనియర్ సిటిజన్ కస్టమర్లకు 9.60% వడ్డీని అందిస్తోంది. యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తన సాధారణ కస్టమర్లకు 1001 రోజుల ఎఫ్‌డీలపై 9% వడ్డీని, సీనియర్ సిటిజన్ కస్టమర్లకు 9.50% వడ్డీని అందిస్తోంది. ఇది కాకుండా ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తన సాధారణ కస్టమర్‌లకు 1000 రోజుల ఎఫ్‌డీలపై 8.51% వడ్డీని, సీనియర్ సిటిజన్ కస్టమర్‌లకు 9.11% వడ్డీని అందిస్తోంది. ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తన సాధారణ కస్టమర్లకు 888 రోజుల ఎఫ్‌డీలపై 8.50% వడ్డీ, సీనియర్ సిటిజన్ కస్టమర్లకు 9% వడ్డీని అందిస్తోంది. మరోవైపు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తన సాధారణ వినియోగదారులకు 2 సంవత్సరాల నుండి 3 సంవత్సరాల కంటే తక్కువ ఎఫ్‌డీలపై 8.50% వడ్డీని అందిస్తోంది. అయితే ఇది సీనియర్ సిటిజన్ కస్టమర్లకు 9% వడ్డీని అందిస్తోంది. ఇక్కడ గరిష్టంగా 9% వడ్డీ మరోవైపు, జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తన సాధారణ కస్టమర్లకు 500 రోజుల ఎఫ్‌డీలపై 8.50% వడ్డీని, సీనియర్ సిటిజన్ కస్టమర్లకు 9% వడ్డీని అందిస్తోంది. ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తన సాధారణ కస్టమర్లకు 1000 రోజుల నుండి 1500 రోజుల ఎఫ్‌డీలపై 8.25% వడ్డీని, సీనియర్ సిటిజన్ కస్టమర్లకు 8.85% వడ్డీని అందిస్తోంది. ఇది కాకుండా ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తన సాధారణ కస్టమర్లకు 560 రోజుల ఎఫ్‌డీలపై




8.25% వడ్డీని, సీనియర్ సిటిజన్ కస్టమర్లకు 8.85% వడ్డీని అందిస్తోంది. శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తన సాధారణ కస్టమర్లకు 24 నెలల నుండి 36 నెలల ఎఫ్‌డీలపై 8.15% వడ్డీని, సీనియర్ సిటిజన్ కస్టమర్లకు 8.65% వడ్డీని అందిస్తోంది. అదే సమయంలో, స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తన సాధారణ వినియోగదారులకు 24 నెలల 1 రోజు నుండి 36 నెలల ఎఫ్‌డీలపై 7.75 శాతం వడ్డీని ఇస్తోంది. అలాగే తన సీనియర్ సిటిజన్ కస్టమర్లకు 8.25 శాతం వడ్డీని ఇస్తోంది.

# ఎట్టకేలకు అమల్లోకి ఆ నిబంధన.. ఆ పని చేస్తే కొత్త కారు కొనుగోలుపై రూ.25 వేల డిస్కౌంట్



కొత్త కారు కొనుగోలు అనేది ప్రతి ఒక్కరి కల. అయితే ఇప్పటికే కారు ఉన్న వారు సూపర్ ఫీచర్స్‌తో మరో కారు కొనుగోలు చేయాలని భావిస్తూ ఉంటారు. అయితే కారు మోడల్ మరీ పాతదైతే కనీస ధర కూడా రాదు. ఈ నేపథ్యంలో సంవత్సరాల తరబడి చర్చల తర్వాత, కేంద్ర ప్రభుత్వం, ఆటోమొబైల్ పరిశ్రమ స్క్రాపింగ్ సర్టిఫికేట్‌తో కొత్త కారును కొనుగోలు చేసే వినియోగదారులకు తగ్గింపులను అందించడానికి నిబంధనలు అమల్లోకి వచ్చాయి. పండుగ సీజన్‌కు ముందు కారు కొనాలనుకునే వినియోగదారులకు ఇది పెద్ద ఉపశమనం కలిగించే వార్త అని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పాత కారుపై ఎంత తగ్గింపు వస్తుంది? నిబంధనలు ఏంటి? అనే అంశాల గురించి వివరాలను తెలుసుకుందాం. స్క్రాపేజ్ పథకం ఫ్లీట్ ఆధునికీకరణ పథకంలో భాగంగా కస్టమర్‌లు వారి పాత వాహనాలకు స్క్రాపేజ్ సర్టిఫికేట్‌ను సమర్పించినప్పుడు కొత్త వాహన కొనుగోళ్లపై తగ్గింపులను అందించాలి. ముఖ్యంగా పాత, తక్కువ సామర్థ్యం ఉన్న వాహనాల స్క్రాపింగ్‌ను ప్రోత్సహించడంతో పాటు కాలుష్యాన్ని తగ్గించడం, రహదారి భద్రతను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ పథకాన్ని తీసుకొచ్చారు. మారుతీ సుజుకి, టాటా మోటార్స్, హ్యుందాయ్, కియా, టొయోటా, ఇతర ప్యాసింజర్ వాహన తయారీదారులు స్క్రాప్ చేసిన వాహనాలపై కొత్త కార్ కొనుగోళ్లపై 1.5 శాతం తగ్గింపు లేదా రూ. 20,000 ఏది తక్కువైతే అది అందించాలి. మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఒక అడుగు ముందుకు వేసి ప్రస్తుతం ఉన్న ఆఫర్‌లకు మించి రూ. 25,000 ఫ్లాట్ తగ్గింపును అందిస్తోంది. టాటా మోటార్స్, వోల్వో ఐషర్ కమర్షియల్ వెహికల్స్, అశోక్ లేలాండ్, మహీంద్రా మహీంద్రా, ఫోర్స్ మోటార్స్, ఇసుజు మోటార్స్, ఎస్ఎంఎల్ ఇసుజుతో సహా వాణిజ్య వాహన తయారీదారులు స్క్రాప్ చేసిన వాణిజ్య కార్గో వాహనాలకు ఎక్స్-షోరూమ్ ధరలో 3 శాతానికి సమానమైన డిస్కౌంట్లను అందించాలి. 3.5 టన్నులు. 3.5 టన్నుల లోపు వాహనాలకు 1.5 శాతం రాయితీ అందిస్తారు. అదనంగా భారీ, తేలికైన వాణిజ్య వాహనాలను స్క్రాప్ చేయడానికి డిపాజిట్‌కు సంబంధించిన ట్రేడెడ్ సర్టిఫికేట్‌ను ఉపయోగించే కొనుగోలుదారులకు వరుసగా 2.75శాతం, 1.25శాతం తగ్గింపులు అందుబాటులో ఉన్నాయి. అయితే ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా స్వచ్ఛందంగా వాహనాలను స్క్రాపింగ్ చేయడం ఆచరణకు నోచుకోవడం లేదు. 2025 మార్చి నాటికి 90,000 పాత ప్రభుత్వ వాహనాలను స్క్రాప్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీని కోసం 60రిజిస్టర్డ్ వెహికల్ స్క్రాపింగ్ సెంటర్లు, 75 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

# క్యాప్సికం సాగుతో లక్షల్లో లాభం.. అద్భుతమైన బిజినెస్ ఐడియా


సాధారణంగా క్యాప్సికం ధర మార్కెట్‌లో ఇతర కూరగాయల కంటే మెరుగ్గా ఉంటుంది. ఈ పంట సాగు ద్వారా రైతులు భాగానే సంపాదిస్తున్నారు. సాధారణ కూరగాయల్లాగే దీన్ని కూడా అన్ని రకాల వాతావరణాల్లో పండించవచ్చు. సత్ఫలితాలు రావడంతో రైతులకు మంచి ఆదాయం వస్తుంది. క్యాప్సికమ్‌ను బెల్ పెప్పర్ అని కూడా అంటారు. క్యాప్సికమ్‌లో విటమిన్ సి, విటమిన్ ఎ కూడా లభిస్తాయి. అంతే కాకుండా ఐరన్, పొటాషియం, జింక్, క్యాల్షియం తదితర పోషకాలు కూడా మార్కెట్‌లో క్యాప్సికమ్‌కు డిమాండ్ పెరుగుతోంది. ఇందులో రంగు క్యాప్సికమ్‌కు అత్యధిక డిమాండ్ ఉంది. భారతదేశంలో క్యాప్సికం దాదాపు 4780 హెక్టార్లలో సాగు అవుతోందని గణాంకాలు చెబుతున్నాయి. దీని వార్షిక ఉత్పత్తి 42230 టన్నులు. భారతదేశంలో క్యాప్సికమ్ పండించే ప్రధాన రాష్ట్రాలు హర్యానా, పంజాబ్, మధ్యప్రదేశ్, జార?ండ్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక మొదలైవి ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లో క్యాప్సికమ్‌ను పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు రైతులు. దీనికి అత్యధిక డిమాండ్ హొటళ్లలో ఉంది. ఇక్కడ దీనిని సలాడ్‌గా కూడా ఉపయోగిస్తారు. క్యాప్సికమ్ సాగు ఇతర మిరపకాయల మాదిరిగానే క్యాప్సికం సాగును ఏ సీజన్‌లోనైనా ప్రారంభించవచ్చు. ఇది కొద్దిగా వర్షం నుండి రక్షించుకోవచ్చు. రైతులు కుండీలలో లేదా పొలంలో సాగు చేసుకోవచ్చు. మీరు కుండీలలో క్యాప్సికమ్ సాగు చేయాలనుకుంటే ఒక కుండలో 10 కిలోల మట్టిని నింపండి. కుండలో సుమారు మూడింట ఒక వంతు కంపోస్ట్ నింపండి. దీని తరువాత కుండలో క్యాప్సికమ్ మొక్కను నాటండి. ఈ టెక్నిక్‌తో క్యాప్సికమ్‌ను చాలా సులువుగా నాటడంతోపాటు భారీ ఆదాయాన్ని పొందవచ్చు. క్యాప్సికమ్ సాగు కోసం నేల విలువ 6 ఉండాలి. క్యాప్సికమ్ మొక్క 40 డిగ్రీలవరకుఉష్ణోగ్రతనుతట్టుకోగలదు.నాటిన75రోజులతర్వాతమొక్కదిగుబడి ప్రారంభమవుతుంది. ఒక హెక్టారులో దాదాపు 300 క్వింటాళ్ల క్యాప్సికం ఉత్పత్తి అవుతుంది. క్యాప్సికమ్ నుండి సంపాదన ప్రస్తుతం మార్కెట్‌లోకి రంగుల క్యాప్సికం కూడా వస్తోంది. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, తెలుపు క్యాప్సికమ్‌కు డిమాండ్ పెరిగింది. ఒక మొక్క మంచి 10 నుండి 15 పండ్లను ఉత్పత్తి చేస్తుంది. ఎకరానికి 200 నుంచి 250 క్వింటాళ్ల క్యాప్సికం ఉత్పత్తి అవుతుంది. దీని ద్వారా మీరుసులభంగాలక్షలరూపాయలు సంపాదించవచ్చని నిపుణులు చెబుతున్నారు. అలాగే మీరు పండించే సమయంలో మార్కెట్ రేటు ఎలా ఉంటుందనే దానిపై ఆధారపడి మీకు లాభం వస్తుంది.



# వ్యాపారం

## పదేళ్ల 'స్విగ్గీ' మనోళ్లదేనని తెలుసా..? తొలిరోజు ఎన్ని ఆర్డర్స్ వచ్చాయంటే.. ఆసక్తికర విషయాలు







అరచేతిలో ప్రపంచం.. ఇంట్లో కూర్చునే అన్నింటిని ఆపరేట్ చేయొచ్చు.. వంట చేయకుండానే నచ్చిన రెస్టారంట్ల నుంచి ఇష్టమైన ఆహారాన్ని తెప్పించుకుని ఆస్వాదించవచ్చు.. ఇలా ప్రస్తుతకాలంలో చాలా మంది బయట దొరికే రుచికరమైన ఫుడ్ ను ఎంజాయ్ చేస్తున్నారు.. బిజీలైఫ్, పని ఒత్తిడి, సమయం లేకపోవడం వల్ల చాలా మంది వంట చేయకుండా ఫుడ్ డెలివరీ యాప్స్ స్విగ్గీ, జొమాటో లపై ఆధారపడుతున్నాయి.. ఈ యాప్స్ కూడా అదేవిధంగా ప్రజలకు సౌకర్యవంతంగా సేవలు అందిస్తున్నాయి. అందరికీ చేరువ అవుతూ.. ఎండనకా.. వాననకా.. పగలు రాత్రి అనే తేడా లేకుండా రుచికరమైన ఫుడ్ ను ఎప్పటికప్పుడు అందిస్తున్నాయి. అయితే.. ఫుడ్ డెలివరీ ప్రయాణంలో.. స్విగ్గీ సంస్థ పదేళ్లు పూర్తి చేసుకుంది. దశాబ్దం నాటి తీపి గుర్తులను పంచుకుంటూ ఆ సంస్థ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ శ్రీహర్ష మాజేటి సోషల్ మీడియాలో ఒక పోస్టు షేర్ చేశారు. ఈ సందర్భంగా తమ సంస్థ ఫస్ట్ డే ఆర్డర్ల గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. 2014లో ఆగస్టు 6న తాము స్విగ్గీని ప్రారంభించామని .. ఫుడ్ ఆర్డర్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసినట్లు తెలిపారు. కానీ, మొదటిరోజు తమకు ఒక్క ఆర్డరూ కూడా రాలేదన్నారు. మరుసటి రోజు తొలి ఆర్డర్ అందుకున్నట్లు తెలిపారు. అదే తమ జర్నీలో అసలైన ప్రారంభానికి గుర్తు అని.. తమ తొలి భాగస్వాముల్లో ఒకటైన ట్రఫుల్స్ రెస్టారంట్ నుంచి ఆహారం కోసం తమకు రెండు ఆర్డర్లు వచ్చినట్లు తెలిపారు. అప్పటి నుంచి వారితో తమ భాగస్వామ్యం బలపడిందన్నారు. ఒక దశలో ఒక్క రోజులో 7261 ఆర్డర్లు కూడా అందుకున్నట్లు శ్రీహర్ష వెల్లడించారు. శ్రీహర్ష పోస్ట్.. ఈ సందర్భంగా స్విగ్గీ సంస్థ ఎదుగుదల గురించి కూడా వెల్లడించారు. ఫుడ్ డెలివరీ కాన్సెప్ట్ అప్పుడప్పుడే అందరికీ చేరువవుతోన్న తరుణంలో తమపై విశ్వాసం ఉంచిన రెస్టారంట్లకు శ్రీహర్ష కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం 3లక్షల రెస్టారంట్లతో కలిసి పనిచేస్తున్నామని.. ఇది తమకెంతో గర్వకారణమని తెలిపారు. ఆ మద్దతే ప్రతి ఇంట్లో తమ పేరు వినిపించేందుకు కారణమైందని పేర్కొన్నారు. కాగా.. కర్ణాటక రాజధాని బెంగళూరు కేంద్రంగా 2014లో స్విగ్గీ ప్రారంభమైంది. శ్రీహర్ష మాజేటి, నందన్ రెడ్డి, రాహుల్ భాగస్వామ్యంలో స్విగ్గీ సంస్థను ప్రారంభించారు. దాదాపు 600 నగరాలకు దీని కార్యకలాపాలు విస్తరించాయి. అంతేకాకుండా నిత్యావసరాలను వేగవంతంగా సరఫరా చేసే సేవల విభాగం ఇన్‌స్టామార్ట్ లో కూడా స్విగ్గీ భాగస్వామ్యంగా ఉంది.

## ఎఫ్‌డీల్లో పెట్టుబడితో రాబడి వరద.. ఏయే బ్యాంకులు ఎంత వడ్డీ ఇస్తున్నాయంటే..?



భారతదేశంలో పెట్టుబడిపై స్థిరమైన ఆదాయాన్ని ఇచ్చే పథకాల్లో పెట్టుబడికి ఆసక్తి చూపుతున్నారు. ఇలాంటి వారికి ఫిక్స్‌డ్ డిపాజిట్లు మొదటి ఎంపికగా ఉంటున్నాయి. తక్కువ-రిస్క్ ఆప్షన్లను ఇష్టపడే వారికి ఫిక్స్ డిపాజిట్లు ప్రముఖ పెట్టుబడి ఎంపికగా మారాయి. అయితే భారతదేశంలో ఇబ్బడిముబ్బడిగా బ్యాంకులు ఉండడంతో ఏయే బ్యాంకులు ఎంత వడ్డీ అందిస్తున్నాయో? తెలుసుకోవడం కష్టంగా ఉంది. ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా బ్యాంకులు ఎఫ్‌డీలను ప్రోత్సహించాలాని కోరిన విషయం విధితమే ఈ నేపథ్యంలో ఎఫ్‌డీల్లో పెట్టుబడితో ఏయే బ్యాంకులు అధిక వడ్డీను ఆఫర్ చేస్తున్నాయో? ఓసారి తెలుసుకుందాం. ఒక సంవత్సరం కాలవ్యవధి ఒక సంవత్సరం ఎఫ్‌డీ కోసం ఇండస్ ఇండ్ బ్యాంక్ అత్యధిక వడ్డీ రేటును 7.75 శాతం అందిస్తుంది. అంటే మీ రూ. 10,000 పెట్టుబడి రూ.10,798కి పెరుగుతుంది. ఆర్‌బీఎల్ బ్యాంక్ 7.5 శాతం రేటుతో మీ డబ్బును రూ. 10,771కి పెంచుతోంది. బంధన్ బ్యాంక్, యస్ బ్యాంక్ రెండూ 7.25 శాతం రేటును అందిస్తాయి. ఫలితంగా రూ. 10,745 మెచ్యూరిటీ సొమ్మును పొందవచ్చు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ 7.1 శాతం రేటును అందిస్తాయి. అంటే దాదాపు మొత్తం రూ. 10,729 పొందవచ్చు. రెండు సంవత్సరాల కాలవ్యవధి మీరు రెండు సంవత్సరాల ఎఫ్‌డీను ఎంచుకుంటే ఆర్‌బీఎల్ బ్యాంక్ 8 శాతం వడ్డీ రేటుతో రూ.10,000 డిపాజిట్‌పై రూ.11,717 మెచ్యూరిటీ సొమ్ముగా అందిస్తుంది. ఇండస్ ఇండ్ బ్యాంక్ 7.75 శాతం ఆఫర్ చేయడంతో రూ. 11,659, డీసీబీ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, రెండూ 7.5 శాతం ఆఫర్ చేసి మీ పెట్టుబడిని రూ. 11,602కి పెంచుతాయి. ఐసీఐసీఐ బ్యాంక్ 7.25 శాతం ఆఫర్ చేయడం వల్ల మెచ్యూరిటీ మొత్తం రూ.11,545కి చేరుకుంది. మూడు సంవత్సరాల కాలవ్యవధి మూడు సంవత్సరాల ఎఫ్‌డీలపై డీసీబీ బ్యాంక్ అత్యధికంగా 7.55 శాతం రేటును అందిస్తుంది. అంటే రూ. 10,000 పెట్టుబడి మెచ్యూరిటీతో రూ. 12,516 అవుతుంది. ఆర్‌బీఎల్ బ్యాంక్ 7.5 శాతం అందించడం వల్ల ఇది మీ పెట్టుబడి రూ.12,497కు పెరుగుతుంది. యస్ బ్యాంక్, ఐడీఎఫ్ ఫస్ట్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఒక్కొక్కటి 7.25 శాతం ఆఫర్ చేస్తున్నాయి. ఐదు సంవత్సరాల కాలవ్యవధి ఐదు సంవత్సరాల ఎఫ్‌డీ విషయానికి వస్తే డీసీబీ బ్యాంక్ 7.4 శాతం అందిస్తుంది. అందువల్ల రూ. 10,000 పెట్టుబడి పెడితే మెచ్యూరిటీ సొమ్ము రూ. 14,428కి పెరుగుతుంది. ధనలక్ష్మి బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, యస్ బ్యాంక్ ఒక్కొక్కటి 7.25 శాతం ఆఫర్ చేస్తున్నాయి. అందవుల్ల మీ పెట్టుబడి రూ.14,323కి పెరుగుతుంది.

# వయసు సెంచరీ కొట్టాలంటే..





ఏజ్ యాభైదాటాక కొన్ని ఆరోగ్య సూత్రాలు తప్పనిసరిగా పాటించాలి. యంగ్ ఏజ్‌లో ఉన్నప్పుడు అలవాటైన ఆహార నియమాలే కొనసాగిస్తానంటే.. అరవైలోనే ఆస్పత్రిపాలు కావాల్సి వస్తుంది. డెబ్బయ్ దాటకుండానే రనౌట్ అయ్యే ప్రమాదమూ ఉంది. యాభై ఏండ్లు దాటాక జీర్ణశక్తి కాస్త మందగిస్తుంది. శరీర పోషక అవసరాలూ మారుతుంటాయి. మలివయసులో ఆరోగ్యంగా ఉండాలంటే.. కొన్ని రకాల ఆహార పదార్థాలను దూరంగా ఉంచడం ఎంతైనా మంచిది. అవేంటంటే.. వేపుళ్లు వద్దు: వయసులో హాఫ్ సెంచరీ కొట్టాక.. రోజువారీ ఆహారంలో వేపుళ్ల కోసం వేయించుకు తినడం మానేయాల్సిందే! పండుగకో పబ్బానికో రుచి చూడొచ్చు కానీ, ప్రతిరోజూ కరకరలాడే వేపుళ్లు తింటే ప్రమాదమే! వాటిలో ఉండే నూనె శరీరానికి మంచిది కాదు. పైగా పొట్టలో కొలెస్ట్రాల్ కూడా పేరుకుపోతుంది. అంతగా తినాలి అనుకుంటే.. ఎయిర్ ఫ్రయిర్‌లో గానీ, ఓవెన్‌లో గానీ తయారుచేసుకుంటే కాస్త మంచిది! చక్కెరకు చెక్: జ్యూస్, గ్రీన్ టీ, బలవర్ధకం.. లాంటి లేబుల్స్ చూసి అవి ఆరోగ్యవంతమైనవి అనుకొని మోసపోతుంటాం. నిజానికి చూడాల్సింది అందులోని చక్కెర శాతం. అవి నడివయసుకు మంచివి కావు. చక్కెరకు చెక్ పెడితే గానీ, కొలెస్ట్రాల్‌కు కామా పడదు! చాపల్యం చాలు: యాభై ఏండ్లు వచ్చే వరకు ఆస్వాదించిన రుచులు చాలు. జిహ్వా చాపల్యాన్ని ఎంత వదులుకుంటే అంత ఆరోగ్యం. రుచుల కోసం ప్యాకేజ్డ్ ఫుడ్‌కు అలవాటుపడితే చేటు తప్పదు. వీటిలో కనిపించకుండా చక్కెర శాతం ఎక్కువగా ఉంటుంది. దీనిని హిడెన్ షుగర్ అంటారు. వీటి బదులు తాజా పండ్లు తినడం మంచిది. మందుకు నో: వయసు పెరుగుతున్న కొద్దీ.. మద్యం వల్ల కలిగే దుష్ఫలితాలూ పెరుగుతాయి. మద్యంతో కాలేయం మీద ఒత్తిడి పెరుగుతుంది. యాభయ్యో పుట్టినరోజు నాడు డ్రింకింగ్ హ్యాబిట్‌కు స్వస్తి పలకండి. ఉప్పు ముప్పు: రోజువారీ ఆహారంలో 2300 మిల్లీగ్రాములకు మించి ఉప్పు ఉండకూడదన్నది నిపుణుల మాట. కానీ, మనం అంతకు ఎన్నో రెట్లు లాగించేస్తుంటాం. నడివయసులో వచ్చే అధిక రక్తపోటు లాంటి సమస్యలను ఉప్పు తీవ్రతరం చేస్తుంది. వీలైనంత వరకు ఉప్పు తగ్గించడం అత్యవసరం అని గుర్తించండి.

## ఈ ఆహారంతో కిడ్నీలు పదిలం

కిడ్నీలను దీర్ఘకాలం ఆరోగ్యంగా ఉంచుకునేందుకు పోషకాలతో నిండిన సమతులాహారం కీలకం. ఆహార నియమాల్లో చిన్నపాటి మార్పులతో కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. సోడియం, పాస్ఫరస్, పొటాషియంతో కూడిన ఆహారం అధికంగా తీసుకోవడం కిడ్నీలపై అదనపు భారం మోపుతుంది. ఇతర కాంప్లికేషన్స్ తలెత్తకుండా ఈ తరహా ఆహారాన్ని తగిన మోతాదు మించకుండా చూసుకోవాలి. అధిక ప్రొటీన్ ఆహారం కూడా కిడ్నీ వ్యాధిగ్రస్తుల్లో మూత్రపిండాలపై పనిభారం పెంచుతుంది. ఆహారంలో తాజా పండ్లు, కూరగాయలు తీసుకుంటే వాటిలో ఉండే పోషకాలు, యాంటీఆక్సిడెంట్ల కిడ్నీ పనితీరుకు ఊతమిస్తాయి. పండ్లు, కూరగాయలతో పాటు తృణధాన్యాలను తీసుకోవడం, బీపీ, శరీర బరువును అదుపులో ఉంచుకోవడంతో కిడ్నీ పనితీరు మెరుగవుతుంది. విటమిన్స్, మినరల్స్‌తో కూడిన ఆహారం కిడ్నీలకు మేలు చేయడంతో పాటు రోజంతా ఉత్సాహంగా, ఉత్తేజంగా ఉండేందుకు ఉపకరిస్తాయి. ఇవి వాపు ప్రక్రియ నివారించి, రోగ నిరోధక వ్యవస్ధను ఉత్తేజితం చేస్తాయి. కిడ్నీ వ్యాధితో బాధపడేవారు పోషకాహారంతో పాటు సమతులాహారం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కిడ్నీల ఆరోగ్యానికి పండ్లలో ముఖ్యంగా జామ, యాపిల్, పియర్, పపాయ, పైనాపిల్ తీసుకోవాలని చెబుతున్నారు. వీటిలో ఉండే యాంటీఆక్సిడెంట్స్ కిడ్నీలు దెబ్బతినకుండా కాపాడతాయి. ఇక ఐరన్, విటమిన్ కే వంటి కిడ్నీ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే పాలకూర, కేల్ వంటి ఆకుకూరలు తీసుకోవాలి. ఫైబర్ అధికంగా ఉండే బ్రౌన్ రైస్, క్వినోవా కిడ్నీ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఫిష్, తోఫు వంటి లీన్ ప్రొటీన్ కిడ్నీ ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు.



## ఈ అద్భుతమైన ఆకుపచ్చపండు రోజూ తింటే.. డాక్టర్‌తో పని లేదు.. మందుల అవసరమే ఉండదట..!

సీజనల్ పండ్లలో అవోకాడో ఒక ప్రసిద్ధ పండు. అవకాడోలో చాలా పోషకాలు ఉన్నాయి. ఇది అధిక కొవ్వు ఆమ్లాలు, విటమిన్లు , ఫైబర్, ఖనిజాలు, ప్రోటీన్లతో సహా అవసరమైన పోషకాలను కలిగి ఉంటుంది. ఇది అనేక వ్యాధుల నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడుతుంది. ఇది రుచికరమైన, పోషకమైన పండు. అవకాడో మన జుట్టు, చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది మధుమేహం, క్యాన్సర్, అజీర్ణం, డయేరియా వంటి వ్యాధుల నుండి ఉపశమనాన్ని అందించడంలో కూడా సహాయపడుతుంది. అవకాడో పండుతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.. ఆర్థ్రైటిస్‌లో మేలు చేస్తుంది: ఆర్థ్రైటిస్‌లో అవకాడో చాలా ప్రభావవంతంగా పని చేస్తుంది. ఇది కీళ్ళు, కణజాలం, కండరాల వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. మోకాళ్ల నొప్పులను తగ్గిస్తుంది. రక్తంలో చక్కెర నియంత్రణ : అవకాడో అధిక కొవ్వు, తక్కువ కార్బోహైడ్రేట్ ఆహారం. తక్కువ కార్బోహైడ్రేట్ కంటెంట్ కారణంగా, ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. అవకాడో అనేది శక్తిని పెంచే ఆహారం. అధిక రక్తపోటు నుండి ఉపశమనం: అవోకాడో ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇది రక్త కణాలను నయం చేయడంలో సహాయపడుతుంది. అధిక రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. క్యాన్సర్‌లో మేలు చేస్తుంది: ప్రోస్టేట్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో అవకాడో చాలా ప్రభావవంతంగా ఉంటుంది. మోనోశాచురేటెడ్ కొవ్వులో కెరోటినాయిడ్లు తగినంత ఉంటాయి.. ఇది క్యాన్సర్‌ను తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది: అవకాడో పండ్లలో ఫ్లేవనాయిడ్స్, సపోనిన్లు, టానిన్లు ఉంటాయి. ఈ సమ్మేళనాల సహాయంతో ఇది ఎసిడిటీ, గ్యాస్ట్రిక్ సమస్యలు, మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. చర్మ సమస్యలను నయం చేయడానికి : యాంటీ ఆక్సిడెంట్ గుణాలు పుష్కలంగా ఉండే అవకాడోస్ తీసుకోవడం వల్ల చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. అవకాడో అనేక చర్మ సంబంధిత సమస్యలను దూరం చేయడంలో మేలు చేస్తుంది.

## శరీరం హైడ్రేటెడ్‌గా ఉండాలంటే వీటిని తప్పక తీసుకోవాలి.. లేదంటే కష్టాలు కొని తెచ్చుకున్నట్లే!



ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజు సరిపడా నీళ్లు తాగాలని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కానీ రోజువారీ పనుల్లోపడి నీటిని సమృద్ధిగా నీళ్లు తాగరు. రోజంతా గడచిన తర్వాత ఎక్కువ నీరు తాగలేదనే విషయం గుర్తుంది. కానీ ఇలా మళ్లీ మళ్లీ జరిగితే, మీరు పెద్ద ఇబ్బందుల్లో పడతారు. అందుకే రోజంతా తగినంత నీరు త్రాగాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వేసవిలో శరీరంలో నీటి శాతాన్ని పెంచడానికి, నీటి శాతం ఎక్కువగా ఉండే కొన్ని రకాల పండ్లు, కూరగాయలను కూడా తినవచ్చు. అవసరమైతే, పండ్ల రసాలు కూడా తాగవచ్చు. ప్రతిరోజూ ఉదయం నిద్రలేచిన తర్వాత 1 గ్లాసు నీరు తాగడం అలవాటు చేసుకోవాలి. రోజులో ప్రతి భోజనానికి కనీసం అరగంట ముందు ఒక గ్లాసు నీరు త్రాగాలి. ఇలా చేస్తే ఆహారం జీర్ణమవడంతోపాటు ఆహారంలోని పోషకాలు సమృద్ధిగా శరీరానికి అందుతాయి. నిమ్మకాయ-పుదీనా లేదా దోసకాయ-తులసి ఆకులతో తయారు చేసిన నీటిని కూడా త్రాగవచ్చు. నీటి రుచి మారడంతో, మళ్లీ మళ్లీ నీరు తాగాలనే విషయం మీరు గుర్తుంచుకుంటారు. మొదట్లో కాస్త కష్టంగా అనిపించినా క్రమంగా అది అలవాటుగా మారుతుంది. ఇది మీ శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడంలో సహాయపడుతుంది. అనేక వ్యాధుల నుంచి తేలిగ్గా బయటపడవచ్చు. శరీరం హైడ్రేట్ గా ఉండాలంటే తాజా పండ్లు తినాలి. ఎండాకాలం వచ్చిందంటే చాలు పుచ్చకాయలు మార్కెట్‌లో అధికంగా దొరుకుతాయి. ప్రతిరోజూ కొన్ని పుచ్చకాయ ముక్కలు తినడానికి ప్రయత్నించాలి. పుచ్చకాలయలోని పోషకాలు శరీరంలో నీటి కొరతను తీరుస్తుంది. పంటినొప్పికి.. ఇంటి చిట్కాలు పంటినొప్పి.. భరించలేని సమస్య. దాని ప్రభావం ముఖం, తలమీద కూడా ఉంటుంది. కారణం ఏదైనా పంటినొప్పికి మనవాళ్లు ఇంటిచిట్కాలకే ప్రాధాన్యం ఇస్తారు.

### బీకేర్‌ఫుల్..! శరీరంలో ఈ ఖనిజం లోపం ఉంటే జుట్టు నెరిసిపోతుందట..

అన్ని పోషకాలు సమృద్ధిగా ఉంటేనే శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. అందుకే.. మనం తీసుకునే ఆహారంలో ఖనిజాలు, విటమిన్లు, పోషకాలు ఉండేలా చూసుకోవాలి.. అలాంటి ముఖ్యమైన ఖనిజాల్లో రాగి ఒకటి.. రాగి ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనది.. కానీ ఇది తక్కువ పరిమాణంలో అవసరం. ఈ పోషకం ఎర్ర రక్త కణాలు, ఎముకలు, బంధన కణజాలం, కొన్ని ముఖ్యమైన ఎంజైమ్‌లను తయారు చేయడానికి ఉపయోగిస్తారు. కాపర్ కొలెస్ట్రాల్ ప్రాసెసింగ్, మీ రోగనిరోధక వ్యవస్థ సరైన పనితీరు, కడుపులో శిశువుల అభివృద్ధికి కూడా కాపర్ అవసరం.. ఆరోగ్య నిపుణుల ప్రకారం.. ఆరోగ్యకరమైన వయోజన వ్యక్తికి ప్రతిరోజూ 900రాగి అవసరం.. ఈ పోషకం లోపం వల్ల అలసట, బలహీనత, తరచుగా అనారోగ్యం, బలహీనమైన, పెళుసుగా ఉండే ఎముకలు, జ్ఞాపకశక్తి కోల్పోవడం, నడవడంలో ఇబ్బంది, చలికి సున్నితత్వం, లేత చర్మం, జుట్టు నెరిసిపోవడం, కంటి చూపు కోల్పోవడం వంటి సమస్యలు వస్తాయి.. అందుకే.. కాపర్ రిచ్ ఫుడ్స్ ను తప్పనిసరిగా తీసుకోవాలి.. రాగి సమృద్ధిగా ఉండే పదార్థాలు ఏంటో ఇప్పుడు తెలుసుకోండి.. కాపర్ రిచ్ ఫుడ్స్.. నట్స్ ను పోషకాల నిధి అని పిలుస్తారు. వీటిలో ఫైబర్, ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఇందులో రాగి కూడా సమృద్ధిగా లభిస్తుంది. బాదం, వేరుశెనగ లాంటి వాటని తింటే ఈ పోషకానికి లోటు ఉండదు రొయ్యలు సముద్రపు అడుగుభాగంలో ఎక్కువగా ఉంటాయి. ఇంకా పలు ప్రాంతాల్లో వీటిని పెంచుతారు. రొయ్యల మాంసంలో తక్కువ కొవ్వు ఉంటుంది. అంతేకాకుండా అధిక ప్రోటీన్, సెలీనియం, విటమిన్ 12తో సహా పలు విటమిన్లు, ఖనిజాలతో నిండి ఉంటుంది. అంతేకాకుండా, ఇందులో రాగి కూడా పుష్కలంగా ఉంటుంది. డార్క్ చాక్లెట్: డార్క్ చాక్లెట్‌ని ఇష్టపడని వారంటూ ఎవరూ ఉండరు.. ఇందులో కోకో ఘనపదార్థాలు సమృద్ధిగా ఉంటాయి. తక్కువ చక్కెర కంటెంట్ కూడా ఉంటుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్, అనేక పోషకాలు ఉంటాయి. దీన్ని నిత్యం తినడం వల్ల శరీరానికి రాగి పుష్కలంగా అందుతుంది. తృణధాన్యాలు: తృణధాన్యాలు (గింజలు) వంటి వాటిల్లో కూడా పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటిలో రాగి పుష్కలంగా లభిస్తుంది. ఇందులో నువ్వులను రాగి పవర్‌హౌస్ అని కూడా పిలుస్తారు. ఆకు కూరలు: గ్రీన్ లీఫీ వెజిటేబుల్స్ దాదాపు అన్ని మంచివే.. వీటిలో అన్ని రకాల పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఫైబర్, విటమిన్ కె, కాల్షియం, మెగ్నీషియం, ఫోలేట్ ఇందులో ఉంటాయి. బచ్చలికూర, పాలకూర లాంటివి తింటే శరీరంలో రాగి లోపం అనే మాటే ఉండదు.

## పంటినొప్పికి.. ఇంటి చిట్కాలు



పంటినొప్పి.. భరించలేని సమస్య. దాని ప్రభావం ముఖం, తలమీద కూడా ఉంటుంది. కారణం ఏదైనా పంటినొప్పికి మనవాళ్లు ఇంటిచిట్కాలకే ప్రాధాన్యం ఇస్తారు. అలాంటి ప్రభావవంతమైన చిట్కాలు ఓ ఐదు ఉన్నాయి. అయితే, ఇవి వైద్యుడి చికిత్సకు ప్రత్యామ్నాయాలు మాత్రం కాదు. చిట్కాలు ప్రయోగించినా పంటినొప్పి తగ్గలేదంటే వైద్యుణ్ని సంప్రదించడం మానుకోవద్దు. ఉప్పునీళ్లు ఉప్పులో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఉప్పునీళ్లను పుక్కిలించినప్పుడు నోట్లో ఉండే బ్యాక్టీరియా నశించిపోతుంది. నొప్పి, మంట కూడా తగ్గిపోతుంది. దీనికోసం ఓ గ్లాసు గోరువెచ్చటి నీళ్లలో టీస్పూన్ ఉప్పు కలుపుకోవాలి. ఈ ద్రావణాన్ని ఓ ముప్పై సెకండ్లపాటు పుక్కిలించి ఉమ్మేయాలి. ఇలా రోజులో కొన్నిసార్లు చేస్తూ ఉండాలి. ముఖ్యంగా తిన్న తర్వాత, పడుకునే ముందు పుక్కిలించడం మర్చిపోవద్దు. లవంగం నూనె పంటినొప్పి ఉపశమనానికి వందల ఏండ్లుగా లవంగం నూనెను ఉపయోగిస్తున్నారు. ఇందులో కూడా ఎనల్జీసిక్, యాంటీబ్యాక్టీరియల్ గుణాలు ఎక్కువే. లవంగం నూనెలో ఉండే యూజెనాల్ అనే మూలకం పంటినొప్పి నుంచి తాత్కాలిక ఉపశమనాన్ని ఇస్తుంది. పత్తి ఉండను తీసుకుని దాన్ని కొన్నిచుక్కల లవంగం నూనెతో తడపాలి. తర్వాత నొప్పిగా ఉన్న దంతాలు, చిగుళ్ల దగ్గర మర్దన చేయాలి. రోజులో పలుమార్లు ఇలా చేస్తే మంచి ఫలితాలు కనిపిస్తాయి. మంచుముక్కలు ఓ పల్చటి వస్త్రంలో మంచుముక్కలు తీసుకోవాలి. దీంతో నొప్పి ఉన్న దగ్గర్లో బుగ్గపై రుద్దుకోవాలి. ఇలాఓపది పదిహేను నిమిషాలపాటు చేస్తేనొప్పి ఉన్నచోట మొద్దుబారినట్టుగాఉంటుంది.పంటినొప్పిని తప్పించుకోవడానికి ఈ ప్రక్రియను కొన్నిగంటలకోసారి చేస్తూ ఉండాలి. పెప్పర్‌మింట్ టీ దీనిలో పుదీనా ఉంటుంది. దీనికి నోటిని చల్లగా చేస్తూ తిమ్మిరి కలగజేసే గుణాలు ఉంటాయి. పెప్పర్‌మింట్ టీని నోట్లోకి తీసుకోవడం ద్వారా పంటినొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. చల్లటి పెప్పర్‌మింట్ టీని నోట్లో ఓ ముప్పై సెకండ్లపాటు పుక్కిలించి ఉమ్మేయడం మంచిది. పెప్పర్‌మింట్ టీ బ్యాగ్‌ను నొప్పి ఉన్నచోట ఉంచినా ఇదే ఫలితం ఉంటుంది. ఇలా వీలైనన్ని సార్లు చేయాలి. వెల్లుల్లి వెల్లుల్లిలో యాంటీమైక్రోబియల్, యాంటీఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. దీనిలో ఉండే అలిసిన్ చెడు బ్యాక్టీరియాకు వ్యతిరేకంగా పోరాడుతుంది. ఓ వెల్లుల్లి రేకును మెదుపుకోవాలి. దీన్ని నేరుగా చిగుళ్లు, పంటిపై ఉంచాలి. వెల్లుల్లి రేకును, పేస్టును చప్పరించినా మంచి ఫలితాలే ఉంటాయి.

### పంచామృతం అంటే ఏంటి..? ఎలా తయారు చేసుకోవాలి..

## ఆరోగ్యానికిది అమృతంతో సమానం..!



దేవుడికి పంచామృతాలతో అభిషేకం చేస్తారు. భారతీయ సంప్రదాయం ప్రకారం, పంచామృతం అనేది పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార లేదా బెల్లం మిశ్రమం. ఇవి ఐదు పవిత్ర పదార్థాలు హిందూ మతంలో ఆరాధన, భక్తిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. పంచామృతం హోమం హవన్, పూజ సమయంలో అనేక మతపరమైన ఆచారాలలో ఉపయోగిస్తుంటారు. ఈ ఐదు పదార్థాలను ఉపయోగించడం ద్వారా, దేవునికి అంకితమైన పవిత్రమైన, స్వచ్ఛమైన నైవేద్యం సిద్ధమవుతుంది. ఇది శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని సమతుల్యం చేయడానికి దోహదం చేస్తుంది. ఆవు పాలు, ఆవు పెరుగు, ఆవు నెయ్యి, తేనె, పండ్ల నుంచి వచ్చే రసం గానీ, కొబ్బరి నీళ్లు గానీ కలిపితే పంచామృతం అవుతుంది. ఐదు పవిత్ర పదార్థాలతో తయారు చేసే ఈ పదార్థం.. దేవుడికి అభిషేకం చేయడానికి, పూజలో ఉపయోగిస్తారు. పంచామృతాన్ని ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటి? పూజలో పంచామృతాన్ని ఎందుకు ఉపయోగిస్తారు..? ఇక్కడ తెలుసుకుందాం.. పంచామృతం ప్రయోజనాలు: 1. పాలు: పాలు స్వచ్ఛత, పోషణకు చిహ్నంగా పరిగణించబడతాయి. 2. పెరుగు: పెరుగు ఆరోగ్యం, శ్రేయస్సుకు చిహ్నంగా పరిగణించబడుతుంది. 3. నెయ్యి: నెయ్యి జ్ఞానం, కాంతికి చిహ్నంగా పరిగణించబడుతుంది. 4. తేనె: తేనె మాధుర్యం, జీవితానికి చిహ్నంగా పరిగణించబడుతుంది. 5. గంగాజలం: గంగాజలం స్వచ్ఛతకు చిహ్నంగా పరిగణించబడుతుంది. పంచామృతం ఆచార ప్రయోజనాలు: పంచామృతం దేవతలను అభిషేకించడానికి ఉపయోగిస్తారు. దేవతలకు పంచామృతాలతో అభిషేకం చేయడం వల్ల దేవతలు త్వరగా ప్రసన్నమవుతారని, భక్తుల కోర్కెలు నెరవేరుతాయని విశ్వాసం. పూజలో కూడా పంచామృతాన్ని ఉపయోగిస్తారు. పంచామృతాలతో దేవుడిని పూజించడం ద్వారా పూజా ఫలాలు రెట్టింపు అవుతాయని విశ్వాసం. ఆధ్యాత్మిక ప్రయోజనాలు: పంచామృతం మనస్సును శాంతపరచడంలో, ఏకాగ్రతను పెంచడంలో సహాయకరంగా పరిగణించబడుతుంది. పంచామృతం ప్రతికూల శక్తిని వదిలించుకోవడానికి, సానుకూల శక్తిని ఆకర్షించడంలో సహాయపడుతుందని విశ్వసిస్తారు.


### పరగడుపున టమాటాలు తింటే ఇలా అవుతుందా..? ఖచ్చితంగా తెలుసుకోవాల్సిన విషయం ఇది..!


ఇంట్లో కూరగాయలు, పప్పు రుచిని పెంచడానికి ఉపయోగించే టమాటాలు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. టమాటాలను తరచుగా కూరలు, సలాడ్‌లు, సూప్‌లు, చట్నీలలో ఉపయోగిస్తారు. టమాటాలు చర్మ ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా పనిచేస్తాయి. టమాటాలను అందం కోసం కూడా చాలా హోం రెమెడీస్ లో ఉపయోగిస్తుంటారు. అంతే కాదు, టమాటాలను అనేక సౌందర్య ఉత్పత్తులలో కూడా ఉపయోగిస్తారు. టమాటాలో విటమిన్ సి, లైకోపీన్, విటమిన్ కె, పొటాషియం పుష్కలంగా ఉన్నాయి. దీన్ని తినడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. టమాటా బరువు తగ్గడానికి కూడా సహాయపడుతుంది . టమోటాలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకుందాం. టమాటా తినడం వల్ల కలిగే ప్రయోజనాలు.. 1- బాగా పండిన టమాటాలను ఉదయం పూట నీళ్లు తాగకుండా ఖాళీ కడుపుతో తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. 2- రికెట్స్‌తో బాధపడుతున్న పిల్లలకు రోజూ ఒక గ్లాసు టమాటా రసం ఇవ్వాలి. దీంతో వారికి ఎంతో మేలు జరుగుతుంది. 3- టమాటా తినడం వల్ల పిల్లల శారీరక, మానసిక అభివృద్ధి మెరుగుపడుతుంది. 4- బరువు తగ్గడానికి, మీరు టమాటాలు తినండి. మీరు టమాటాను సలాడ్‌లో కూడా చేర్చుకుని తినవచ్చు. లేదా 1-2 గ్లాసుల టమాటా రసం చేసుకుని కూడా తాగొచ్చు. 5- ఆర్థ్రైటిస్‌తో బాధపడేవారు టమాటా తినాలి. టమాటా జ్యూస్‌లో సెలెరీని కలిపి తాగడం సహాయపడుతుంది. 6- గర్భిణీలకు కూడా టమాటా మేలు చేస్తుంది. దీని కారణంగా శరీరానికి విటమిన్ సి లభిస్తుంది. గర్భధారణ సమయంలో శరీరానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. 7- కడుపులో నులిపురుగుల సమస్య ఉంటే ఖాళీ కడుపుతో టమాటా ఎండుమిర్చి కలిపి తింటే మంచిది. 8- రోజూ పచ్చి టమాటాలు తింటే ముఖం మెరుస్తుంది. 9- టమాటా తినడమే కాకుండా ముఖానికి రాసుకుంటే ముఖం కాంతివంతంగా మారుతుంది. ఇందుకోసం టమాటా గుజ్జును ముఖానికి రాసుకుంటే మెరుపు వస్తుంది. 10- టమాటా తినడం మధుమేహంలో ప్రయోజనకరంగా ఉంటుంది. కంటి చూపును మెరుగుపరుస్తుంది.



# నాగచైతన్య..సాయిపల్లవి డ్యాన్స్ సాంగ్

నవ యువ సామ్రాట్ నాగచైతన్య, లేడీ పవర్‌స్టార్ సాయి పల్లవి జంటగా నటిస్తోన్న రెండో చిత్రం 'తండేల్' పాన్ ఇండియాగా రూపొందుతున్న ఈ మూవీకి కార్తికేయ2 ఫేం చందూ మొండేటి దర్శకత్వం వహిస్తుండగా అల్లు అరవింద్ సమర్పణలో ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్స్2 బ్యానర్‌పై బన్నీ వాస్ నిర్మించారు. శ్రీకాకుళం జిల్లా డి.మచ్చిలేశం గ్రామంలో జరిగిన నిజ జీవిత సంఘటనల ఆధారంగా ఈ తండేల్ సినిమాను తెరకెక్కించడం విశేషం. వాస్తవ ఘటనలతో రూపొందిస్తున్న ఈ సినిమాలో ఇద్దరు ప్రేమికుల మధ్య వారి జీవితాల్లో సంభవించిన పరిస్థితులు, భావోద్వేగాలు ఇతర పరిస్థితులను చాలా గ్రిప్పింగ్‌గా, ఆకర్షణీయంగా తెరపై మలుస్తున్నాడు దర్శకుడు చందు మొండేటి. అదేవిధంగా దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీకాకుళంలోని పురాతన శివాలయం శ్రీముఖలింగం సన్నిధిలో ప్రతి ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలను ప్రేరణగా తీసుకుని ఈ సినిమా కోసం మునుపెన్నడూ చూడని రీతిలో ఓ ప్రత్యేక శివరాత్రి పాటను ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. ఈ క్రమంలో ఇప్పటికే శివరాత్రి ఉత్సవ వైభవాన్ని తెలియజేసేలా భారీ సెట్టింగ్‌లు మరియు అత్యంత వ్యయంతో అవార్డ్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ దేవీ శ్రీ ప్రసాద్ సంగీతం అందించగా శేఖర్ మాస్టర్ నృత్య దర్శకత్వంలో ఓ పాటను చిత్రీకరించారు. ఈ పాటలో నాగ చైతన్య, సాయి పల్లవిలతో పాటు వేలాది మంది డ్యాన్సర్‌లతో కలిసి డ్యాన్స్ చేశారు. అయితే ఈ పాట నాగ చైతన్య సాయి పల్లవిల కెరీర్‌లోనే మోస్ట్ స్పెషల్ సాంగ్స్ లో ఒకటిగా ఉండబోతుండగా దసరా పర్వదినం సందర్భంగా త్వరలోనే ఈ సాంగ్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్ర యూనిట్ ప్రయత్నం చేస్తోంది. ఈ మేరకు తాజాగా పాట షూటింగ్ సందర్భంగా తీసిన ఫోటోలను మేకర్స్ విడుదల చేశారు. కాగా ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేసేందుకు రెడీ అవుతున్నారు. త్వరలోనే అధికారికంగా రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేయనున్నారు.





# నారాయణమంత్రంపై కీరవాణి ఆడియో

### అభినందించిన డిప్యూటీ సిఎం పవన్

ఆస్కార్ విజేత, ప్రముఖ సంగీత దర్శకుడు ఎం. ఎం. కీరవాణికి ధన్యవాదాలు తెలుపుతూ ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓ ప్రకటనను విడుదల చేశారు. తిరుమల మహా ప్రసాదం అయిన లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగంపై పవన్ కళ్యాణ్ ఈ ఆవేదన నిమిత్తం ప్రాయశ్చిత్త దీక్షను చేపట్టిన విషయం తెలిసిందే. ప్రాయశ్చిత్త నిమిత్తం అంతా నారాయణ మంత్రం పఠిస్తున్నారు. అలా నారాయణ మంత్రం పఠించే వారందరి కోసం సంగీత దర్శకుడు కీరవాణి ఓ ఆడియో రికార్డ్ చేశారు. ఆడియో రికార్డ్ చేసిన కీరవాణికి, ఆయన టీమ్‌కు ధన్యవాదాలు తెలుపుతూ.. జనసేన పార్టీ తరపున పవన్ కళ్యాణ్ అధికారికంగా ఓ ప్రకటనను విడుదల చేశారు. అందులో.. 'ఓం నమో నారాయణాయ' మంత్రాన్ని ప్రజానీకం పఠించేందుకు అనువుగా ఆడియో రికార్డు రూపొందించిన ప్రముఖ సంగీత దర్శకులు ఎం.ఎం. కీరవాణిగారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. తిరుమల మహా ప్రసాదం లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం భక్తి భావం కలిగిన ప్రతి ఒక్కరికీ తీవ్ర ఆవేదన కలిగించింది. ఈ ఆవేదన నుంచే ప్రాయశ్చిత్త దీక్ష ప్రారంభించాను. ఈ దీక్షకు సంఘీభావంగా జనసేన నాయకులు, వీర మహిళలు, జన సైనికులతో పాటు ధార్మిక విశ్వాసాలు కలిగినవారందరూ ఆలయాల్లో పూజలు, హోమాలు, భజనలు చేస్తున్నారు. వారంతా ఓం నమో నారాయణాయ మంత్రం పఠిస్తున్నారు. అందుకు అనువుగా కీరవాణి ఆడియో రికార్డు చేశారు. భక్తి భావంతో సాగింది. ఇందులో భాగం పంచుకున్న సంగీత కళాకారులకి, సాంకేతిక నిపుణులకి ధన్యవాదాలు.




# జీబ్రా మూవీ టీజర్ విడుదల

యువ నటుడు సత్యదేవ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'జీబ్రా' లక్ ఫేవర్స్ ది బ్రేవ్.. అన్నది ఉపశీర్షిక. ఈ సినిమాకు ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహిస్తుండగా.. ఓల్డ్ టౌన్ పిక్చర్స్, పద్మ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఎస్‌ఎన్ రెడ్డి, బాలసుందరం, దినేష్ సుందరం సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీని అక్టోబర్ 31న తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ టీజర్ చూస్తుంటే యాక్షన్ క్రైమ్ కామెడీగా ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. మత్తు వదలరా ఫేం సత్య కూడా టీజర్‌లో మరోసారి నవ్వులు పూయించాడు. ప్రియా భవానీ శంకర్ , జెన్నిఫర్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో పుష్ప సినిమాతో ఫేమస్ అయిన ధనంజయ (జాలిరెడ్డి) విలన్ పాత్రలో నటిస్తున్నాడు. సునీల్ సత్యరాజ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



# చిన్న పాత్రల నుంచి స్టార్ హీరోయిన్ రేంజ్‌కి

స్టార్ స్టేటస్ సాధించిన అతికొద్ది మంది తెలుగు హీరోయిన్లలో రీతూవర్మ ఒకరు. ఎంతో శ్రమిస్తేగానీ ఆమె ఈ స్థాయికి రాలేదు. హీరోయిన్ ఫ్రెండ్స్‌లో ఒకరిగా ఆమె కనిపించిన సినిమాలు చాలా ఉన్నాయి. 'పెళ్లి చూపులు'తో హీరోయిన్ స్థాయికి చేరుకున్న రీతూ.. కనులు కనులను దోచాయంటే, వరుడు కావలెను, టక్ జగదీష్ చిత్రాలతో స్టార్ హీరోయిన్ రేంజ్‌కి ఎదిగింది. తెలుగు హీరోయిన్లలో ప్రామిసింగ్ యాక్ట్రెస్‌గా పేరు సంపాదించుకుంది. తమిళంలోనూ క్రేజీ ప్రాజెక్టులు చేస్తున్నది. ఇవే కాక హాట్‌స్టార్ కోసం ఓ వెబ్‌సిరీస్‌లో నటిస్తున్నది. ఇది తను చేస్తున్న తొలి సిరీస్. ఇదిలావుంటే.. 'స్వాగ్' సినిమాతో త్వరలో ఆమె ప్రేక్షకుల ముందుకు రానున్నది. ఇందులో వింధ్యామర వంశ మహారాణి రుక్మిణీదేవి పాత్రలో మెరవనున్నది రీతూ. ఈ సినిమాలో ఆమె పాత్ర హైలైట్‌గా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు.

# మిథున్‌కు తోటి నటుల ప్రశంసలు

### ఫాల్కే అవార్డుపై పవన్, బాలయ్య హర్షం

అత్యంత ప్రతిష్టాత్మకమైన 'దాదా సాహెబ్ ఫాల్కే' అవార్డుకు ఎంపికైన మిథున్ చక్రవర్తికి ప్రస్తుతం శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఏపీ డిప్యూటీ సీఎం మరియు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మిథున్ చక్రవర్తికి అభినందనలు తెలుపుతూ ఓ ప్రకటనను విడుదల చేశారు. ప్రముఖ నటులు, రాజ్యసభ సభ్యులు మిథున్ చక్రవర్తిగారికి దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం ప్రదానం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషాన్ని కలిగించింది. మిథున్ చక్రవర్తిగారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. హిందీ, బెంగాలీ చిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేశారు. 80వ దశకంలో దేశవ్యాప్తంగా యువతపై ఆయన ప్రభావం ఉంది. 'డిస్కో డ్యాన్సర్' చిత్రం ద్వారా ఆయన నృత్య శైలులు ఉర్రూతలూగించాయి. 'ఐ యామ్ ఏ డిస్కో డ్యాన్సర్...' అనే పాటను ఎవరూ మరచిపోలేరు. అని పేర్కొన్నారు. నటసింహం నందమూరి బాలకృష్ణ 'దాదా సాహెబ్ ఫాల్కే' పురస్కారానికి ఎంపికైన మిథున్ చక్రవర్తికి అభినందనలు తెలుపుతూ ఓ లేఖను విడుదల చేశారు. ఇందులో..విలక్షణ నటుడు, మిత్రుడు మిథున్ చక్రవర్తికి ప్రతిష్ఠాత్మకమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించడం హర్షించదగ్గ విషయం. తొలి చిత్రం 'మృగయా'తోనే నటునిగా తనదైన బాణీ పలికించి, జాతీయ స్థాయిలో ఉత్తమ నటునిగా నిలిచారు మిథున్ చక్రవర్తి. ఆరంభంలో వాస్తవ చిత్రాలతో సాగినా, తరువాత బాలీవుడ్ కమర్షియల్ మూవీస్‌లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించారు మిథున్. ముఖ్యంగా 'డిస్కో డాన్స్'కు మిథున్ చక్రవర్తి విశేషమైన పేరు సంపాదించి పెట్టారు. మిథున్ చక్రవర్తితో నాకు చిత్రబంధం ఉంది– అదెలాగంటే నేను సోలో హీరోగా బయటి సంస్థల చిత్రాలలో నటించడానికి తొలిసారి కెమెరా ముందుకు వచ్చిన చిత్రం 'డిస్కో కింగ్'. ఈ చిత్రానికి మిథున్ చక్రవర్తి హిందీ సినిమా 'డిస్కో డాన్సర్' ఆధారం. అలా మా ఇద్దరికీ చిత్రబంధం ఉంది. భారతీయ చలనచిత్ర పరిశ్రమలో అత్యుత్తమమైన 'దాదాసాహెబ్ ఫాల్కే' అవార్డుకు ఎంపికైన మిథున్ చక్రవర్తికి నా హృదయపూర్వక శుభాభినందనలు. మిథున్ నటునిగా మరెన్నో విలక్షణమైన పాత్రలలో మురిపిస్తూ సాగాలని ఆశిస్తున్నాను..' అంటూ నందమూరి బాలకృష్ణ ఈ లేఖలో పేర్కొన్నారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com